శుక్రవారం
9•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 243
• పేజీలు : 16 + (24/20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



అరుదైన అతిథుల ఆగమనం

వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలంలోని పెర్కవేడులో సైబీరియన్ పక్షులు సందడి చేస్తున్నాయి. ఏటా చలికాలం ముగుస్తున్న సమయంలో వచ్చి, వానాకాలం ప్రారంభం కాగానే తిరిగి వెళ్లిపోతాయి. పొద్దంతా దేవునికుంటలో ఆహార వేట సాగించి, సాయంత్రం గ్రామంలోని చెట్లపై సేదతీరుతున్నాయి. ఇక్కడే ఏర్పాటుచేసుకున్న గూళ్లలో గుడ్లు పెట్టి, మార్చి నెలలో పిల్లల్ని చేస్తాయి. జూన్‌నాటికి పిల్లలు ఎగిరే దశకు చేరుకుంటాయి. వానాకాలం ప్రారంభం కాగానే, పక్షులు పిల్లలతో కలిసి తిరిగి, సైబీరియాకు వెళ్లిపోతాయి. ఇలా ఏటా సైబీరియన్ పక్షులు పెర్కవేడు వాసులకు కనువిందు చేస్తున్నాయి. లక్షల సంఖ్యలో వచ్చే పక్షులను చూసి ఆనందించే గ్రామస్థులు వాటికి రక్షణ కూడా కల్పిస్తున్నారు.

మే ఆరున నీట్

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ మొదలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:

మెడికల్/డెంటల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-2018)ను మే నెల 6వ తేదీన నిర్వహించనున్నామని సీబీఎస్‌ఈ గురువారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ వైద్య/దంత కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల్లో చేరగోరే విద్యార్థులు నీట్ కోసం దరఖాస్తు చేసుకోనేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నది. మార్చి 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పరీక్షను హిందీ, ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, గుజరాతీ, తమిళం, కన్నడ, మరాఠీ, ఒరియా, బెంగాలీ, అస్సామీ భాషల్లో నిర్వహిస్తామని పేర్కొన్నది. నీట్ 2018 అధికార వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించింది. సీబీఎస్‌ఈ జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఓపెన్ స్కూల్ విద్యార్థులు నీట్ రాయడానికి అనర్హులు. భారత పౌరులు, ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐ), విదేశాలలో ఉన్న భారతీయులు (ఓసీఐ), విదేశాల్లో ఉన్న భారత సంతతికి చెందిన వారు (పీఐవో), విదేశీయులు నీట్-2018కు అర్హులు. అభ్యర్థులు ఎంబీబీఎస్/బీడీఎస్ మొదటి సంవత్సరం కోర్సులో చేరే సమయానికి లేదా ఈ ఏడాది డిసెంబర్ 31నాటికి 17 ఏండ్లు నిండినవారై ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 25 ఏండ్లుగా విధించారు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ విద్యార్థులకు ఐదేండ్ల సడలింపునిచ్చారు. ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా నీట్ రాయవచ్చని సీబీఎస్‌ఈ తెలిపింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు 2018-19 విద్యా సంవత్సరం నుంచి తమ ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల కేటాయింపులో 15% జాతీయ కోటాను అనుమతించాలని నిర్ణయించినందున ఆ రెండు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా 15% జాతీయకోటాకు అర్హత పొందుతారని వివరించింది. పూర్తి వివరాలు నీట్-2018 వెబ్‌సైట్ 'cbseneet.nic.in'లో ఉన్నట్టు సీబీఎస్‌ఈ పేర్కొంది.

రక్షణ ఉత్పత్తుల కారిడార్‌కు

హైదరాబాదే ఉత్తమం



హైదరాబాద్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

కేంద్ర బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ల ప్రకటన

ఒకటి తెలంగాణకు కేటాయించాలని రక్షణ మంత్రికి మంత్రి కేటీఆర్ వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను ఏర్పాటుచేయాలని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు కోరారు. గురువారం ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. నిర్మలా సీతారామన్‌ను కలిసిన సందర్భంగా.. కేంద్రప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌లను ప్రకటించిందని, ఇందులో ఒకటి హైదరాబాద్‌లో నెలకొల్పాలని విజ్ఞప్తిచేశారు. రక్షణరంగానికి హైదరాబాద్‌కు ప్రత్యేక అనుబంధం ఉన్నదని, రక్షణరంగ సంస్థలు, రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్ ముందువరుసలో ఉన్నదని గుర్తుచేశారు. రక్షణరంగంలో కీలకపాత్ర పోషించిన హైదరాబాద్‌లో రక్షణ ఉత్పత్తుల పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఫిక్కీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 19 వరకు హైటెక్స్‌లో జరిగే అంతర్జాతీయ మైనింగ్‌టుడే

మిగతా 2వ పేజీలో



ఖలీదాకు ఐదేండ్ల జైలు

బంగ్లాదేశ్ మాజీ ప్రధానికి ప్రత్యేక కోర్టు షాక్

5

గూగుల్‌కు సీసీఐ షాక్

రూ.136 కోట్ల జరిమానా

13

11 నుంచి సీఐఐ అగ్రిటెక్ సౌత్-2018 సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) అగ్రిటెక్ సౌత్-2018 సదస్సును ఈ నెల 11 నుంచి రెండురోజులపాటు నిర్వహించనున్నట్టు కార్యక్రమ నిర్వాహక కమిటీ చైర్మన్ అనిల్ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో నిర్వహించే సదస్సుకు 15 వేల మంది రైతులు, వ్యవసాయరంగాల్లో నిపుణులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయరంగ సమస్యలపై ప్రధానంగా చర్చించనున్నామని, సీఐఐ సదరన్ రీజియన్.. రాష్ట్రంలో మొదటిసారిగా సదస్సు నిర్వహిస్తున్నదని చెప్పారు. 'సాంకేతిక వినియోగదారులకు ఆచరణాత్మక పరిచయం' లక్ష్యంతో సమావేశం నిర్వహిస్తున్నామని, 2022 వరకు రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకొనే నిర్ణయాలపై చర్చించనున్నామని వివరించారు. 11వ తేదీ నుంచి మూడురోజులపాటు ఎగ్జిబిషన్ కూడా నిర్వహించనున్నట్టు అనిల్ చెప్పారు.

16 మంది ఐఏఎస్‌లకు పదోన్నతులు

- ఐదుగురు కార్యదర్శులకు ముఖ్య కార్యదర్శులుగా ప్రమోషన్
- పలువురికి సెలక్షన్ గ్రేడ్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ అధికారులుగా పదోన్నతి.. ఉత్తర్వుల జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం 16 మంది ఐఏఎస్‌లకు పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు కార్యదర్శులుగా ఉన్న 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు చంద్రవదన్, బూసాని వెంకటేశ్వర్లు, పార్థసారథి, శివశంకర్, వీఎన్ విష్ణుకు ముఖ్య కార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. 2004-05 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు కే నిర్మల, గౌరవ్ ఉప్పల్, ఇలంబర్తి, మాణిక్‌రాజ్, డాక్టర్ ఏ శరత్, ఎల్ శర్మన్‌కు సెలక్షన్ గ్రేడ్ అధికారులుగా, 2008-09 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు దేవసేన, సర్ఫరాజ్ అహ్మద్, ఎన్ సత్యనారాయణ, అర్వింధర్‌సింగ్, ప్రశాంతికి జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ అధికారులుగా పదోన్నతులు కల్పించారు.

12 మంది ఐపీఎస్‌లకు పదోన్నతి

- జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్‌కు ప్రమోషన్.. ఉత్తర్వుల జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పనిచేస్తున్న 2005, 2006 బ్యాచ్‌లకు చెందిన 12 మంది ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్‌కు పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందినవారిలో 2005 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్‌లు వీ శివకుమార్, వీబీ కమలాసన్‌రెడ్డి, ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్, పీ విశ్వప్రసాద్, ఎం రమేశ్, 2006 బ్యాచ్‌కు చెందిన కే రమేశ్‌నాయుడు, ఏవీ రంగనాథ్, బీ సుమతి, ఎం శ్రీనివాసులు, వీ సత్యనారాయణ, ఏ వెంకటేశ్వరరావు ఉన్నారు.

జోనల్ వ్యవస్థలో అన్ని జిల్లాలకు న్యాయం!

- సీఎంకు చేరిన క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక
- ధ్రువీకరించిన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

జోనల్ వ్యవస్థలో మార్పులు, చేర్పులపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఇటీవల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు నివేదికను అందజేసింది. ఈ విషయాన్ని గురువారం సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులకు సబ్ కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ధ్రువీకరించారు. నివేదికలోని అంశాలను చెప్పడానికి ఆయన నిరాకరించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తెలంగాణ ప్రాంత నిరుద్యోగులకు ప్రయోజనం కలిగేలా జోనల్ వ్యవస్థలో చిన్నచిన్న మార్పులు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ స్థానిక ఉద్యోగులకు న్యాయం చేయడం కోసం వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల వెలుగులో జోనల్ వ్యవస్థ ఏర్పడింది. నాడు రాష్ట్రంలో ఆరుజోన్లు ఉండగా, తెలంగాణ ప్రాంతం 5, 6 జోన్లలో ఉన్నది. హైదరాబాద్‌లో ఉద్యోగాలను కాజేసేందుకు సీమాంధ్ర అధికారులు లేని జోన్‌ను సృష్టించారు. ఫ్రీ జోన్ అంటూ అడ్డగోలు నియామకాలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క జిల్లాకు అన్యాయం జరుగకుండా ఉండేలా జోనల్ వ్యవస్థను ప్రతిపాదించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని 31 జిల్లాలను నాలుగు జోన్లుగా, రాష్ట్రంలోని ఉద్యోగులను మూడు (లోకల్, జిల్లా, రాష్ట్ర) క్యాడర్లుగా ప్రతిపాదించినట్టు సమాచారం. మల్టీజోన్ వ్యవస్థ వద్దన్న నిర్ణయానికి సబ్ కమిటీ వచ్చినట్టు తెలిసింది. తెలంగాణ నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్రస్థాయి క్యాడర్ పోస్టుల సంఖ్యను కుదించినట్టు తెలిసింది. సబ్ కమిటీ ఇచ్చిన ఈ నివేదిక సీఎం ఆమోదం పొందాక క్యాబినెట్‌కు వెళుతుంది. క్యాబినెట్ ఆమోదించాక ఫైల్‌ను గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ కోసం కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. రాష్ట్రపతి సంతకం తరువాతే సవరించిన ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ఓ సీనియర్ అధికారి చెప్పారు.

టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు

- కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడంలేదు
- ప్రతిపక్షాల దగ్గర సరుకులేదు
- టీఆర్‌ఎస్ అధికారంలోకి రాకముందే రాజకీయాల్లో హరీశ్‌రావు, కేటీఆర్
- ప్రజామోదం ఉన్న నేతలు కేటీఆర్, హరీశ్, కవిత
- క్షేత్రస్థాయిలో ఆలోచించి సంక్షేమ పథకాలను రూపొందించిన సీఎం కేసీఆర్
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రసమితికి ప్రత్యామ్నాయంగా నిలిచే రాజకీయ పార్టీ ప్రస్తుతానికి లేదని.. ఇతర పార్టీల పట్ల ప్రజల్లో విశ్వాసం పోయిందని పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. 70 ఏండ్ల ఉమ్మడి పాలనలో తెలంగాణ కోల్పోయిన వనరులను, అవకాశాలను తిరిగి సాధించుకొనేలా సీఎం కేసీఆర్ పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలుచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ కాకుండా మరొకరు ముఖ్యమంత్రి అయినట్టయితే రాష్ట్ర పరిస్థితి దారుణంగా ఉండేదని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి బాటలు వేసిందని చెప్పారు. గురువారం మంత్రి తలసాని విలేఖరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆసరా ఫించన్లు, కల్యాణలక్ష్మి, హరితహారం, డబుల్‌బెడ్రూం ఇండ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్, చేపపిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీ, కేసీఆర్ కిట్, వెల్‌నెస్ సెంటర్లు, గురుకుల పాఠశాలల ఏర్పాటు, కేజీ టు పీజీ ఉచిత విద్య, ఐటీ హబ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల పెంపు, 24 గంటల విద్యుత్ సరఫరా, రుణమాఫీ, ఎకరానికి రూ. 4వేల పెట్టుబడి పథకం వంటి సంక్షేమ పథకాల ఫలితాలు ప్రజలు పొందుతున్నారని చెప్పారు. మూడున్నరేండ్లుగా ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలకు కంటగింపుగా మారిందని విమర్శించారు. ప్రభుత్వాన్ని విమర్శించడానికి విపక్షాల దగ్గర సరైన సబ్జెక్టు లేకపోవడంతో మూడున్నరేండ్లుగా ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయలేక.. సీఎం కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడకముందునుంచే ఎమ్మెల్యేలుగా ఉన్నారని, ప్రభుత్వంలో వారికి కేటాయించిన శాఖల్లో జెట్‌స్పీడ్‌తో ముందుకు దూసుకెళ్తూ.. ప్రత్యేక గుర్తింపు పొందారని మంత్రి తలసాని చెప్పారు.



నిరాధార ఆరోపణలు

మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ పథకాల్లో అవినీతి జరిగిందని పదే పదే విమర్శలు చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందుకు సంబంధించిన ఆధారాలు చూపాలని డిమాండ్‌చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య అకస్మాత్తుగా జరిగిందని, అతనిని అనుచరులే హత్యచేశారని తెలిపారు. కాంగ్రెస్ నేతల అంతర్గత రాజకీయాలతో జరిగిన హత్యకు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తలసాని విమర్శించారు. ప్రతిపక్షాలకు సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్‌పై అవగాహన లేదని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ తెలంగాణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ పెద్ద ఎత్తున వేతనాలు పెంచారన్నారు. 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని తెలిపారు. ప్రతి మండలంలో మార్కెటింగ్ గోదాములను నిర్మించామని, పేద ప్రజలు ఊహించని విధంగా డబుల్‌బెడ్రూం ఇండ్లను ఉచితంగా నిర్మిస్తున్నామని వివరించారు. పాల ఉత్పత్తిదారుల సంఘాలకు లీటర్‌కు రూ. 4 అదనపు ప్రోత్సాహకాన్ని ప్రకటించామని, విజయా డైరీని రూ.178 కోట్లతో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని...శామీర్‌పేటలో 100 ఎకరాలతో మరో యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గొల్ల-కుర్మలకు రూ.1800 కోట్లతో 42 లక్షల గొర్రెలను, మత్స్యకారుల సంక్షేమం కోసం 52 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేసినట్లు చెప్పారు. 18 నీటి వనరుల్లో 1.20 లక్షల మంచినీటి రొయ్యలను పెంచుతున్నట్లు మంత్రి తలసాని చెప్పారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రధానమంత్రితోపాటు కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ప్రశంసించడమే కాకుండా... ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వ సహకారాన్ని కోరుతున్నారని మంత్రి వెల్లడించారు. ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించాలనే ఆలోచన చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని 108 కులాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వీలుగా పథకాలను రూపొందించి అమలు చేసిన ఘనత తెలంగాణకు దక్కుతుందన్నారు. మే నెల నుంచి వ్యవసాయానికి ఎకరానికి రూ.4 వేల ముందస్తు పెట్టుబడి అందించనున్నామని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి

- విభజన హామీలు అమలుచేయాలి
- జీఎస్టీ, నోట్లరద్దుకు మద్దతిచ్చాం.. కేంద్రం అండగా నిలువలేదు
- భాగస్వామ్యపక్షంగా ఉండి ఆందోళన చేస్తే దేశానికి తప్పుడు సంకేతాలు
- ఏపీ ఎంపీల ఆందోళనలకు మద్దతు
- లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కేంద్ర బడ్జెట్‌లో రైతులను విస్మరించారని, వ్యాపారరంగానికి ఇచ్చినంత ప్రాధాన్యం వ్యవసాయానికి ఇవ్వడం లేదని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర బడ్జెట్‌ను చూసి రైతులు నిరుత్సాహపడ్డారని పేర్కొన్నారు. గురువారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో కవిత మాట్లాడుతూ.. 2022 సంవత్సరం వరకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించారని, కానీ బడ్జెట్ కేటాయింపులు, కార్యాచరణ ఆ దిశగా లేవని చెప్పారు. బీజేపీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అని, దేశం యావత్తు బడ్జెట్ కేటాయింపుల కోసం ఎదురుచూసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న కీలక నిర్ణయాలైన జీఎస్టీ, నోట్ల రద్దుకు తాము మద్దతు తెలిపామని.. కానీ, కేంద్రం తెలంగాణకు అండగా నిలువలేకపోయిందని అన్నారు. బడ్జెట్‌లో ఫర్టిలైజర్స్‌కు రూ.70వేల కోట్ల సబ్సిడీ ఇచ్చారని, దేశంలో ఆహారభద్రత తర్వాత ఇదే అతిపెద్ద సబ్సిడీ అని పేర్కొన్నారు. ఎరువులను విదేశాల నుంచి దిగుమతి చేసుకొంటున్నారని, దేశంలోనే తయారుచేసేవిధంగా ప్రోత్సహించాలని సూచించారు. మైక్రో ఇరిగేషన్‌కు కేంద్రం 35 శాతం సబ్సిడీ ఇస్తున్నదని, ఈ నిధులను విడుదలచేయాలని ఆమె డిమాండ్‌చేశారు. రైతును యూనిట్‌గా తీసుకొని బీమా అమలు చేయాలని కోరారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధరను అమలు చేయాలన్నారు. ప్రస్తుతం 26 పంటలకు మద్దతు ధర ఇస్తున్నారని, గోధుమ, వరి పంటలో 30 శాతం దిగుబడిని మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తున్నదని పేర్కొన్నారు. పెస్టిసైడ్స్ 1968 చట్టానికి సవరణలు తీసుకొస్తూ 2004లో రూపొందించిన బిల్లు.. సభ ఆమోదం పొందకపోవడంతో రద్దయ్యిందని గుర్తుచేశారు. దీనితోపాటుగా నాబార్డు బిల్లు, కోల్డ్‌స్టోరేజీ బిల్లు, సీడ్‌బిల్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దేశంలో సాగునీటిరంగానికి నిధుల కేటాయింపులు తక్కువగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా.. కేంద్రం నుంచి సరైన స్పందన లేదని పేర్కొన్నారు. ప్రాజెక్టును కేంద్రం చేపట్టకపోయినా కనీసం పూర్తి ఆర్థికసాయమైనా అందించాలని డిమాండ్‌చేశారు. విభజన చట్టంలో తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వంలో ఉండి పోరాటం చేయడం వల్ల దేశంలో తప్పుడు సంకేతాలు వెళ్తాయని చెప్పారు. ఏపీకి చెందిన టీడీపీ, వైసీపీ ఎంపీల ఆందోళనకు ఆమె మద్దతు తెలిపారు.



గురువారం లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

ముహూర్తం

సూర్యోదయం: 6.49 గంటలకు

సూర్యాస్తమయం: 6.11 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం నవమి మధ్యాహ్నం 12.18 వరకు తదుపరి దశమి, నక్షత్రం: అనూరాధ సాయంత్రం 4.56 వరకు, తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: తె. 5.25 నుంచి ఉదయం 7.01 వరకు, రాహుకాలం: ఉదయం 11.05 నుంచి 12.30 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.06 నుంచి 9.51 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.53 నుంచి 1.39 వరకు, వర్జ్యం: రాత్రి 11.14 నుంచి 12.50 వరకు.

లోకం పోకడ



'కింగ్ కాంగ్' సిన్మాకాదు, బిజినెస్ వార్తలు!





గురువారం ఢిల్లీలో కేంద్ర గనులశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, కేంద్ర అటవీ పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్‌తో భేటీ అయిన మంత్రి కేటీఆర్. చిత్రంలో టీఆర్‌ఎస్ ఎంపీలు

.. హైదరాబాదే ఉత్తమం

మొదటిపేజీ తరువాయి...

సదస్సు, ప్రదర్శన ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర గనులశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌ను, ముగింపు కార్యక్రమానికి రావాలని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి ఆహ్వానించారు. అనంతరం కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో కూడా మంత్రి కేటీఆర్ కలిసి పలు అంశాలపై చర్చించారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మంత్రి కేటీఆర్, నాస్కామ్ ప్రతినిధులు కలువనున్నారు. హైదరాబాద్‌లో జరిగే వరల్డ్ ఐటీ కాంగ్రెస్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్రపతిని వీరు ఆహ్వానిస్తారు.

ఫార్మాసిటీ అనుమతులు వేగం చేయండి

హైదరాబాద్‌లో నెలకొల్పనున్న ప్రపంచంలోనే అతి పెద్దదైన ఫార్మాసిటీకి అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను మంత్రి కోరారు. ఫార్మాసిటీ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రత్యేకతలను కేంద్రమంత్రికి వివరించారు. కాలుష్యానికి ఏ మాత్రం ఆస్కారం లేకుండా నిర్మించనున్న ఫార్మాసిటీతో తెలంగాణతోపాటు దేశానికి కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. దేశంలో యాంటిబయోటిక్స్ ఇతర ఔషధాలు 84శాతం వరకు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయని కేటీఆర్ వెల్లడించారు. ఫార్మాసిటీతో ఔషధాల దిగుమతి చాలావరకు తగ్గుతుందని స్పష్టంచేశారు. ఈ క్లస్టర్‌తో భారీగా పెట్టుబడులు రావడంతోపాటు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఫార్మాస్యూటికల్ శాఖ కూడా ఈ ప్రాజెక్టుకు మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఫార్మాసిటీకి వెంటనే పర్యావరణ అనుమతివ్వాలని హర్షవర్ధన్‌ను కోరారు. మంత్రి కేటీఆర్‌తోపాటుగా కేంద్ర మంత్రులను కలిసిన వారిలో టీఆర్‌ఎస్ లోక్‌సభ పక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పసునూరి దయాకర్, బీబీ పాటిల్, జీ నగేశ్ ఉన్నారు.

విద్యాసంస్థలకు గ్రేడింగ్!

- అధికారులకు సీఎస్ ఎస్కే జోషి ఆదేశాలు
- వివిధశాఖల పథకాలు, కార్యక్రమాలపై సమీక్ష
- 1,73,406 ఇండ్ల నిర్మాణానికి టెండర్ల ఖరారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నాణ్యత ప్రమాణాల అమలుపై కాలేజీలు, స్కూళ్లు, హాస్టళ్లకు గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను, భోజనాన్ని అందించాలన్నారు. గురువారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళాసంక్షేమం, విద్య, ఇంధన, గృహనిర్మాణం, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్, పర్యాటక, యువజన సంక్షేమం, వైద్యఆరోగ్య, కార్మికశాఖల ఉన్నతాధికారులతో సమావేశమై వివిధ పథకాలను సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతీ విద్యార్థికి గురుకులాల్లో అడ్మిషన్ లభించేలా చర్యలు తీసుకోవాలని, ఉన్నత విద్యాసంస్థలలో మరిన్ని సీట్లు పొందేలా విద్యార్థులను తీర్చదిద్దాలని ఆదేశించారు. యువత ఉద్యోగాలు పొందేలా స్టడీసర్కిళ్ల ద్వారా శిక్షణ ఇవ్వాలన్నారు. ఇంటర్ పరీక్షలతోపాటు, వివిధ సెట్ల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. స్వయం ఉపాధి, శిక్షణ, విదేశీ విద్యాపథకాల అమలు కార్యక్రమాలను విస్తృతపరుచాలన్నారు. వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ ఇస్తున్నందున పీక్ అవర్స్‌లో విద్యుత్ డిమాండ్ 8640 మెగావాట్లకు చేరుకుందని, గత ఏడాదితో పోలిస్తే 20 శాతం డిమాండ్ పెరిగిందని విద్యుత్‌శాఖ అధికారులు వివరించారు. వేసవిలో పీక్ అవర్స్ విద్యుత్ డిమాండ్ 11 వేల మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా వేసినట్టు తెలిపారు. దాంతో 1700 మెగావాట్ల డిమాండ్‌ను తట్టుకునేలా రాష్ట్ర విద్యుత్ వ్యవస్థలను పటిష్ఠం చేయాలని, వేసవిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలో 58,024 గృహాల నిర్మాణం పూర్తయ్యిందని, మరో1,38,795 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లనిర్మాణం మొదలైందని తెలిపారు. 1,73,406 ఇండ్ల నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని, నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, చిత్రారామచంద్రన్, ముఖ్యకార్యదర్శులు సునీల్‌శర్మ, వికాస్‌రాజ్, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, కార్యదర్శులు నవీన్ మిట్టల్, బీ వెంకటేశం, బెనహర్ మహేశ్‌దత్‌ఎక్కా, జగదీశ్వర్, అనితారాజేంద్ర, దానకిశోర్, చిరంజీవులు, జ్యోతిబుద్ధప్రకాశ్, అధికారులు అశోక్, కిషన్, నీతూప్రసాద్, క్రిస్టినాచొంగ్త్, ప్రవీణ్‌కుమార్, పౌసమీబసు, రఘుమారెడ్డి, రమణారావు, గణపతిరెడ్డి పాల్గొన్నారు.



గురువారం సచివాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో వివిధ శాఖల కార్యదర్శులు కూడా ఉన్నారు.

తెలంగాణకు 17.90 టీఎంసీలు

- ఏపీకి 17.09 టీఎంసీలు
- ఫిబ్రవరికి కృష్ణాబోర్డు ఉత్తర్వులు
- ఇండెంట్లలో ఏపీ నాటకీయత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణానది నీటిని వీలైనంతవరకు అక్రమంగా తరలించుకొపోయేందుకు ఆంధ్రప్రదేశ్ శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉంది. తాజాగా సుమారు నాలుగు టీఎంసీలకు లెక్కలు చెప్పకుండానే.. గరిష్ఠంగా నీటిని తీసుకొపోవాలని చేసిన నాటకీయ ప్రయత్నాల నేపథ్యంలో.. గురువారం సాయంత్రం కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఇరు రాష్ట్రాలకు 34.990 టీఎంసీలను ఫిబ్రవరి నెల అవసరాల కోసం విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. శ్రీశైలం నుంచి 26 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్‌కు (కుడి విద్యుత్ కేంద్రం ద్వారా) విడుదలచేయాలని, ఇందులో నుంచి తెలంగాణకు 17.90 టీఎంసీలు, ఏపీకి 17.09 టీఎంసీలు నీటిని విడుదలచేయాలని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ఈ నెల 6వరకు నాగార్జునసాగర్ కుడికాల్వ ద్వారా 67.105 టీఎంసీలు వాడుకోగా, 0.35 టీఎంసీలు బ్యాలెన్స్ ఉన్నట్టు అదేరోజు రాసిన లేఖలో పేర్కొంది. ఫిబ్రవరి నెలకు 11టీఎంసీలు అవసరమని, మొత్తంగా కుడికాల్వ ద్వారా 11.35 టీఎంసీలు విడుదలచేయాలని కోరింది. నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద 7.27 టీఎంసీలే వాడుకొన్నామని, మిగిలిన 4.73 టీఎంసీలతోపాటు ఫిబ్రవరి అవసరాలకు మరో 4.35 టీఎంసీలతో కలుపుకొని మొత్తం 8.98 టీఎంసీలు కావాలంది. కృష్ణాడెల్టా కింద 14.204 టీఎంసీలే వాడుకొన్నామని మిగిలిన 6.79 టీఎంసీలు కావాలని కోరింది. మొత్తం 27.12 టీఎంసీలు విడుదల చేయాలంటూ ఏపీ జల వనరులశాఖ ఈఎన్సీ.. కేఆర్‌ఎంబీకి లేఖ రాశారు. హంద్రీనీవా సుజల స్రవంతి, ముచ్చుమర్రిని కలుపుకొంటే.. ఏపీకి రావాల్సినదానికంటే ఎక్కువ నీటిని వాడుకొన్నట్టుగా అర్థమవుతున్నదని, కాబట్టి మరో ఇండెంట్ ఇవ్వాలని కేఆర్‌ఎంబీ సభ్య కార్యదర్శి సూచించారు. దీనితో ఏపీ ఈఎన్సీ గురువారం మరో ఇండెంట్ పంపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా అనుమతించిన దానికన్నా 0.20 టీఎంసీలు.. హంద్రీనీవా, ముచ్చుమర్రిద్వారా ఓ టీఎంసీ అదనంగా వాడుకొన్నట్టు చెప్పారు.

తప్పుడు లెక్కలు

కేఆర్‌ఎంబీ జారీచేసిన ఉత్తర్వుల్లో ఓ మతలబు ఉంది. పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, ముచ్చుమర్రి నుంచి తీసుకొన్న నీటి గురించి గురువారం ఏపీ వివరాలివ్వగా, అదేరోజు సాయంత్రం కేఆర్‌ఎంబీ జారీచేసిన ఉత్తర్వుల్లో.. బుధవారం నాటికే లెక్కలు వేసి ఎంత నీటిని ఏయే ప్రాజెక్టుల ద్వారా తీసుకోవాలో పేర్కొన్నారు. ఏపీ నుంచి ఎంత ఇండెంట్ వస్తుందనేది ఒకరోజు ముందుగానే కేఆర్‌ఎంబీ ఎలా పసిగట్టిందనేది ప్రశ్న. ఏపీ తాజాగా రాసిన లేఖలో ఫిబ్రవరి 6 నాటికి నాగార్జునసాగర్ కుడికాల్వ ద్వారా 67.873 టీఎంసీలు వాడుకొన్నట్టు పేర్కొనగా.. కేఆర్‌ఎంబీ మాత్రం ఈ నెల 7వ తేదీ నాటికి 67.851 టీఎంసీలు వాడుకొన్నట్టుగా చెప్పడం మరోకోణం.

ఇంటికో బర్రె పథకానికి రూ.900 కోట్లు

- రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాడిరైతులకు సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించినట్టుగా ఇంటికో బర్రె పథకానికి ఈ బడ్జెట్‌లో శ్రీకారం చుట్టనున్నారు. దీనికి రానున్న బడ్జెట్‌లో రూ. 900 కోట్లను కేటాయించనున్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కొత్త పథకాన్ని రూపొందిస్తున్నారు. పాడి రైతుల సహకార సంఘాల్లోని సభ్యులకు ఇంటికో బర్రె చొప్పున పంపిణీ చేయాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విజయా, మదర్, కరీంనగర్, ముల్కనూర్ డైరీ సహకార సంఘాలున్నాయి. వీటి పరిధిలో 2.15 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఒక్కో రైతుకు ఒక్కో బర్రె చొప్పున రాయితీ కింద పంపిణీ చేయాలని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా పశు సంవర్ధకశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం, మిగతా వారికి 50 శాతం రాయితీతో పాడి బర్రెలను అందించాలని ప్రతిపాదించారు. పంజాబ్, హర్యానా వంటి ఉత్తరాది రాష్ట్రాల మేలు జాతి బర్రెలను మాత్రమే రైతులకు అందించేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఒక్కో బర్రె ధర రూ.65 వేల నుంచి రూ.90 వేల వరకు అవుతుందని అంచనా. మొత్తంగా బర్రెల పంపిణీకి రూ. 900 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పశు సంవర్ధకశాఖ ప్రతిపాదనలు సిద్ధంచేసింది. దీనిపై సీఎం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది.

ఆరు వర్సిటీలకు కలిపి ఉమ్మడి పీజీసెట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ తదితర పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశ పరీక్షలను ఈసారి అన్ని యూనివర్సిటీలకు కలిపి ఉమ్మడిగా నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ పరీక్షలను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని యోచిస్తున్నది. ఇప్పటికే ఎంసెట్‌తోపాటు ఐసెట్, ఎడ్‌సెట్, పీజీఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. గురువారం ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం, కేయూ వీసీ ప్రొఫెసర్ సాయన్న, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వెంకటరమణ తదితరులతో ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి సమావేశం ఏర్పాటుచేశారు. రాష్ట్రంలోని ఆరు వర్సిటీల్లో పీజీ అడ్మిషన్ల కోసం ఉమ్మడి ప్రవేశపరీక్ష మార్గదర్శకాల రూపకల్పనపై చర్చించారు. మార్చి మొదటివారంలో పీజీసెట్ నోటిఫికేషన్ జారీచేయాలని భావిస్తున్నారు. రాతపరీక్ష తేదీతోపాటు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ, పీజీసెట్ నిర్వహణ బాధ్యతల అప్పగింత, కన్వీనర్ నియామకం, సిలబస్ రూపకల్పనపై త్వరలో ఏర్పాటుచేసే వీసీల సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని పాపిరెడ్డి తెలిపారు.

వేసవిలో తాగునీటి కొరత రావొద్దు



సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి ఉన్నారు.

- ఓఆర్‌ఆర్ బయట, లోపల సమాంతరంగా పనులు జరుగాలి
- మిషన్ భగీరథ పనులపై సమీక్షలో వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డు బయట చేపట్టిన తరహాలోనే ఓఆర్‌ఆర్ లోపల కూడా అర్బన్ మిషన్ భగీరథ పనులు సమాంతరంగా నిర్వహించాలని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క గ్రామంలోనూ వేసవిలో తాగునీటి కొరత తలెత్తకూడదన్న సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. మిషన్ భగీరథ పనుల పురోగతిపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో ప్రశాంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ వేసవికి ఔటర్ రింగ్‌రోడ్ లోపల ఉన్న గ్రామాలకు బల్క్‌గా నీటిని సరాఫరా చేయాలని సూచించారు. సమావేశంలో హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఎండీ దానకిశోర్, ఈడీ సత్యనారాయణ, ఆర్ డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెలరోజుల్లో భగీరథ నీరు : ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

నెలరోజుల్లో మిషన్ భగీరథలోని అన్నిసెగ్మెంట్లను నీటి సరఫరాకు సిద్ధంచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి చెప్పారు. గుట్టల దగ్గర పంపింగ్‌తో వచ్చే ఒత్తిడి (ప్రెజర్) తగ్గించడానికి అవసరమైన సర్జ్ ప్రొటెక్షన్ డివైజ్‌లను నాలుగైదు రోజుల్లో బిగించాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అన్నిజిల్లాల ఎస్‌ఈ, ఈఈలతో మిషన్ భగీరథ పనుల పురోగతిపై సురేందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇందులో చీఫ్ ఇంజినీర్లు కృపాకర్ రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయప్రకాశ్ పాల్గొన్నారు.



గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ మధుసూదనాచారి. చిత్రంలో కమిటీ సభ్యులు నారదాసు లక్ష్మణ్‌రావు, జలగం వెంకట్రావ్, జీ కిషన్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

- సమగ్ర నివేదిక రూపొందించండి
- వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశంలో స్పీకర్ మధుసూదనాచారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అప్రమత్తత ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని స్పీకర్ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. పర్యావరణం, వన్యప్రాణి సంరక్షణపై ఏర్పాటైన అసెంబ్లీ కమిటీ తొలి సమావేశం బుధవారం స్పీకర్ అధ్యక్షతన అసెంబ్లీ కమిటీహాల్‌లో జరిగింది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతం మధ్యలో ఉన్న తెలంగాణలో అద్భుతమైన అటవీ ప్రాంతాలు, సహజ ఆవాసాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు ఎన్నో ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవటంతోపాటు పర్యాటకంగా దేశంలోనే గొప్ప ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు స్పీకర్ సూచించారు. వన్యప్రాణుల రక్షణ, అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎకో టూరిజం అభివృద్ధిపై సమగ్ర నివేదిక తయారుచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆ నివేదికను అసెంబ్లీ కమిటీ తరపున ప్రభుత్వానికి పంపుదామని చెప్పారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆహ్వానం మేరకు హరితహారం, అటవీ పునరుద్ధరణ పనులు, అర్బన్ పార్కులను అసెంబ్లీ కమిటీ సందర్శిస్తుందని స్పీకర్ తెలిపారు. అటవీశాఖ తరపున చేపట్టిన కార్యక్రమాలను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్) పీకే ఝా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నారదాసు లక్ష్మణ్‌రావు, మహ్మద్ ఫరీదుద్దీన్, జలగం వెంకట్రావు, జీ కిషన్‌రెడ్డి, దివాకర్‌రావు, బాపురావు రాథోడ్, గువ్వల బాలరాజు, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్, సీఎంవో ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టెలి కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు టెలిఫోన్ ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. పరీక్షలు పూర్తయ్యే వరకు 40 రోజులపాటు ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీనికి ప్రత్యేకంగా సెంటర్ ఏర్పాటుచేసి ఇందులో ఇద్దరు కౌన్సెలర్లను నియమిస్తారు. విద్యార్థులు ఫోన్ చేయడానికి వీలుగా టెలిఫోన్ నంబర్లను త్వరలో ప్రకటిస్తామని, విధివిధానాలు రూపొందించి అమలుచేయాలని అధికారులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్ ఆదేశించినట్టు తెలిసింది.

నకిలీ రైతులపై కఠినచర్యలు

- అసలు రైతులే లబ్ధిపొందాలి
- జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- మార్కెట్‌యార్డుల్లోనే కొనుగోలు కేంద్రాలు
- మార్కెట్లో ధర తగ్గగానే కొనుగోలు కేంద్రాలు తెరువాలి
- మార్కెటింగ్‌శాఖ మంత్రి టీ హరీశ్‌రావు



గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో మండలిలో చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుల ముసుగులో క్రయవిక్రయాలు నిర్వహించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదుచేయాలని మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. నకిలీ రైతుల పట్ల జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇలాంటి ఘటనలపై ఆయా జిల్లా కలెక్టర్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. అసలు రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను ఇకపై వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఏర్పాటుచేయాలని ఆదేశించారు. గురువారం ఆయన మార్కెటింగ్‌శాఖ కార్యకలాపాలు, కందులు, శెనగలు, వేరుశెనగ వంటి పంట కొనుగోలు కేంద్రాల అమలుతీరు, ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి హరీశ్‌రావు ఆ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గిన వెంటనే శెనగలు, వేరుశనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మంత్రి సూచించారు. మార్కెట్ యార్డుల వెలుపల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయొద్దని చెప్పారు. కందులను కొనుగోలు చేస్తున్న సొసైటీల కొనుగోలు కేంద్రాలను సమీపంలోని మార్కెట్ కమిటీతో అనుసంధానించాలని మంత్రి సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన రైతుల వద్ద నుంచి ప్రభుత్వ కొనుగోళ్లు జరిగేలా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులను మార్కట్‌కు తీసుకొని రాకముందే నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఇప్పటివరకు జరిగిన కందుల కొనుగోళ్లను ఆయన సమీక్షించారు. కందుల సేకరణ సందర్భంగా కొన్నిచోట్ల.. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసి మార్కెట్ కమిటీల్లో జరిగే క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలని కలెక్టర్లను కోరారు. 25 క్వింటాళ్లకు మించి అదనంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వ్యక్తులపై నిఘా పెట్టాలని సూచించారు. రైతులు ఎంత విస్తీర్ణంలో పండించారో సరాసరి తనిఖీ చేయాలని చెప్పారు. వ్యవసాయశాఖ స్థానిక ఎగ్జిక్యూటివ్ అధికారుల నుంచి రైతులు ధ్రువీకరణ పత్రం పొందాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. కొనుగోలు, చెల్లింపుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారధి, వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భారీ నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గం దాతర్‌పల్లి గ్రామ రైతులు తాము సేంద్రియ వ్యవసాయ విధానంలో పండించిన బియ్యాన్ని గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో హరీశ్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సేంద్రియ వ్యవసాయంతో పండించిన బియ్యం, కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మంచివని పేర్కొన్నారు. దీని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చునని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు పది గ్రామాలు సేంద్రియ వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలకు రైతుబజారుల్లో ప్రత్యేక స్టాళ్లు పెట్టనున్నట్టు చెప్పారు.

ట్రిపుల్ తలాక్ బిల్లు తప్పుల తడక

- అందుకే వ్యతిరేకిస్తున్నాం
- నేటినుంచి ఏఐఎంపీఎల్‌బీ ప్లీనరీ
- బోర్డు అధికార ప్రతినిధి ఖలీల్ ఉర్ రహ్మాన్ నౌమానీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ట్రిపుల్ తలాక్ బిల్లులో అనేక లోపాలు ఉన్నాయని, ఇది తప్పులతడకగా, మోసగించేలా ఉండటం వల్లే ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) వ్యతిరేకిస్తున్నదని ఆ బోర్డు అధికార ప్రతినిధి మౌలానా సయ్యద్ ఖలీల్ ఉర్ రహ్మాన్ సజ్జాద్ నౌమానీ స్పష్టం చేశారు. ఆ బిల్లులోని లోపాలను, తప్పులను తొలిగిస్తే దానిని బోర్డు వ్యతిరేకించబోదని చెప్పారు. సంతోష్‌నగర్ వద్ద ఒవైసీ దవాఖాన ప్రాంగణంలో ఉన్న సాలారే మిల్లత్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు ఏఐఎంపీఎల్‌బీ 26వ ప్లీనరీ జరుగనున్న నేపథ్యంలో బోర్డు కార్యదర్శులు మౌలానా ఖాలేద్ సైఫుల్లా రహ్మానీ, మౌలానా ఉమ్రేన్, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కమిటీ కార్యదర్శి మౌలానా రహీముద్దీన్ అన్సారీలతో కలిసి గురువారం ఆయన ప్లీనరీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ఈ బిల్లులోని పలు క్లాజులు, అంశాలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా, ప్రాథమిక హక్కులు, మానవ స్వేచ్ఛను అణచివేసేలా ఉన్నాయని ఆరోపించారు. ప్లీనరీ సమావేశాలకు దేశంలోని సుమారు 500కుపైగా ప్రతినిధులు హాజరవుతారని బోర్డు కార్యదర్శి తెలిపారు. ఈ నెల 11న దారుస్సలాంలో బహిరంగ సభ ఉంటుందన్నారు.



సంతోష్‌నగర్‌లోని ప్లీనరీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతున్న ఏఐఎంపీఎల్ బీ అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్ ఉర్ రహ్మాన్ సజ్జాద్ నౌమానీ. చిత్రంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఉన్నారు.

15వ ఆర్థికసంఘం సమావేశం నేడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శుక్రవారం 15వ ఆర్థికసంఘం సమావేశం జరుగనున్నది. సమావేశానికి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరితోపాటు మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఉండటంతో హాజరుకాలేనని ఛత్తీస్‌గఢ్ ఆర్థికశాఖ కార్యదర్శి తెలిపినట్టు సమాచారం. సమావేశంలో పాల్గొనే అధికారులు తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును శనివారం సందర్శించనున్నారు.

టీఆర్టీ అభ్యర్థులకు మరోసారి ఎడిట్ ఆప్షన్

- రేపటి నుంచి 12వ తేదీ వరకు అవకాశం కల్పించిన టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులకు నష్టం జరుగకుండా టీఎస్‌పీఎస్సీ మరో అవకాశం కల్పించింది. పాత జిల్లాల ప్రకారం, కొలువులు ఉన్న మాధ్యమాల ప్రకారం దరఖాస్తులు సమర్పించుకోనివారికి.. వీటిని సవరించుకొనేందుకు వీలుగా మరోసారి ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం ఇచ్చింది. ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లోని స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 1,868 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని.. అయితే ఆ మాధ్యమాల్లో ఖాళీలులేవని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. అందుకే తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడలో ఉన్న కొలువుల కోసం పోటీ పడేందుకు తమ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తిచేసుకోకపోతే వారు దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోలేరని పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఎడిట్ ఆప్షన్ అవకాశం ఉంటుందని చెప్పారు. ఎడిట్ అవకాశం కల్పించినప్పటికీ 30,849 మంది అభ్యర్థులు పాత పది జిల్లాల ప్రకారం తమ దరఖాస్తులు సమర్పించలేదని వివరించారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొనే సమయంలో వారు తమ జిల్లాల వివరాలను సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.

ఎస్టీలకు బ్యాంకు పీవో పరీక్షలకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయస్థాయిలో వివిధ బ్యాంకులు నిర్వహించే ప్రొబేషనరీ ఆఫీసర్స్(పీవో) పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ ఏడీ సర్వేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు పీవో(ప్రిలిమినరీ)తోపాటు క్లరికల్, ఎస్సెస్సీ, ఆర్‌ఆర్‌బీ తదితర పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కూడా ఎస్టీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. భద్రాచలం, వరంగల్, ఉట్నూర్, పీఈటీసీ, హైదరాబాద్‌లో ఉచిత శిక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. మార్చి 5 నుంచి మే3 వరకు రెండు నెలలపాటు శిక్షణ ఇస్తామని, అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని, http//studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 040-27540104 నంబర్‌లో సంప్రదించాలని సర్వేశ్వర్‌రెడ్డి సూచించారు.



విరాట్ కోహ్లీ పరుగుల దాహం తీరనిది. అతని స్థిరమైన ఆటతో సెంచరీలు వాటంతటవే రూపుదిద్దుకుంటున్నాయి. 'వన్-డే క్రికెట్' ఆటగాళ్లల్లో కోహ్లీ ప్రపంచంలోనే అగ్ర ఆటగాడు. నేను చూసిన ఆటగాళ్లలో అత్యుత్తముడు.

మైఖెల్ వాన్, ఇంగ్లండ్ మాజీ క్రికెటర్



విరాట్ బ్యాట్ పట్టుకుంటే దాన్నుంచి పరుగులు జాలువారుతాయి. బ్యాట్స్‌మెన్ టెక్నిక్ సరిగ్గా లేకుంటే పరుగులు ఇంత స్థిరంగా రావటం అసాధ్యం. నా అభిప్రాయం ప్రకారం కోహ్లీ ప్రత్యేకమైన గొప్ప బ్యాట్స్‌మెన్. బౌలర్ బలం, బలహీనతలను అర్థం చేసుకోవటంలో సిద్ధహస్తుడు. ప్రంపచంలోనే అత్యంత గొప్ప బ్యాట్స్‌మెన్.

జావేద్ మియాందాద్, పాకిస్థాన్ మాజీ క్రికెటర్

చరిత్రలో నేడు



1895

అమెరికాలో 'వాలీబాల్' ఆటను కనిపెట్టిన డబ్ల్యూ జీ మోర్గాన్.

1971



భూమిపైకి తిరిగివచ్చిన 'అపోలో-14'



1972

నెల రోజులకుపైగా సమ్మె చేస్తున్న బొగ్గుగని కార్మికుల పోరాటంలో ఎమర్జెన్సీ ప్రకటించిన బ్రిటిష్ ప్రభుత్వం.

ఆధార్ విషయంలో రోజురోజుకూ భయాందోళనలు ఎక్కువవుతూనే ఉన్నాయి. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లలోనూ ఆధార్‌పై నిర్దిష్ట సూచనలు, పరిధి లేకపోవటంపై వాదనలు సాగుతూనే ఉన్నాయి. ఆధార్‌ను అన్ని కార్యక్రమాలకు, సేవలకు తప్పనిసరి చేయటంతోనే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మొదట బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అవసరమన్నది ఇప్పుడు పేదల రేషన్‌కూ, సెల్ ఫోన్ సిమ్‌కార్డుకూ తప్పనిసరి అయిపోయింది. ఇలా ప్రైవేట్ సంస్థలు కూడా ఆధార్‌ను తీసుకుంటే సమాచార గోప్యతపై భయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కేంద్రం ఆధార్‌పై విస్పష్ట విధానం ప్రకటించాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

నాగాలాండ్‌లో నెలకొన్న అనిశ్చితి తొలిగిపోయింది. ఈ నెల 27న జరుగనున్న ఎన్నికలకు నామినేషన్లు దాఖలయ్యాయి. మొదట అక్కడున్న పదకొండు రాజకీయపక్షాలతో పాటు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కూడా నాగా గిరిజన సంఘాలతోపాటు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చాయి. దీంతో నాగాలాండ్ ఎన్నికలు తీవ్ర సందిగ్ధంలో పడిపోయాయి. ఎన్ఎస్‌సీ-ఐఎం, కేంద్రం మధ్య 2015లో చారిత్రక ఒప్పందం కుదిరింది. అయితే ఆ ఒప్పందం అమల్లో ఒక అడుగూ ముందుకుపడలేదు. ఇప్పటికైనా నాగా సమస్యకు కేంద్రం చిత్రశుద్ధితో పరిష్కరించాలి.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

ప్రచ్ఛన్న యుద్ధం!

మాల్దీవులలో రాజకీయ పరిణామాలను రాజకీయ విశ్లేషకులు భారత్, చైనా ప్రచ్ఛన్న యుద్ధంగా అభివర్ణిస్తున్నారు. దేశాధ్యక్షుడు యమీన్‌కు చైనా మద్దతు ఉంటే, ప్రతిపక్షానికి భారత్ మద్దతు ఇస్తున్నది. యమీన్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భారత్ ఐక్యరాజ్యసమితిలో మద్దతు కూడగడుతున్నది. ఈలోగా యమీన్ తమ ప్రభుత్వానికి మద్దతు కోసం తన మంత్రులను దూతలుగా చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియా దేశాలకు పంపిస్తున్నారు. అంతర్జాతీయ రాజకీయాలు ఎట్లా ఉన్నా, హిందు మహా సముద్ర జలాల్లోని, ఆసియాలోనే అతి చిన్నదైన ఈ సుందర దేశం రాజకీయ కల్లోలంలో కొట్టుమిట్టాడటం విషాదకరం. 2013లో దేశాధ్యక్షునిగా అధికారం చేపట్టిన అబ్దుల్లా యమీన్ క్రమంగా నిరంకుశ అధికారాలు చలాయించడం మొదలుపెట్టాడు. సైన్యంపై పట్టుసాధించి, రాజకీయ ప్రత్యర్థులను అణచివేస్తున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు దేశాధ్యక్షుడి అభిమతానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో సంక్షోభం మొదలైంది. ప్రభుత్వ నిర్బంధంలో ఉన్న తొమ్మిది మంది అసమ్మతివాదులను విడుదల చేయాలని, అధికార పార్టీని వీడిన పన్నెండు మంది ప్రజాప్రతినిధుల సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ పన్నెండు మంది మళ్ళా చట్టసభలో ప్రవేశిస్తే, అధికార పార్టీ మెజారిటీ కోల్పోతుంది. సుప్రీంకోర్టు తీర్పును ఆమోదించని దేశాధ్యక్షుడు యమీన్ దేశంలో పదిహేను రోజుల పాటు ఎమెర్జెన్సీ విధించారు. ఇద్దరు న్యాయమూర్తులను అరెస్టు చేయించారు. న్యాయస్థానం చుట్టూరా బలగాలను మోహరించి, మిగతా న్యాయమూర్తులకు చుక్కలు చూపించారు. దీంతో మిగిలిన న్యాయమూర్తులు సమావేశమై గతంలో ఇచ్చిన తీర్పును వెనుక్కు తీసుకున్నారు. దేశాధ్యక్షుడు యమీన్ చెప్పిందే తీర్పుగా మారిపోయింది.

భారత్‌కు మాల్దీవులలో ఎంతోకాలంగా పట్టు ఉన్నది. మాల్దీవులలో గయూం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 1988లో చిన్న తిరుగుబాటు తలెత్తింది. వెంటనే భారత నౌకాదళం రంగంలోకి దిగి తిరుగుబాటును అణచివేసి గయూం ప్రభుత్వాన్ని కాపాడింది. భారత్ తెరవెనుక ఉండి తిరుగుబాటును నిర్వహించి, బహిరంగంగా గయూంను కాపాడిందనీ, ఈ విధంగా ఈ ప్రాంతం లో తన అధికారాన్ని చాటుకున్నదని ఒక అభిప్రాయం ఉన్నది. ఏది నిజమైనా మాల్దీవుల ప్రజలతో భారత్‌కు చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు ఎంతోకాలంగా ఉన్న మాట నిజం. మాల్దీవులు సముద్ర మట్టానికి చాలా తక్కువ ఎత్తులో ఉంటుంది. 2004 డిసెంబర్‌లో సునా మీ రావడంతో దేశం నీళ్ళతో నిండిపోయింది. భారత్ విమానాలు, హెలికాప్టర్లతో ఆహార పదార్థాలను సరఫరా చేసింది. 12 వందల దీవుల సముదాయం అయినప్పటికీ, ఈ దేశ విస్తీర్ణం 115 చదరపు మైళ్ళు మాత్రమే. జనా భా నాలుగు లక్షల పై చిలుకు. భవిష్యత్తులో సముద్ర మట్టం పెరిగిపోయి, ఈ దీవుల ఉనికి కే ప్రమాదం వస్తే ఆదుకునేది భారత్ అనే అభిప్రాయం ఉంది. కానీ 2013లో యమీన్ దేశాధ్యక్షుడు అయిన తరువాత చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడు. చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొని, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో చేరుతామని ప్రకటించారు. దీంతో భారత్ మాల్దీవులలో 'శ్రీలంక ప్రయో గం' ప్రారంభించింది. గతంలో శ్రీలంకలో రాజపక్సే నిరంకుశ విధానాలను అనుసరిస్తూ, విదేశాంగ విధానంలో చైనాకు అనుకూలంగా మారారు. శ్రీలంకలో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, రాజపక్సేను ఓడించడం వెనుక భారత్ హస్తం ఉందనే వార్తలు వచ్చాయి. మాల్దీవులలో కూడా నియంతగా మారిన యమీన్‌ను గద్దె దింపడానికి భారత్ పావులు కదుపుతున్నద నే అభిప్రాయం ఉన్నది.

> **అమెరికా వంటి దేశమే అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలో మాల్దీవులలో ప్రజాస్వామ్యం నెలకొల్పాలనే సూత్రబద్ధ వైఖరిని భారత్ ప్రదర్శించడం మంచిది. మాల్దీవులలో ఎన్నికలను నిర్వహించి చట్టబద్ధపాలన సాగించాలని, న్యాయస్థానం స్వయంప్రతిపత్తిని కాపాడాలని ఐక్యరాజ్యసమితి ద్వారా ఒత్తిడి తేవాలె. మాల్దీవుల ప్రజలతో ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకోవడం దీర్ఘకాలికంగా ఉపయోగకరం.**

పాకిస్థాన్‌లోని గ్వదర్ రేవును చైనా నిర్మిస్తుంటే, ఇరాన్‌లోని చబహార్ రేవు విస్తరణను భారత్ చేపట్టింది. ఇదే విధంగా ఆఫ్రికాలోని డిజిబౌటిలో చైనా నౌకా స్థావరాన్ని నెలకొల్పింది. భారత్ హిందు మహా సముద్రంలోని సీషెల్స్ అనే చిన్న దేశంలోని అసంప్షన్ అనే దీవిని లీజుకు తీసుకొని నావికా స్థావరం నిర్మిస్తున్నది. అటు మాల్దీవులు, ఇటు సీషెల్స్ చేతిలో ఉంటే సముద్ర మార్గాలపై పట్టు ఉంటుంది. ఈ నేపథ్యంలో చైనా మాల్దీవులపై పట్టు బిగించింది. మాల్దీవులలో చైనా ప్రాబల్యం కొన్నేళ్ళుగా పెరుగుతుంటే మోదీ ప్రభుత్వం ఆలస్యంగా స్పందించడం దౌత్య వైఫల్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు. నేపాల్‌లో కూడా భారత్ విధాన లోపం వల్ల ప్రజాభిప్రాయం చైనాకు అనుకూలంగా మారిందనే విమర్శలున్నాయి. గతంలో మాదిరిగా మాల్దీవులలో భారత్ సైనిక జోక్యం చేసుకునే పరిస్థితి లేదు. చైనా ఇప్పటికే మాల్దీవుల పరిణామాలు ఆ దేశ అంతరంగిక వ్యవహారాలని, బయటి జోక్యం వల్ల సంక్లిష్ట పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించింది. సైనిక జోక్యాలు ఫలితాలను ఇవ్వబోవనడానికి గతంలో భారత్‌కు శ్రీలంక అనుభవం ఉన్నది. అమెరికా వంటి దేశమే అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలో మాల్దీవులలో ప్రజాస్వామ్యం నెలకొల్పాలనే సూత్రబద్ధ వైఖరిని భారత్ ప్రదర్శించడం మంచిది. మాల్దీవులలో ఎన్నికలను నిర్వహించి చట్టబద్ధ పాలన సాగించాలని, న్యాయస్థానం స్వయంప్రతిపత్తిని కాపాడాలని ఐక్యరాజ్యసమితి ద్వారా ఒత్తిడి తేవాలె. మాల్దీవుల ప్రజలతో ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకోవడం దీర్ఘకాలికంగా ఉపయోగకరం.

జనగళం

ఆక్రమణలను నిరోధించాలె

హైదరాబాద్ నగరంలో రోడ్డు మధ్యనుంచి నిర్మించిన మెట్రో పిల్లర్లు వేసిన తర్వాత విశాలమైన రోడ్లుకూడా కొంత ఇరుకుగా మారిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది చాలదన్నట్లు ఉన్న రోడ్డునే కొందరు ఆక్రమిస్తున్నారు. దీంతో మరిన్ని కష్టాలు ఎదురవుతున్నాయి. కనీసం ఫుట్‌పాత్ లేకుండా ఆక్రమణలకు పాల్పడుతూ రోడ్డుమీదనే పనిచేస్తున్నారు. రోడ్డు మీదనే వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. చిన్నచిన్న దుకాణాలు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. దీంతో రోడ్లు మరిం త ఇరుగుగా మారుతున్నాయి. ఆక్రమణలను వెంటనే తొలిగించాలి.

- డి. సమ్మయ్య, సంజీవ్‌నగర్, హైదరాబాద్

చర్యలు తీసుకోవాలె

నాసిరకం రోగనిరోధక మాత్రల విక్రయాలు ఈ మధ్య విచ్చలవిడిగా సాగుతున్నాయి. వీటి మూలంగానే మరింతగా రోగాల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ మధ్య దేశంలోని 675 జిల్లాల నుంచి 57,450 మందుల నమూనాలను సేకరించారు. అయితే ప్రభుత్వపరంగా సరఫరా చేసే వాటిల్లోనే ఎక్కువగా నాసిరకం మందులుండటం శోచనీయం. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకోవటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించాలి. ఔషదాలలో అక్రమాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

- సీహెచ్ శ్రీనివాస్, భూపాలపల్లి జిల్లా

బస్ సౌకర్యం పెంచాలి

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదాద్రి పుణ్యక్షేత్రానికి పోవాలంటే హైదరాబాద్, మరి ఇతర చోట్ల నుంచి రాత్రి పది గంటలు దాటితే బస్ సౌకర్యం లేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాదాద్రిని ఎంతో అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వ చర్యలకు అనుగుణంగా బస్ సౌకర్యం కూడా పెంచాలి.

- జంపాల అంజయ్య, సామాజిక కార్యకర్త, భువనగిరి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



ఎడమ శ్రీనివాసరెడ్డి

నేటి అవసరం విద్యానాయకత్వం

విషయం పట్ల సమగ్ర అవగాహన లేనివారిలో ఒక అపరాధ భావన వెంటాడుతూ ఉంటుంది. తత్ఫలితంగా తమ తప్పు లేకున్నా, ఆ విషయానికి సంబంధించి ఆపాదించబడిన దోషాన్నివారు అంగీకరించకుండా ఉండలేకపోతారు. టీచర్ల పనితీరుకు సంబంధించిన ఆరోపణల్లో చాలామంది టీచర్లలో ఈ భావనే గోచరమవుతూ ఆపాదించబడిన దోషాలను అంగీకరిస్తూ ఉంటారు. ఈ స్థితిని తొలిగించవలసిన కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులూ ఈ భావనలోనే ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

విద్యార్థుల వార్షిక పరీక్షా ఫలితాలతో టీచర్ల పనితీరును అంచనా వేయడం అశాస్త్రీయం. ఇది రోగి రక్త, మూత్ర, బీపీ, షుగర్ లాంటి పరీక్షల ఫలితాలతో డాక్టర్ పనితీరును అంచనా వేయడం లాంటిది. ఈ విషయంలో టీచింగ్ కమ్యూనిటీకి చెందని వారిలో ఎక్కువ అవగాహనా లోపం కనబడుతుంది. ఈ లోపంతోనే రాజ్‌భవన్ స్కూల్ టీచర్లను హైదరాబాద్ కలెక్టర్ ఈ మధ్య కించపరిచారు. పిల్లల అకడమిక్ సాధనతో టీచర్ల పనితీరును అంచనా వేయడం అశాస్త్రీయమని స్పష్టమైన అవగాహన ఉన్న రాజ్‌భవన్ టీచర్లు కలెక్టర్ చర్యను నిరసించారు, వ్యతిరేకించారు. ఎడ్యుకేషన్ చీఫ్ సెక్రటరీ కలెక్టర్ ప్రవర్తన సరైంది కాదని భావించి కలెక్టర్ తరపున ఆయన క్షమాపణ కోరారు, గొడవ సద్దుమణిగింది. 'కలెక్టర్ ఉద్దేశాన్ని తప్పు బట్టలేం. కానీ పిల్లలు, వారి తల్లిదండ్రుల ముందు టీచర్లను తిట్టాల్సింది కాదు' అని కొందరు టీచర్ల అభిప్రాయం. కొందరు టీచర్లే ఇటువంటి అభిప్రాయాన్ని కలిగి ఉండటం అవగాహనారాహిత్యంతో ఏర్పడిన అపరాధభావన ఫలితమేనని అర్థం చేసుకోవచ్చు.

ఉపాధ్యాయ, అధ్యాపక సంఘ నాయకుల్లోనూ ఈ రకమైన అవగాహనారాహిత్యం పలు సందర్భాల్లో నిరూపితమవుతూనే ఉంటున్నది. ఈ మధ్య చర్చల్లో ఉన్న 'నో డిటెన్షన్' విధానాన్ని వ్యతిరేకిస్తూ డిటెన్షన్ విధానాన్ని సమర్థించడం, సమగ్ర నిరంతర మూల్యాంకనంలోని లోపాలను సవరించాలని అడుగకుండా ఆ విధానాన్నే సంపూర్ణంగా తొలిగించాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు అడుగటం దీని ఫలితమే. అధ్యాపక సంఘ నాయకులు కూడా దీనికి అతీతం కాదు. ఇంటర్మీడియెట్‌లో సంస్కృతం సబ్జెక్టును ఎంపిక చేసుకోవడం పోటీ పరీక్షలకు అనుకూలం కాబట్టి తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయాల్సిన అవసరంలేదని ఒక అధ్యాపక సంఘ నాయకుడు ఈ మధ్య రాశారు. రోజురోజుకు పిల్లల ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో హయ్యర్ సెకండరీస్థాయిలో భాష ప్రాధాన్యం, దాని లక్ష్యాల పట్ల అవగాహన ఉన్న వారెవ్వరూ ఆ రకంగా మాట్లాడరు.

విద్యారంగ సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ, విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడంలో ముఖ్యపాత్రను పోషించవలసినవారే అవగాహనా రాహిత్యంతో కొట్టుమిట్టాడటం శోచనీయం. ప్రతీ స్థాయిలోనూ విద్యా నాయకత్వ వైఫల్యాల ఫలితాలు కనిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా అవగాహనా రాహిత్యంతో ఉండే టీచర్ నాయకులు పరీక్షా ఫలితాలు తగ్గితే అది సంపూర్ణంగా టీచర్ల తప్పిదంగానే భావిస్తారు కాబట్టి ఈ విషయమై విద్యా శాఖాధికారులు, మంత్రులు ఇదే రకమైన అవగాహనా రాహిత్యంతో చేసే ఆరోపణలను అంగీకరిస్తూ ఉంటారు. చాలా తీవ్రమైన సంక్లిష్ట సమస్యలకు టీచర్లు పని చేయకపోవడమనే సులువైన కారణాన్ని అధికారులు, మంత్రులు ఎత్తిచూపడాన్ని వ్యతిరేకించరు. సమస్యను లోతుగా విశ్లేషించి సరైన మార్గనిర్దేశం చేయడంలో విఫలమవుతూ ఉంటారు. పరీక్షా ఫలితాల కొలమానాలతోనే ఉపాధ్యాయ వర్గ పనితీరును అవగాహన చేసుకునే ధోరణికి వాళ్లు కూడా లోనవుతూ, ఎలాగైనా మంచి ఫలితాలు సాధించాలని తాపత్రయపడుతూ ఉంటారు. ఈ క్రమంలో అక్రమ మార్గాలను కూడా పరోక్షంగా ప్రోత్సహిస్తూ ఉంటారు. మాస్ కాపీయింగ్ సమస్య పెరుగడానికి ఇది కూడా ఒక కారణం. అలా ప్రశ్నాపత్రాల రూపకల్పనలో, జవాబు పత్రాల మదింపుల్లో కూడా అక్రమాలను ప్రోత్సహించే అవకాశాలు పెరుగుతున్నాయి. గతంలో ప్రశ్నా పత్రాల లీకేజీ కుంభకోణాల్లో టీచర్ సంఘనాయకులు ఆరోపణలు ఎదుర్కొన్న సంఘటనలు కూడా ఉన్నాయి.

ఈ పరిణామాల వల్లనే అధికారులకు టీచర్ల నాయకులపై విశ్వాసం సన్నగిల్లింది. దీంతో విద్యాసంబంధ నిర్ణయాల్లో నాయకుల ప్రమేయం లేని పరిస్థితులే ఎక్కువగా ఉంటున్నాయి. దీనికితోడు నూతన విధాన రూపకల్పన ముందు సరైన అధ్యయనాలు కాని, విధాన అమలుతీరుపై సమీక్షలు ఉండవు. దీనితోనే వాటి అమలు విఫలమవుతుంటాయి. నూతన సంవత్సరం వచ్చిందంటే డైరీల ఆవిష్కరణలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల అభినందన సభల్లో పాల్గొనడం, కొత్తగా పదవులు పొందిన అధికారులను శాలువాలతో సత్కరించడం లాంటి అంతగా ప్రాధాన్యం లేని పనులపైనే శ్రద్ధచూపిస్తుంటారు. విద్యావ్యవస్థ శ్రేయస్సుకు సంబంధించిన ప్రాధాన్యం కలిగిన విషయాల పట్ల నిర్లక్ష్యాన్ని చూపించేవాళ్లు కనబడుతారు. కొందరు టీచర్ నాయకులైతే టీచర్లమనే విషయాన్నే మరిచిపోతారు. భవిష్యత్తులో పౌర రాజకీయాలను నెరుపాలనే ఆకాంక్షలకు టీచర్స్ యూనియ న్ నాయకత్వాన్ని ఒక వేదికగా చేసుకుంటారు. ఈ కాంక్షను ఖద్దరు వస్త్రధారణతో ఆవాహన చేసుకొని ఆనందించేవారూ ఉంటారు. ఇది మండలస్థాయి నాయకుల నుంచే కనబడుతున్నది. తమ అనుయాయులు తాము పనిచేస్తున్న స్థానాల నుంచి బదిలీ కాకుండా కాపాడుకోవటానికి, అవార్డులు ఇప్పించుకోవడానికి తమ పోరాట పటిమను ఉపయోగిస్తూ ఉంటారు. సొంత వ్యాపారాలు, ఇతరత్రా ఆసక్తులు కలిగిన వారే నాయకత్వంలో ఎక్కువగా ఉండటం ఈ విపరీతాలకు కారణమవుతున్నది. వీరు తమ అధికారం నిలుపుకోవడానికి సంఘాల ఎన్నికల సమయంలో మద్యంతో ప్రలోభపెట్టడమూ జరుగుతున్నది. ఓటు బ్యాంకును ప్రభావితం చేయదగ్గ వర్గంగా ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అందుకోసమే వీరి డిమాండ్స్‌ను తీర్చే ప్రయత్నం చేస్తాయి. కానీ ప్రభుత్వంపై తమకు గల ఈ ప్రాబల్యాన్ని వ్యవస్థాగత సమస్యల పరిష్కారాల కోసం గాక వ్యక్తిగత పనులు చేసుకోవడానికే ఉపయోగించుకునే స్థితి ఉన్నది. పాఠ్య పుస్తక రచయితల ఎంపిక, శిక్షణల నిమిత్తం రిసోర్స్ పర్సన్స్ ఎంపిక, పరిశోధనాలయా ల్లో, కీలకమైన అకడమిక్ స్థానాల్లో ఎంపికలను పైరవీల చేత పూరింపజేస్తారు. రాష్ట్ర రాజధాని కేంద్రంగా పనిచేయవలసిన అకడమిక్ స్థానాల్లో ప్రతిభతో గాక పైరవీలతో పూరింపబడినవారే ఎక్కువ. దీంతో కీలకమైన ఈ కార్యక్రమాల లక్ష్యాలు దెబ్బతింటాయి.

> విద్యారంగాన్ని బలోపేతం చేయాలని దృఢంగా భావిస్తే, ఆ దిశగా సంస్కరణలు ఉండాలి. కానీ ఆచరణలో ఈ అంశాన్ని పట్టించుకోకుండా విద్యారంగ సమస్యలకు అన్నింటికీ టీచర్లను బాధ్యులను చేయడం సమంజసం కాదు.

తమ జీతభత్యాలకే గాక వివిధ సామాజిక అంశాలపై బాధ్యతతో ప్రపంచవ్యాప్తంగా టీచర్స్ అసోసియేషన్స్ చేసిన స్ఫూర్తిదాయకమైన పోరాటాలు చాలానే ఉన్నాయి. విద్యా నిధులు పెరిగేటట్లు ఒత్తిడి తేవడంలో అమెరికా టీచర్స్ అసోసియేషన్ పాత్ర చెప్పుకోదగినది. జాత్యాహంకారానికి వ్యతిరేకంగా అమెరికాలోని నేషనల్ టీచర్స్ అసోసియేషన్ చేసిన పోరాటాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ శ్వార్జ్‌నిగర్ కాలిఫోర్నియా స్టేట్ గవర్నర్‌గా ఉన్నప్పుడు వాగ్దానం చేసిన విద్యా నిధులను విడుదల చేయనందుకు ఆయనను కాలిఫోర్నియా టీచర్స్ అసోసియేషన్ కోర్టు మెట్లెక్కించింది. గతంలో జీ-20 సదస్సు సందర్భంగా బ్రిటన్‌కు చెందిన సుమారు 4 లక్షల మంది స్కూల్, కాలేజీ టీచర్లు ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం ఇవ్వాలనే నినాదంతో లండన్ వీధుల్లో ప్రదర్శన చేశారు. మన దేశంలో సైతం మూడేండ్ల కిందట ఉన్నత విద్యను గాట్స్ పరిధిలోకి తెచ్చే ప్రయత్నంలో ప్రపంచ బ్యాంక్ నైరోబీలో నిర్వహించిన సమావేశానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా స్కూల్, కాలేజీ టీచర్లు చేసిన నిరసన అద్వితీయం.

విద్యా వ్యవస్థను ప్రగతి పథంలోకి తీసుకురావడంలో సరైన విద్యా నాయకత్వం పాత్ర గణనీయమైనది. ఈ నాయకత్వంలో విద్యా మంత్రుల స్థాయి నుంచి, అన్నిస్థాయిల్లోని విద్యా శాఖాధికారులు ఒక ముఖ్యమైన భాగం, విధాన నిర్ణయాల్లో, వాటి అమల్లో వీరిదే ప్రముఖ పాత్ర కాబట్టి. స్కూల్, కాలేజీ హెడ్ టీచర్లు, టీచర్లను తయారుచేసే టీచర్ ఎడ్యుకేటర్స్ మరొక ముఖ్య భాగం, క్షేత్రస్థాయిలో టీచింగ్ సమాజానికి మార్గదర్శకంగా ఉంటారు కాబట్టి. టీచర్ అసోసియేషన్స్ నాయకులు మూడవ ముఖ్యమైన భాగం, టీచింగ్ సమాజాన్ని సరైన మార్గంలో నడిపించగేవారు కాబట్టి. ఈ మూడు ముఖ్యమైన భాగాలను మొత్తాన్ని కలిపితే మొత్తం విద్యా వ్యవస్థలో పది శాతం లోపే. మిగతా తొంభై శాతం పైగా ఉండేది టీచర్లు. ఈ తొంబై శాతానికి పైగా ఉండే టీచింగ్ సమాజం ఎలాగున్నా, పది శాతం లోపు టీచింగ్ నాయకత్వం సరిగా లేకపోతే ఆ విద్యావ్యవస్థ ప్రగతి బాట పట్టలేదు. విద్యారంగంలో అభివృద్ధి సాధించిన దేశాలన్నీ నేర్పుతున్న పాఠాలివే. ప్రొఫెషనల్ పరిపాలకులుగా ఉండవలసిన మొదటి భాగపు విద్యా నాయకత్వం అత్యంత విద్యా నిరక్షరాస్యతతో కొనసాగుతూ ఉన్నది. ప్రత్యేక శ్రద్ధతో తయారుచేసుకోవలసిన రెండో భాగపు విద్యా నాయకత్వం చాలా నిర్లక్ష్య విధానాల ఫలితంగా నీరుగారిపోతున్నది. ఇక మూడవ భాగపు విద్యా నాయకత్వంలో కొంత మంది రోల్‌మోడల్‌గా లేకపోవడం, విద్యారంగ సమస్యలపై సమగ్ర అవగాహనను కలిగి ఉండకపోవడం కనబడుతుంది. విద్యారంగాన్ని బలోపేతం చేయాలని దృఢంగా భావిస్తే, ఆ దిశగా సంస్కరణలు ఉండాలి. కానీ ఆచరణలో ఈ అంశాన్ని పట్టించుకోకుండా విద్యారంగ సమస్యలకు అన్నింటికీ టీచర్లను బాధ్యులను చేయడం సమంజసం కాదు.

"No one is unfit, even a stopped clock is right twice a day' అనే నినాదాన్ని తమ నిరసన ధర్నా శిబిరంలో నినాదంగా రాజ్‌భవన్ టీచర్లు రాసుకున్నారు. సామాజిక నిందకు గురవుతున్న భారీ సంఖ్యలోని టీచింగ్ సమాజంలో బలాలు కూడా ఉన్నాయని వాటిని గుర్తించే వ్యవస్థ కావాలని, ప్రధాన సమస్య టీచర్లు కాదు, విద్యా నాయకత్వమే అని చెప్పకనే చెప్పారు.

(వ్యాసకర్త: SCIE స్టీరింగ్ కమిటీ సభ్యులు)

ఆరు శతాబ్దాల గాంధారి శాసనం

చరిత్ర




డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ

మన రాష్ట్రంలో అత్యంత ప్రాచీనమైన అరుదైన కోటల్లో ముందు వరుసలో నిలుస్తుంది గాంధారి ఖిల్లా. మంచిర్యాలకు సమీపంలో ఉన్న ఈ ఖిల్లాలో ఇప్పటికి పన్నెండు, పదమూడు వందల ఏండ్ల కిందటే అఖండ శిలలను తొలిచి ప్రవేశద్వారాలు, మార్గాలు, కాలువలు, తూములు, ఆలయాలు నిర్మించారు. 'ఎవరు వారు' అనే సూటి ప్రశ్నకు సరైన సమాధానాలు ఇంకా తెలుసుకోవలసి ఉన్నా ఆ కోటలో ఒక కొండ అంచున ఉన్న ఒక శిలా శాసనం మాత్రం కొంత సమాచారాన్ని ఇస్తుంది.

కోట మధ్య భాగంలో ఉన్న నాగ శేషుని ఆలయానికి ఎదురుగా ఉన్న కొండ చెక్క ముఖ తలానికి సుమారు పది అడుగుల ఎత్తున హనుమంతుని విగ్రహం, విగ్రహానికి ఇరువైపులా శంఖ చక్రాలు తొలిచి ఉండగా, విగ్రహానికి కుడిపక్కన క్రీ.శ.15వ శతాబ్ది (ప్రథమార్థాని)కి చెందిన తెలుగు అక్షరాల్లో ఈ కింది శాసనం ఉంది.

శాసనం పాఠం:

1 శ్రీరస్తు
2 స్వభాను ఆశ్వీజ బ 8 బు||
3 శ్రీ పెద్దిరాజు అనం
4 త్తరాజు రఘు నా
5 యకులకు స
6 మర్పిచించిన
7 హనుమంత్త
8 తిరువని ప్ర
9 తిష్ఠ। శ్రీం
9 యున్ –



పై శాసనంలో పేర్కొన్న 'స్వభాను' అనే తెలుగు/ భారతీయ సంవత్సరం క్రీ.శ.1403లోను, 1463లోను వచ్చింది. శాసనం ఉన్న గాంధారి ఖిల్లా పరిసరాల్లో ఉన్న శిల్పాలను సమకాలీన చారిత్రక విశేషాలతో సమన్వయం చేసి ఈ శాసన సంవత్సరాన్ని నిర్ధారించవలసి ఉంటుంది. క్రీ.శ. 14, 15 శతాబ్దాల్లో తెలంగాణలో పలుచోట్ల కోటగోడలు కట్టించిన పద్మనాయక రాజులు కోటగోడల ప్రవేశమార్గాల దగ్గర భైరవ, వినాయక, హనుమంతుల విగ్రహాలు స్థాపించేవారు. గాంధారి ఖిల్లాలోని అన్ని ప్రవేశ మార్గాల (దర్వాజల) దగ్గర కూడా ఈ విగ్రహ శిల్పాలు ఉండటంతో ఈ గాంధారి ఖిల్లాలో కూడా పద్మనాయకులు కట్టడాలు నిర్మించారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

పద్మనాయక రాజుల్లో రెండో సింగ భూపాలుడు వైష్ణవ మతాన్ని తెలంగాణలో బాగా ప్రచారం చేశాడు. ఆ ప్రచారంలో భాగంగా ఆంజనేస్వామి విగ్రహ ప్రతిష్టలు, తిరుమణి లేదా తిరువని నామాల (తిరుపతి వెంకటేశ్వర స్వామి నామాలు) ప్రతిష్టలు విరివిగా చేసేవారు. సింగరాజు కాలం క్రీ.శ.1384-1399 అదే నేపథ్యంలోభాగంగా స్వభాను సంవత్సరం అశ్వీజ మాసం బహుళ పక్షమి అష్టమి తిథి బుధవారం నాడు శ్రీ పెద్దిరాజు అనంతరాజు రఘు నాయకులకు హనుమంతుని, తిరువని నామాలను సమర్పించినట్లు పై శాసనం తెలుపుతున్నది.

శాసనంలో పేర్కొనబడిన నాయకులు పద్మనాయకుల వంశీకులే అని చెప్పవచ్చు. ఎందుకంటే, ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో 2014 నాటి సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం 1,73,000 మంది పద్మనాయక తెగకు చెందిన ప్రజలు జీవిస్తున్నారు. వీరిలో పెద్ది, పెద్దిరాజు అనే ఇంటి పేర్లు గల వారున్నారు. వారి గోత్రం నల్లెల్ల లేదా నల్ల నీళ్ళ గోత్రం. ఈ గోత్రీకులు వైష్ణమతాన్ని అనుసరిస్తూ తిరువని నామాలు ధరిస్తారు. అందుకే వీరిని తిరుమనిదారులు అని కూడా పిలుస్తారు. గాంధారి ఖిల్లా చుట్టుపక్కల గ్రామాల్లో నాయకపు గూడేల్లో పెద్దిరాజు ఇంటిపేర్లు గల వారు చాలామంది ఉన్నారు. గాంధారిలో ప్రస్తుత ప్రధాన పూజారి పేరు కూడా పెద్దులు. పెద్ది లేదా పెద్దిరాజు ఇంటిపేరు గల పద్మనాయకులతో పాటు పద్మనాయకులందరూ ఇప్పటికీ తమ గూడేలలో ఉండే ఇల్లారి/ నగురుల్లో (గుడులు) తప్పనిసరిగా సింగబోయుడు అనే దారు శిల్పాన్ని (కట్టె విగ్రహాన్ని) పంచవర్ణాలతో అందంగా అలంకరించి పూజిస్తుంటారు. అంటే సింగమ నాయకుని వారసత్వ సంప్రదాయాలను పద్మనాయకులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారని అర్థం.

వీటన్నింటిని బట్టి గాంధారి ఖిల్లా శాసనాన్ని క్రీ.శ. 1403లో పెద్దిరాజు అనే పద్మనాయక రాజ సామంతుడు వేయించాడని ఆయన వారసులు ఇంకా ఆ ప్రాంతాల్లో ఉన్నారని, వారే ఆరు శతాబ్దాలుగా ఆ కోట గోడల్లో ఏడాదికొకసారి, పద్మనాయక రాజుల కాలపు సంప్రదాయాలతో జాతర జరుపుతున్నారని చెప్పవచ్చు. గాంధారి ఖిల్లాల ప్రాంతంలో 'కాటమన్న కథ' అనే ఒక జానపద గాథ బాగా ప్రచారంలో ఉన్నది. ఆ కథలో కూడా పెద్దిరాజు భార్య పెద్దమ్మ సంతానం కోసం చాలా ఆలయాలను బాగు చేయించిందని, కొన్నింటిని కొత్తగా కట్టించిందనే నేపథ్యం ఉంటుంది. వాటికి నిదర్శనంగా ఈ కోటలో ఇప్పటికీ శిథిల ఆలయాలు కన్పిస్తాయి. ఇంకొక కథనం ప్రకారం పద్మనాయకుల వైష్ణవులైన పాండవులను, వారి తల్లి కుంతి (గొంతి)ని, వారి పెద్దమ్మ గాంధారిని కొలుస్తారు. ఈ గాంధారి కోటలో పెద్దమ్మ, గొంతెమ్మ స్థలాలు కూడా ఉన్నాయి. పూజలందుకుంటున్నాయి. ఇలా జానపదగాథలు కూడా పద్మనాయకుల చరిత్రను సమర్థిస్తున్నాయి.

శాసనంలో అనంతరాజు, రఘునాయకులు కూడా ప్రస్తావించబడినారు. క్రీ.శ.1590 ప్రాంతాల్లో హైదరాబాద్ నగర నిర్మాత అయిన మహమ్మద్ కులీ కుతుబ్‌షా దగ్గర మంత్రిగా పనిచేసిన నేబతి కృష్ణమాత్యుడు రచించిన 'రాజనీతి రత్నాకరం' (పంచతంత్రం అనువాదం)లో తనకు ఐదు తరాల ముందు వాడైన అనంతరాజు నాగరాజుల ప్రస్తావన/ చరిత్ర కొంత ఉన్నది.

> అనంతరాజు నాగారాజులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకించి వికారాబాద్ దగ్గరి అనంతగిరి ప్రాంతానికి అమాత్యులుగా పనిచేశారు. సహజ పండితుడైన బమ్మెర పోతన కులానికి చెందినవారుగా పేర్కొనబడిన వీరు కూడా వైష్ణవులే. వైష్ణవులే హనుమంత, తిరువని నామాలను చెక్కిస్తారు. పోతన, అనంతరాజు సమాకాలికులైతే గాంధారి శాసనం క్రీ.శ.1463లో వేయించిందే అవుతుంది.

శాసన శిల ఎదురుగా అనంత నాగారాజ ఆలయం కూడా ఉంది. అనంతరాజు నాగారాజులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకించి వికారాబాద్ దగ్గరి అనంతగిరి ప్రాంతానికి అమాత్యులుగా పనిచేశారు. సహజ పండితుడైన బమ్మెర పోతన కులానికి చెందినవారుగా పేర్కొనబడిన వీరు కూడా వైష్ణవులే. వైష్ణవులే హనుమంత, తిరువని నామాలను చెక్కిస్తారు. పోతన, అనంతరాజు సమాకాలికులైతే గాంధారి శాసనం క్రీ.శ.1463లో వేయించిందే అవుతుంది. కానీ శాసనం స్పష్టంగా 'నాయకుల'ను పేర్కొంటుంది (అమాత్యులను కాదు) కాబట్టి, ఇప్పటికీ గాంధారి ఖిల్లాను పద్మ 'నాయకులే' పూజిస్తున్నారు కాబట్టి గాంధారి శాసనం క్రీ.శ.1403 నాటిది కావడానికే ఎక్కువ అవకాశం ఉన్నది. భావి పరిశోధనలో మరిన్ని విషయాలు తెలిస్తే తప్ప.

(గాంధారి జాతర 9,10,11 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా...)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌పై భూ ఆక్రమణ కేసు



పాట్నా: కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌పై భూ ఆక్రమణ కేసు నమోదైంది. తప్పుడు పత్రాలు సృష్టించడం, భూ ఆక్రమణకు కుట్ర పన్నడం తదితర అభియోగాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీహార్‌లోని అసోపూర్ మౌజాలో రెండు ఎకరాల 56 గుంటల భూమి ఆక్రమణకు పలువురు కుట్ర పన్నారని, అందులో గిరిరాజ్‌సింగ్ కూడా ఉన్నారని ఆరోపిస్తూ గతేడాది మాజీ డిప్యూటీ కలెక్టర్ రాంనారాయణ్ ప్రసాద్ కోర్టును ఆశ్రయించారు. దీంతో గిరిరాజ్‌సింగ్‌తోపాటు మొత్తం 32 మందిపై కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. మరోవైపు గిరిరాజ్‌సింగ్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలిగించాలని బీహార్ ప్రతిపక్షం ఆర్జేడీ డిమాండ్ చేసింది. భూ ఆక్రమణకు సంబంధించి నితీశ్‌కుమార్ ఆధ్వర్యంలోని సంకీర్ణ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరింది. గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలువకుండా తాను మాట్లాడనని, కేసు నమోదు వెనుక ఆర్జేడీ హస్తమున్నదని ఆరోపించారు. కేసు విషయంలో న్యాయస్థానానికి పూర్తిగా సహకరిస్తానని పేర్కొన్నారు.

ఆ ఊర్లో అందరూ కోటీశ్వరులే!

భూమి కోల్పోయిన వారికి రూ.40.8 కోట్ల పరిహారం చెల్లించిన రక్షణశాఖ



బుధవారం బోంజా గ్రామస్తుడికి భూపరిహారం చెక్కులు అందజేస్తున్న అరుణాచల్ సీఎం పెమాఖండూ

ఈటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లో అదో చిన్న గ్రామం. గ్రామీణ భారతానికి అద్దంపట్టే సగటు పల్లెటూరు. అక్కడి ప్రజలు కాయకష్టం చేసి జీవనం సాగిస్తుంటారు. అలాంటి ప్రజలు రాత్రికి రాత్రే సంపన్నులయ్యారు. భూసేకరణలో భూమి కోల్పోయిన కుటుంబాలకు రక్షణ మంత్రిత్వశాఖ ఇచ్చిన నష్టపరిహారంతో వారంతా ఇప్పుడు కోటీశ్వరులయ్యారు. వారే అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాన్ జిల్లా బోంజా గ్రామస్థులు. గ్రామంలోని 31 కుటుంబాలకు రూ.40.83 కోట్ల నష్టపరిహారాన్ని అధికారులు అందించారు. 200 ఎకరాల భూమిని సేకరించినందుకు రక్షణశాఖ ఈ మొత్తం పరిహారంగా చెల్లించింది. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో నిర్వాసితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి పెమాఖండూ చెక్కులు అందజేశారు. నష్టపరిహారం పొందిన వారిలో ఓ వ్యక్తికి అత్యధికంగా రూ.6.73 కోట్లు రాగా, మరో కుటుంబానికి రూ.2.45 కోట్లు అందాయి. మిగతా 31 కుటుంబాలకు రూ.1.09 కోట్ల పైచిలుకు చొప్పున పరిహారం వచ్చింది. దీంతో బోంజా సంపన్న గ్రామంగా మారిపోయింది. రక్షణ శాఖ కీలక స్థావర ప్రణాళికా యూనిట్లను నెలకొల్పేందుకు ఈ భూమిని సేకరించారు. ఈ రాష్ట్రంలో మూడు గ్రామాల్లోని 152 కుటుంబాలకు గత ఏడాది కూడా ఇలాగే రూ.54 కోట్లను రక్షణమంత్రిత్వశాఖ విడుదల చేసింది.

కమ్యూనిస్టుల పాలనలో బానిసత్వం

మాణిక్ సర్కార్ ప్రభుత్వానికి చరమగీతం పాడండి
త్రిపుర ఎన్నికల సభలో ప్రధాని మోదీ



సొనముర/కైలాషహర్(త్రిపుర): త్రిపురలోని కమ్యూనిస్టుల పాలనలో బానిసత్వం పెరిగిపోయిందని, ఆ పార్టీ నాయకులు ప్రజలను బానిసలుగా చూస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు. దీనికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తన వద్ద 'హీరా'(హెచ్-హైవేస్, ఐ-ఇంటర్నెట్, ఆర్-రోడ్‌వేస్, ఏ-ఏయిర్‌వేస్) అనే ఫార్ములా ఉన్నదని, దాంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. త్వరలో జరుగనున్న త్రిపుర అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని గురువారం ఆయన రాష్ట్రంలోని సొనముర, కైలాషహర్ ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో పాల్గొని మాట్లాడారు. 'ప్రజలు తమకు రేషన్‌కార్డు కావాలంటే సీపీఎం కార్యాలయాన్ని ఆశ్రయించాలి. హత్య జరిగితే సీపీఎం నాయకులు చెప్పేవరకూ పోలీసులు కేసే నమోదు చేయరు. ఇదీ రాష్ట్రంలోని దుస్థితి' అని మోదీ చెప్పారు. ప్రజలు ప్రతి దానికి తమపై ఆధారపడేలా మాణిక్ సర్కార్ ప్రభుత్వం పని చేస్తున్నదని, దీనిని నయా బానిసత్వం అంటారని ధ్వజమెత్తారు. 'తమ తలరాతను మార్చాలని, మంచి జరుగాలని ప్రజలు మణిని ధరిస్తారు. కానీ, ప్రజల శ్రేయస్సు కోసం ఈ మాణిక్(సీఎం) ఏమీ చేయలేదు. అందుకే మాణిక్ సర్కార్ ప్రభుత్వానికి చరమగీతం పాడండి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీకి పట్టం కట్టండి' అని మోదీ పిలుపునిచ్చారు.

ఖలీదా జియాకు ఐదేండ్ల జైలు

అవినీతి కేసులో బంగ్లా మాజీ ప్రధానికి శిక్ష విధించిన ప్రత్యేక కోర్టు ■ వచ్చే ఎన్నికల్లో ఆమె పోటీ చేయడం అనుమానమే

ఢాకా, ఫిబ్రవరి 8:



కోర్టు వద్ద జియా మద్దతుదారులపై పోలీసుల లాఠీచార్జి; ఇన్‌సెట్లో ఖలీదా

బంగ్లాదేశ్‌లో ప్రతిపక్ష పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ నాయకురాలు, మాజీ ప్రధాని ఖలీదా జియాకు అవినీతి కేసులో ఐదేండ్ల జైలుశిక్ష పడింది. దీంతో ఈ ఏడాది డిసెంబర్‌లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమె పోటీ చేసే అవకాశాలు సన్నగిల్లాయి. మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన ఖలీదాకు ఢాకాలోని ఓ ప్రత్యేక కోర్టు గురువారం జైలుశిక్షను ప్రకటించింది. ఆమె భర్త జియా ఉర్ రహమాన్ పేరిట ఏర్పాటు చేసిన జియా అనాథాశ్రమ ట్రస్ట్‌కు చెందిన సుమారు 2.50 లక్షల డాలర్ల నిధులను దుర్వినియోగం చేశారంటూ ఖలీదాను కోర్టు దోషిగా ఖరారు చేసింది. ఖలీదా కొడుకు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఉపాధ్యక్షుడైన తారిక్ రహమాన్‌తోపాటు మరో నలుగురికి కోర్టు పదేండ్ల జైలుశిక్ష విధించింది. తారిక్ రహమాన్ ప్రస్తుతం ప్రవాసంలో గడుపుతున్నారు. నిందితులపై మోపిన అభియోగాలన్నీ రుజువయ్యాయని, ఈ విషయంలో ఎటువంటి అనుమానాలకు తావులేదని జడ్జి మొహమ్మద్ అఖ్తర్‌ఉజ్జమన్ పేర్కొన్నారు. ఖలీదా వయస్సు, ఆరోగ్యం, ఆమె సామాజిక స్థాయి దృష్టిలో పెట్టుకొని శిక్షా కాలాన్ని తగ్గించామని చెప్పారు. బంగ్లాదేశ్‌లో ఓ ప్రభుత్వాధినేతగా పనిచేసిన వ్యక్తికి జైలుశిక్ష పడటం ఇది రెండోసారి. ఇంతకుముందు రాజకీయ నాయకునిగా మారిన సైనిక నియంత హెచ్‌ఎం ఎర్షాద్ కూడా అవినీతి కేసులో జైలుపాలయ్యారు. స్పెషల్ కోర్టు తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని ఖలీదా జియా తరపు న్యాయవాది చెప్పారు. తీర్పు వెలువడిన వెంటనే జియాను చుట్టుముట్టిన భద్రతా సిబ్బంది ఆమెను ఢాకా సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా రోడ్లపైకి వందల సంఖ్యలో వచ్చిన జియా మద్దతుదారులు పలుచోట్ల పోలీసులతో ఘర్షణ పడటం కనిపించింది. రాళ్లు రువ్విన కార్యకర్తలపై పోలీసులు రబ్బర్ బుల్లెట్లను, బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అధికార పార్టీ తనను తప్పుడు కేసులో ఇరికించారని ఖలీదా జియా ఇదివరకు ఆరోపించారు. సైన్యం మద్దతుతో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వం 2008లో జియాపై కేసు నమోదు చేసిందని రోడ్డు రవాణా మంత్రి ఒబైదుల్ ఖ్వాదర్ చెప్పారు. డిసెంబర్‌లో జరుగనున్న ఎన్నికల్లో జియాకు పోటీ చేసే అర్హత లభించక పోవచ్చని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఓవైపు జియా జైలుపాలవడం, ఆమె కుమారుడు రహమాన్ లండన్ నుంచి పార్టీ వ్యవహారాలు నడుపుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ నిలువునా చీలిపోవచ్చని భావిస్తున్నారు.

రాహుల్ నాకూ బాసే!

బీజేపీని ఓడించేందుకు భావసారూప్యతగల పార్టీలతో కలిసి పనిచేస్తాం
మైనారిటీలు, దళితులపై దాడులు పెరుగుతున్నాయి
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియాగాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:



కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తనకూ నాయకుడేనని ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అన్నారు. పార్టీకి పునర్జీవం తెచ్చే ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగినా ఆమె కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ)చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. గురువారం జరిగిన సీపీపీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీజేపీపై ముప్పేట దాడి చేశారు. తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలో చీలికలు తెచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం మైనారిటీలపై హింసను ప్రేరేపిస్తున్నదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు ముందే రావచ్చని సూచనప్రాయంగా తెలిపిన సోనియా.. ఎంపీలు, పార్టీ శ్రేణులు అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తనతో కలిసి ఎలా విధేయతతో, ఉత్సాహంతో, నిబద్ధతతో పనిచేశారో.. అలాగే పార్టీ బలోపేతానికి రాహుల్‌గాంధీతో కూడా పనిచేయాలన్నారు. మోదీ ప్రభుత్వం వాస్తవాలకు దూరంగా పనిచేస్తున్నదన్నారు. దేశంలో మైనారిటీలు అభద్రతా భావాన్ని ఎదుర్కొంటున్నారని, దళితులు, మహిళలపై కూడా అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. సమాజాన్ని చీల్చేందుకు ఓ పథకం ప్రకారం దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

మోదీని రాహుల్ మాత్రమే ఎదుర్కోగలరు: పైలట్
2019 ఎన్నికల్లో మోదీని ఎదుర్కోగలిగేది రాహుల్ మాత్రమేనని కాంగ్రెస్ నేత సచిన్‌పైలట్ అన్నారు. రాహుల్ వేసే ప్రశ్నలకు జవాబివ్వకుండా బీజేపీ పారిపోతున్నదన్నారు.

అధికారిక కార్యక్రమాల్లో ప్రైవేట్ సంస్థలు వద్దు

ప్రభుత్వ విభాగాలు, రాష్ట్రాలకు కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్రాలు తమ అధికారిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రైవేట్ సంస్థల సేవలను వాడుకోవద్దని కేంద్రం స్పష్టంచేసింది. పార్లమెంటరీ కమిటీ నివేదిక ఆధారంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. 'ప్రొటోకాల్ నియమాలను ఉల్లంఘించడం, లోక్‌సభ సభ్యుల పట్ల ప్రభుత్వ అధికారులు ధిక్కార ప్రవర్తనతో వ్యవహరించడం'పై వేసిన కమిటీ.. గతనెల 4న లోక్‌సభకు సమర్పించిన నివేదికలో పలు సిఫారసులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక కార్యక్రమాల నిర్వహణలో ప్రైవేట్ సంస్థలు లేదా ఏజెన్సీలను ప్రోత్సహించరాదని సూచించింది. పరిపాలన, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశాల్లో ప్రభుత్వ సిబ్బంది నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని కూడా పేర్కొన్నది.

రజినీకాంత్‌తో పొత్తుపై ఆలోచిస్తా

రాజకీయాల్లో వెంటనే నిర్ణయాలు తీసుకోలేం: కమల్‌హాసన్



చెన్నై: రజినీకాంత్‌తో రాజకీయపొత్తుపై ఆలోచించాల్సి ఉందని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆనంద వికటన్ పత్రికలో తాను రాసిన తాజా కాలమ్‌లో పేర్కొన్నారు. 'ఇద్దరం పార్టీలు ఏర్పాటు చేయాలి. పార్టీ విధానాలను ప్రకటించాలి. విధానాల్లో సారూప్యత ఉండి అవసరమైతే ఇద్దరం కలిసి పని చేయడంపై ఆలోచించాలి. ఇది సినిమాకాదు.. రాజకీయాలు. వెంటనే నిర్ణయాలు తీసుకోలేం' అని ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇద్దరు వేర్వేరుగానే ప్రకటనలు చేసినా కలిసి పనిచేస్తారా? అన్న ప్రశ్నకు.. ఆ సంగతిని కాలమే నిర్ణయిస్తుంది అంటూ సమాధానమిచ్చారు. ఇద్దరం కలిసి పనిచేసే అంశంలో రజనీ సార్ అన్నమాటలకు తానుకూడా మద్దతు పలుకుతున్నానని కమల్ తెలిపారు. కాలమే ఈ ప్రశ్నకు సమాధానం చెప్తుందన్నారు.

అయోధ్య కేసును భూవివాదంగానే పరిగణిస్తాం

మార్చి 14 నుంచి తుది విచారణ.. సుప్రీంకోర్టు స్పష్టీకరణ
ఈలోగా డాక్యుమెంట్లను తర్జుమా చేసి అందించాలన్న ధర్మాసనం
అయోధ్య వివాదంపై ముస్లిం ప్రతినిధులతో రవిశంకర్ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీమసీదు స్థలవివాదాన్ని 'భూవివాదం'గా మాత్రమే పరిగణించి విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా, జస్టిస్ అశోక్‌భూషణ్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసులో విచారణ జరుపుతున్నది. అయోధ్యలో 2.7 ఎకరాల వివాదాస్పద స్థలంపై నిర్మోహి అఖాడా, సున్నీ వక్ఫ్ బోర్డ్‌తోపాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై మార్చి14 నుంచి న్యాయస్థానం విచారణ జరుపనున్నది. ఈ కేసులో ప్రతిరోజూ విచారణ జరుపాలన్న ఇరుపక్షాల విజ్ఞప్తిపైనా అదే రోజు నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం ప్రకటించింది. రెండువారాల్లోగా ఈ వివాదానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆంగ్లంలోకి తర్జుమా చేసి అందించాలని ఇరుపక్షాలను ఆదేశించింది. అయోధ్యలోని వివాదాస్పద 2.7 ఎకరాల స్థలాన్ని గతంలో సున్నీ వక్ఫ్‌బోర్డ్, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లాలకు సమానంగా పంచాలని అలహాబాద్ హైకోర్టు 2010లో 2:1 మెజారిటీతో తీర్పు నిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన 13 పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారిస్తు న్నది. మరోవైపు సున్నీ వక్ఫ్‌బోర్డు ధర్మాసనానికి అందజేసిన తన న్యాయవాదుల జాబితాలో సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ పేరు లేకపోవడం గమనార్హం. వక్ఫ్‌బోర్డ్ తరపున ప్రస్తుతం తాను వాదించడంలేదని సిబల్ కూడా స్పష్టంచేశారు.



గురువారం సుప్రీంకోర్టు వద్ద అయోధ్య కేసు పిటిషన్‌దారులు, లాయర్లు

ముస్లిం ప్రతినిధులతో రవిశంకర్ చర్చలు

బెంగళూరు: అయోధ్యలోని రామ జన్మభూమి భూ వివాదాన్ని పరిష్కరించడంలో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ మరో అడుగు ముందుకేశారు. గురువారం ఆయన ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, సున్నీ వక్ఫ్ బోర్డు తదితర సంఘాల ప్రతినిధులతో బెంగళూరులో సమావేశమయ్యారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఓ ప్రకటన విడుదల చేస్తూ అయోధ్య భూ వివాదంలో కోర్టు బయట పరిష్కారానికి ముస్లిం ప్రతినిధులు మద్దతు తెలిపారని పేర్కొంది.

మీ మొహాలను అద్దంలో చూసుకోండి

తృణమూల్ నేతలపై బెంగాల్ గవర్నర్ మండిపాటు

కోల్‌కతా: రాజ్‌భవన్‌ను పార్టీ కార్యాలయంగా బీజేపీ మార్చిందన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతల ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేఎన్ త్రిపాఠీ గురువారం మండిపడ్డారు. టీఎంసీ నేతలు తమ మొహాలను అద్దంలో చూసుకోవాలన్నారు. బెంగాల్ మంత్రి ఫిర్హాద్ హాకిమ్ మాట్లాడు తూ గవర్నర్లుగా రాజకీయ నేతల నియామకం గతంలో జరిగినా ఎప్పుడూ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదన్నారు. గవర్నర్ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారని మరో మంత్రి పార్థా ఛటర్జీ ఏకంగా అసెంబ్లీలోనే విమర్శలు గుప్పించారు.

మరో మూడు కోట్ల 'ఉజ్వల' గ్యాస్ కనెక్షన్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 2020 మార్చి నాటికి మరో మూడు కోట్ల ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు ఇస్తామని కేంద్ర చమురుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఇందుకు అదనంగా రూ.4,800 కోట్లు వ్యయమవుతుందన్నారు. బుధవారం సాయంత్రం కేంద్ర క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను ఆయన గురువారం మీడియాకు తెలిపారు. 2019లో ముగిసే ఈ పథకాన్ని మరో ఏడాది పొడిగించాలని, గ్యాస్ కనెక్షన్ల సంఖ్యను 5 కోట్ల నుంచి 8 కోట్లకు పెంచాలని ఇప్పుడు నిర్ణయించామన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 3.36 కోట్ల కనెక్షన్లు ఇచ్చామన్నారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో నక్సల్ హతం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా కిరండుల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో నక్సల్ కమాండర్ ఉగామి అలియాస్ చక్ర హతమయ్యాడని గురువారం పోలీసులు తెలిపారు. కిరండుల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డోకాపర అడవిలో 'స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్)', డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) దళాలు బుధవారం రాత్రి గాలిస్తున్నప్పుడు నక్సలైట్లు కాల్పులకు తెగబడ్డారు. దీంతో తాము జరిపిన ఎదురుకాల్పుల తర్వాత ఘటనా స్థలంలో జాన్ మిలీషియా కమాండర్ ఉగామి అలియాస్ చక్ర మృతదేహం స్వాధీనం చేసుకున్నామని పోలీసులు చెప్పారు.

ఆ ముగ్గురు పాకిస్థానీలు అంతర్జాతీయ ఉగ్రవాదులు: అమెరికా

వాషింగ్టన్: పాకిస్థాన్ కేంద్రంగా లష్కరే తాయిబా, తాలిబన్ ఉగ్రవాద సంస్థలకు సహకరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అంతర్జాతీయ ఉగ్రవాదులుగా అమెరికా ప్రకటించింది. పాక్ పౌరులు రెహ్మాన్ జెబ్ ఫకీర్ అహ్మద్, హిజ్బుల్లా అస్తాంఖాన్, దిలావర్‌ఖాన్ నదీర్ ఖాన్‌లాన్‌లను అంతర్జాతీయ ఉగ్రవాదులపై అమెరికా ట్రెజరీ శాఖ గురువారం ముద్ర వేసింది. వారితో గానీ, వారి ఆస్తులతో గానీ అమెరికన్లు లావాదేవీలు జరుపరాదని పేర్కొన్నది.

ఉత్తరకొరియా ప్రపంచస్థాయి సైనికశక్తి

సైనిక కవాతులో కిమ్‌జోంగ్‌ఉన్ ప్రకటన

సియోల్: అణ్వాయుధ సామర్థ్యం కల ఉత్తరకొరియా ప్రపంచస్థాయి సైనిక శక్తిని కలిగి ఉన్నదని ఆ దేశ అధినేత కిమ్ జోంగ్‌ఉన్ పేర్కొన్నారు. గురువారం ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో జరిగిన సైనిక విన్యాసాల సందర్భంగా కిమ్ మాట్లాడినట్టు దక్షిణకొరియా మీడియా పేర్కొంది. 'మన దేశ సైనిక శక్తిని ప్రపంచానికి చాటే సామర్థ్యాన్ని సంతరించుకున్నాం' అని వేలమంది ప్రజల మధ్య కిమ్ ప్రకటించినట్టు తెలిపింది. తమ దేశంలో వింటర్ ఒలింపిక్స్ జరుగనున్న నేపథ్యంలో ఉత్తరకొరియా సైనిక కవాతుపై దక్షిణకొరియా అభ్యంతరం తెలిపింది.

పొగమంచులోనూ 75 కి.మీ. వేగంతో రైళ్లు

న్యూఢిల్లీ: పొగ మంచు కురుస్తున్నా, ఇతర ప్రతికూల పరిస్థితులు తలెత్తినా ఇకపై రైళ్లు 75 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. ప్రస్తుతం 60 కి.మీ.గా ఉన్న ఈ వేగాన్ని పెంచేందుకు ఈ నెల రెండో తేదీన జరిగిన రైల్వే బోర్డు సమావేశం నిర్ణయిం చింది. పొగమంచులోనూ ట్రాక్‌ను గుర్తించే యంత్రాలను రైలు ఇంజిన్లలో అమర్చనున్నారు.

నేపాల్‌లో ఓలీ సారథ్యంలో నూతన ప్రభుత్వం

కఠ్మాండు: నేపాల్‌లోని కమ్యూనిస్టు పార్టీలు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు సంపాదించుకున్నాయి. ఎగువ సభలో 56 స్థానాలకు 39 స్థానాల్లో సీపీఎన్ – యూఎంఎల్, సీపీఎన్ – మావోయిస్టు సెంటర్ విజయం సాధించాయి. చైనా మద్దతు దారైన సీపీఎన్ – యూఎంఎల్ నేత కేపీ శర్మ ఓలీ నూతన ప్రభుత్వానికి సారథ్యం వహించనున్నారు. ప్రజాప్రతినిధుల (దిగువ) సభలోని 275 స్థానాలకు సీపీఎన్ – యూఎంఎల్, సీపీఎన్ – మావోయిస్టు సెంటర్ కూటమి 174 స్థానాలు గెలుచుకున్నది.

'రాఫెల్' వివరాలు వెల్లడించలేం

ఆ సమాచారం బయటపెడితే దేశ భద్రతకే ప్రమాదం ■ అవినీతి ఆరోపణలను సృష్టించడాన్ని యూపీఏ తన వైఖరిగా మార్చుకుంది
లోక్‌సభలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ.. కాంగ్రెస్‌పై విమర్శలు ■ వ్యవసాయ సంక్షోభంపై బడ్జెట్‌లో ప్రస్తావనేది?: విపక్షం



లోక్‌సభలో మాట్లాడుతున్న జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్‌పై ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లోక్‌సభలో జరిగిన బడ్జెట్ చర్చ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ.. దేశభద్రత దృష్ట్యా రాఫెల్ ఒప్పందం వివరాలు వెల్లడించలేమని చెప్పారు. కాంగ్రెస్ దేశభద్రత విషయంలో రాజీపడుతున్నదని, అవినీతి ఆరోపణలను సృష్టించడాన్నే యూపీఏ ప్రస్తుతం తన వైఖరిగా మార్చుకుందని విమర్శించారు. ఏ ఒప్పందంలో అయినా రహస్యవిషయాలు అంతర్భాగంగా ఉంటాయని జైట్లీ చెప్పారు. ప్రజలకు వెల్లడించే సమాచారం శత్రువులకూ చేరే ప్రమాదముందని తెలిపారు. రెండేండ్లలో భారత్ గణనీయమైన ఆర్థికప్రగతిని సాధించిందని, ఐఎంఎఫ్‌లాంటి సంస్థలూ అదే విషయాన్ని ధ్రువీకరించాయని ఆయన చెప్పారు. యూపీఏ హయాంలో పన్ను మొత్తం 31శాతమని, దానిని తాము 28శాతానికి తగ్గించామని జైట్లీ వివరించారు. 'నేను సింగపూర్ వెళ్లాను. అక్కడ మెర్సిడెజ్ కార్లపైనా, ఆహారంపైనా ఒకేరకంగా ఏడుశాతం జీఎస్టీ విధిస్తున్నారు. జనాభాలో అత్యధికం దారిద్ర్యరేఖకు దిగువన నివసించే భారత్ లాంటి దేశాల్లో అవసరానికీ, ఆడంబరానికీ ఒకే పన్నును ఎలా విధించగలం?' అని ఆయన ప్రశ్నించారు. కొన్నినెలల్లోనే జీఎస్టీని స్థిరీకరిస్తామని, రాబడి పెరుగుతున్నకొద్దీ పన్నురేట్లను తగ్గిస్తామని వెల్లడించారు. వ్యవసాయరంగంలో తీవ్రమైన సంక్షోభం నెలకొన్న విషయాన్ని అంగీకరించిన ఆర్థికమంత్రి, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. ప్రతీసారి బడ్జెట్‌లో మధ్యతరగతికి ఉపశమనాన్ని ఇచ్చామని, వేతనజీవులకు, సీనియర్ సిటిజన్లకు రూ.8వేలకోట్ల మేర పన్నురాయితీలు అందించామని తెలిపారు.


బడ్జెట్‌లో అనేక కీలకాంశాలు విస్మరించారు : విపక్షం
వ్యవసాయ సంక్షోభం, రైతు సమస్యలతోపాటు అనేక కీలకమైన అంశాలను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విస్మరించిందని విపక్షం విమర్శించింది. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో గురువారం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దినేశ్ త్రివేది మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రస్తావించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బడ్జెట్‌ను 'మాటలగారడీ'గా అభివర్ణించారు. 'రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ దేశంకోసం తమ ప్రాణాలను అర్పించారు. దేశానికి ఏమీ చేయలేని వారు కూడా ఇప్పుడు వారిని విమర్శించడం బాధాకరం' అని ఆయన పేర్కొన్నారు. సెస్, సర్‌చార్జీల ద్వారా వచ్చిన ఆదాయంలో రాష్ట్రాలకూ కేంద్రం వాటా ఇవ్వాలని ఏఐఏడీఎంకే సభ్యుడు జయవర్ధన్ డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై మధ్యతరగతి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నదని శివసేన ఎంపీ రాజన్ విచారే విమర్శించారు. ఆర్జేడీ బహిష్కృత ఎంపీ రాజేశ్ రంజన్ చర్చలో పాల్గొంటూ.. దేశంలో రైతుల ఆత్మహత్యలు 40శాతం పెరిగాయన్నారు.

రాజ్యసభలో రేణుకాచౌదరిపై వ్యాఖ్యలకు నిరసన
రేణుకాచౌదరిపై బుధవారం ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ గురువారం రాజ్యసభలోఆందోళనకు దిగింది. మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. మరోవైపు మోదీ వ్యాఖ్యకు సంబంధించిన వీడియోను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ట్వీట్ చేయడంపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేయనున్నట్లు ఎంపీ రేణుకా చౌదరి తెలిపారు.

టీవీల్లో జంక్‌ఫుడ్ ప్రచారంపై నిషేధం ఆలోచన లేదు: కేంద్రం
టీవీల్లో జంక్‌ఫుడ్ అడ్వర్టయిజ్‌మెంట్లపై నిషేధం విధించే ఆలోచనేదీ లేదని కేంద్రమంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ లోక్‌సభకు వెల్లడించారు. జంక్‌ఫుడ్ చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న వాదనతో తాము ఏకీభవిస్తున్నామని చెప్పారు. 2017లో దేశవ్యాప్తంగా జరిగిన 4.6లక్షల రోడ్డు ప్రమాదాల్లో 1.46లక్షలమంది మృతిచెందారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

ఏపీకి మళ్లీ నిరాశే

నిర్దిష్ట హామీనివ్వని జైట్లీ
రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీసిన కేంద్రమంత్రి సుజనాచౌదరి



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం మరోమారు పార్లమెంట్‌ను కుదిపేసింది. ఏపీకి చెందిన ఎంపీలు గురువారం ఉభయసభల్లో నినాదాలు చేస్తూ గందరగోళం సృష్టించారు. తమ రాష్ట్ర ఎంపీలు లేవనెత్తుతున్న అంశాలపై స్పందించాలని టీడీపీకి చెందిన కేంద్ర మంత్రి సుజనాచౌదరి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా నిరసన తెలిపే ఎంపీల తరపున కేంద్ర మంత్రి ఘాటుగా మాట్లాడటం అరుదైన విషయం. ఏపీ ఎంపీల ఆందోళన కారణంగా రాజ్యసభ గంటన్నరపాటు, లోక్‌సభ కొద్దిసేపు వాయిదా పడింది. అయినప్పటికీ జైట్లీ ఏపీకి మళ్లీ నిరాశనే మిగిల్చారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చిన జైట్లీ ఏపీకి ఎటువంటి నిర్దిష్టమైన హామీని ఇవ్వలేదు. రాజ్యసభలో టీడీపీకి చెందిన కేంద్ర సహాయ మంత్రి వై సుజనా చౌదరి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు, స్టీలు ప్లాంటు, ప్రత్యేక రైల్వే జోన్‌పై ప్రభుత్వం ఎటువంటి హామీనివ్వలేదని చెప్పారు. సంఖ్యకు కాకుండా సభ్యులకు గౌరవం ఇవ్వండి అన్నారు. తమ సభ్యుల డిమాండ్‌పై 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని.. ఇది తన సూచన అని చెప్పారు. ఏపీకి సంబంధించిన అన్ని అంశాలను సానుభూతితో పరిశీలిస్తున్నామని చెప్పిన జైట్లీ ప్రత్యేక ప్యాకేజీ, రెవెన్యూలోటుకు సంబంధించి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

డార్విన్ సిద్ధాంతాన్ని తొలిగించం: కేంద్రం స్పష్టీకరణ

పాఠశాలలు, కాలేజీల పాఠ్యపుస్తకాల నుంచి డార్విన్ ' జీవజాతుల పరిణామ సిద్ధాంతాన్ని' తొలిగించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ (హెచ్చార్డీ) సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ గురువారం రాజ్యసభలో చెప్పారు. '12వ తరగతి జీవశాస్త్రం పాఠ్యప్రణాళికలో డార్విన్ పరిణామసిద్ధాంతం ఒక భాగమని సీబీఎస్‌ఈ తెలిపింది. పాఠశాలలు, కాలేజీల పాఠ్యపుస్తకాల నుంచి ఈ సిద్ధాంతాన్ని తొలగించే యోచనే లేదు' అని మంత్రి పేర్కొన్నారు. గతనెల ఔరంగాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సత్యపాల్‌సింగ్ మాట్లాడుతూ, డార్విన్ సిద్ధాంతం 'శాస్త్రీయంగా తప్పు' అని వ్యాఖ్యానించటం వివాదాన్ని రేకెత్తించింది. మంత్రి వ్యాఖ్యలను దేశంలోని పలువురు శాస్త్రవేత్తలు ఖండించారు.

మహాశివరాత్రికి కీసరలో భారీ ఏర్పాట్లు

■ ప్రత్యేకంగా 150 ఆర్టీసీ బస్సులు: మంత్రి మహేందర్‌రెడ్డి

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: మహాశివరాత్రికి కీసరగుట్టలో భారీ ఏర్పాట్లు చేశామని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు సుమారు ఐదు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. గురువారం జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో కలిసి కీసర బ్రహోత్సవాలపై రూపొందించిన లఘుచిత్రం సీడీని, పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కీసర జాతరకు వచ్చే భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతోపాటు చలువపందిళ్లు, తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్ల వసతిని ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు రవాణా కోసం సుమారు 150 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సానిటేషన్, ట్రాఫిక్ నియంత్రణకు సెక్టార్లవారీగా అధికారులను నియమించినట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపీ చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, కలెక్టర్ డాక్టర్ ఎంవీ రెడ్డి, జేసీ ధర్మారెడ్డి, దేవాలయ ట్రస్ట్ చైర్మన్ రమేశ్‌శర్మ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కీసర బ్రహోత్సవాల సీడీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మార్చినాటికి చింతలకుంట అండర్‌పాస్

■ శరవేగంగా ఎస్‌ఆర్‌డీపీ రెండో ప్రాజెక్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి పథకం(ఎస్‌ఆర్‌డీపీ)లో భాగంగా ఎల్బీనగర్‌లోని చింతలకుంట జంక్షన్‌లో చేపట్టిన అండర్‌పాస్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. రూ.12.7 కోట్లతో నిర్మిస్తున్న ఈ అండర్‌పాస్‌ను మార్చి చివరినాటికి అందుబాటులోకి తెచ్చేలా జీహెచ్‌ఎంసీ అధికారులు కృషి చేస్తున్నారు. ఎస్‌ఆర్‌డీపీలో నిర్మాణం పూర్తయి ప్రారంభించిన మొదటి ప్రాజెక్టుగా అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ నిలువగా, చింతలకుంట రెండో ప్రాజెక్టు కానున్నది. చింతలకుంట చెక్‌పోస్ట్ వద్ద విజయవాడ హైవే నుంచి బైరామల్‌గూడ వైపు సుమారు 12 మీటర్ల వెడల్పుతో 540 మీటర్ల పొడవున ఈ అండర్‌పాస్‌ను నిర్మిస్తున్నారు. విజయవాడ హైవే నుంచి బైరామల్‌గూడ వైపు 65 మీటర్ల బాక్స్ పోర్షన్ పూర్తికాగా, బైరామల్‌గూడ నుంచి చింతలకుంట వైపు 50 మీటర్ల బాక్స్ నిర్మాణంలో ఉన్నది. బాక్సుల నిర్మాణాన్ని ప్రీకాస్టింగ్ పద్ధతిలో చేపడుతుండటంతో చాలావరకు సమయం కలిసొచ్చిందని అధికారులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న బాక్స్ పోర్షన్ మినహా మిగతా 490 మీటర్ల అప్రోచ్ రోడ్ నిర్మాణం పూర్తయింది. 112 మీటర్ల పొడవున్న క్లోజ్డ్ బాక్స్ నిర్మాణ పనులు సైతం పూర్తయ్యాయి. ఈ అండర్‌పాస్‌తో ఎల్బీనగర్ సర్కిల్‌లో సాగర్ రింగురోడ్డునుంచి విజయవాడవైపు వెళ్లే ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా సాఫీగా సాగే వీలు కలుగుతుంది. దీంతో చింతలకుంట జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులకు చాలా వరకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.



అండర్‌పాస్ విశేషాలు

పొడవు:	540 మీటర్లు
వెడల్పు:	12 మీటర్లు
క్లోజ్డ్ బాక్స్ పొడవు:	112 మీటర్లు
అప్రోచ్‌రోడ్డు:	540 మీటర్లు
బాక్స్ పోర్షన్..	
బైరామల్‌గూడ వైపు :	65 మీటర్లు
చింతలకుంట వైపు:	50 మీటర్లు

వేగంగా జూబ్లీహిల్స్-హైటెక్స్ మార్గం

దాదాపు పూర్తయిన మెట్రో స్టేషన్లు

■ యుద్ధ ప్రాతిపదికన ఫుట్‌పాత్‌ల నిర్మాణం

■ జూన్‌నాటికి అందుబాటులోకి తెచ్చేలా పనులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెట్రోరైలు ప్రాజెక్టు మొదటిదశ పనులను త్వరితగతిన పూర్తిచేయాలనే లక్ష్యంతో జూబ్లీహిల్స్ నుంచి హైటెక్స్ వరకు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. జూన్‌లోగా కారిడార్-3, కారిడార్-1కి సంబంధించిన పనులు పూర్తిచేయాలని గడువు విధించుకోవడంతో ముందుగా డిమాండ్ ఉన్న కారిడార్లను పూర్తిచేయాలని నిర్ణయించారు. నాగోల్-మియాపూర్ మార్గంలో 30 కిలోమీటర్ల దూరాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీనిద్వారా నిత్యం 70 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మొదటిదశ పనులను పూర్తిచేయడంతోపాటు మూడు కారిడార్లను అందుబాటులోకి తెస్తే రోజూ 15 లక్షల మంది ప్రయాణిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ వరకు, అమీర్‌పేట నుంచి హైటెక్స్ వరకు మెట్రో మార్గంలో పనులు చకచకా చేస్తున్నారు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని హైటెక్‌సిటీ వరకు మెట్రోరైలును వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు పనులు చేస్తున్నారు. ఇది పూర్తయితే కారిడార్-3కి సంబంధించి నాగోల్-హైటెక్స్ 27 కిలోమీటర్ల మెట్రో ప్రయాణం అందుబాటులోకి రానున్నది. ఇందులో ఇప్పటికే నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు 17 కిలోమీటర్ల మార్గం అందుబాటులోకి రాగా అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీ వరకు మరో 10 కిలోమీటర్ల మార్గం అందుబాటులోకి రానున్నది. కారిడార్-1కు సంబంధించి మియాపూర్-ఎల్బీనగర్ వరకు 29 కిలోమీటర్ల మార్గంలో ఇప్పటికే మియాపూర్-అమీర్‌పేట వరకు పూర్తయింది. ఆపరేషన్స్ నడుస్తున్నాయి. మిగిలిన అమీర్‌పేట-ఎల్బీనగర్ మార్గాన్ని జూన్‌లోగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కారిడార్-3లో 30 స్టేషన్లు పూర్తికాగా, కారిడార్-1లోని 27 స్టేషన్లలో మరికొన్ని అందుబాటులోకి రానున్నాయి. కారిడార్-2లోజేబీఎస్-ఫలక్‌నుమా వరకు 15 కిలోమీటర్ల మెట్రోమార్గంలో 16 స్టేషన్లు రానున్నాయి. ఇందులో చాలా వరకు పూర్తయ్యాయి.



హైటెక్‌సిటీ వద్ద దాదాపు పూర్తికావచ్చిన మెట్రో స్టేషన్

సవాళ్లను అధిగమిస్తూ..

జూబ్లీహిల్స్-హైటెక్‌సిటీ వరకు చేపట్టనున్న మెట్రోరైలు మార్గం సవాళ్లతో కూడుకున్నదని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పలుమార్లు ప్రస్తావించారు. దీనికి తగ్గట్టే అధికారులకు పలు క్లిష్టమైన సమస్యలు ఎదురవుతున్నాయి. వాటిని ఎదుర్కొంటూ పనులు వేగవంతంగా చేస్తున్నారు. నిర్మాణ క్రమంలో ఫుట్‌పాత్‌ల విస్తరణ వంటి అంశాల్లో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ మార్గంలో అక్రమ కట్టడాల నిర్మూలనతోపాటు మెట్రోనిర్మాణంలో భాగంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణంపైనా అనేక అవాంతరాలు ఎదురయ్యాయి. ప్రభుత్వ సహకారంతో వీటిని తొలిగించిన అధికారులు.. ఫుట్‌పాత్‌ల నిర్మాణాన్ని వేగవంతంగా చేపడుతున్నారు. వయాడక్ట్ మీద పనుల్లో భాగంగా ఎలక్ట్రికల్, సిగ్నలింగ్ పనులను పూర్తిచేస్తూనే ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతున్నారు. ఫుట్‌పాత్‌లు, స్టేషన్లు నిర్మాణం జరిగే ప్రాంతాలు, పిల్లర్లు, వయాడక్ట్‌ల నిర్మాణం, ట్రాక్‌ల నిర్మాణం వంటి ఏర్పాట్లను అధికారులు, ఇంజినీర్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపింది

బీహార్ నుంచి విమానంలో వచ్చి చంపి వెళ్లిపోయిన నిందితుడు

అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ: వరుసకు మరిది అయ్యే వ్యక్తితో తాను కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తున్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్యను సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలానగర్ డీసీపీ సాయిశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన జై మంగళ్‌దాస్(32) ఎనిమిదేండ్లుగా హైదరాబాద్ ఫతేనగర్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడి భార్య మాలతీదేవి, ముగ్గురు పిల్లలు బీహార్‌లోని తన ఇంట్లోనే ఉంటున్నారు. మాలతీదేవి అక్కడ వరుసకు మరిది అయ్యే నీరజ్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న మంగళ్‌దాస్ ఆరు నెలల కిందట బీహార్‌కు వెళ్లి భార్యతో, నీరజ్‌తో గొడవ పడ్డాడు. తర్వాత ముగ్గురు పిల్లలను అక్కడే ఉంచి మాలతీదేవిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఆమె ఫతేనగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నది. మంగళ్‌దాస్ తమను విడదీశాడని, అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని మాలతీదేవి, నీరజ్ పగ పెంచుకున్నారు. అడ్డు తొలిగించుకోవాలని పథకం వేశారు. గత నెల 31న నీరజ్ బీహార్ నుంచి విమానంలో హైదరాబాద్‌కు వచ్చాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఫతేనగర్‌లోని మాలతీదేవి ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయంలో మంగల్‌దాస్ నిద్రిస్తున్నాడు. ఇదే అదునుగా నీరజ్ ఓ తాడుతో మంగల్‌దాస్ మెడకు ఉరి బిగించగా, అతడు పెనుగులాడకుండా మాలతీదేవి కాళ్లను బలంగా పట్టుకున్నది. దాస్ చనిపోయిన విషయం నిర్ధారించుకున్న తర్వాత నీరజ్ మళ్లీ బీహార్‌కు వెళ్లిపోయాడు. ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు దాస్ పేరుతో నీరజ్ ఓ సూసైడ్ నోట్‌ను భోజ్‌పురి భాషలో రాశాడు. మరోవైపు మాలతీదేవి తన పిల్లలతో సహా అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి గాలింపు చర్యలు చేపట్టి గురువారం మాలతీదేవిని అరెస్ట్ చేశారు. నీరజ్‌కుమార్ ఇంకా పరారీలో ఉన్నాడని, సనత్‌నగర్ ఎస్ఐ కృష్ణ నేతృత్వంలో బృందం బీహార్‌లో గాలిస్తున్నదని డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎస్సై సంజీవులును డీసీపీ అభినందించారు. సమావేశంలో బాలానగర్ ఏసీపీ గోవర్ధన్ కూడా పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశేఖర్, (ఇన్‌సెట్) నిందితుడు నీరజ్‌కుమార్

తుపాకీ లైసెన్స్‌దారులు.. యూఐఎన్ నంబర్ తీసుకోవాలి

■ ఈ నెల 28 వరకు దరఖాస్తుకు గడువు: సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తుపాకులు కలిగిన ఉన్న లైసెన్స్‌దారులకు పోలీసులు యూఐఎన్(యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్)ను కేటాయిస్తున్నారు. ఇందుకు లైసెన్స్‌దారులు ఈ నెల 28వ తేదీ వరకు గచ్చిబౌలిలోని రాచకొండ సీపీ కార్యాలయంలోని ఎం సెక్షన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒరిజినల్ తుపాకీ లైసెన్స్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, చిరునామా ధ్రువీకరణ, పాస్ పోర్టు, ఫొటోలను జతపర్చాలి. వీటిని పరిశీలించిన తర్వాత లైసెన్స్‌దారుకుల యూఐఎన్ నంబర్లను కేటాయిస్తామని సీపీ మహేశ్ భగవత్ తెలిపారు. మార్చి 31 తర్వాత యూఐఎన్ నంబర్ లేని లైసెన్స్‌లు అర్హత కోల్పోతాయన్నారు. ఆ తర్వాత తుపాకులను పెట్టుకుంటే అక్రమంగా పరిగణిస్తామని స్పష్టంచేశారు.



రవీంద్రభారతి వద్ద పహారా కాస్తున్న ఆక్టోపస్ బృందం

హైదరాబాద్‌లో ఆక్టోపస్ పోలీసుల పహారా

■ సేఫ్‌సిటీ కోసం విజుబుల్ పోలీసింగ్ పెంపు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరానికి ఇక ఆక్టోపస్ పహారా అందనున్నది. సిటీ వీధుల్లో ఆక్టోపస్ సిబ్బంది గస్తీని నిర్వహించనున్నారు. దీంతో నగర ప్రజలకు విజుబుల్ పోలీసింగ్ మరింతగా పెరుగనున్నది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించిన ఆక్టోపస్ బృందాన్ని నగరంలోని పలు రద్దీ, వీఐపీ ప్రాంతాల్లో మొహరించనున్నారు. నిష్ణాతులైన సాయుధ సిబ్బంది ఇక ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు నిమిషాల్లో అందుబాటులోకి రానున్నారు. సేఫ్ సిటీలో భాగంగా వీరి పహారా ప్రజలకు అందుబాటులో ఉండి భద్రతపై మరింత భరోసా కలిగించనున్నది. ఈ నేపథ్యంలోనే డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాలతో నగరంలో వీరితో పలు సందర్భాల్లో గస్తీని నిర్వహిస్తున్నట్టు సీపీ శ్రీనివాస్‌రావు వివరించారు. ఇందులో భాగంగా సోమవారం నాంపల్లి, అసెంబ్లీ ప్రాంతాల్లో ఆక్టోపస్ బృందం కొన్ని గంటలపాటు గస్తీ నిర్వహించింది. ఇలా దశలవారీగా ఆక్టోపస్ సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటామని సీపీ తెలిపారు.

హైదరాబాద్‌లో ఎనిమిది డెమో రైళ్ల రద్దు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సికింద్రాబాద్ రోడ్ నంబర్-7 వద్ద ఆర్‌సీసీ ఆప్రాన్ వర్క్స్ జరుగుతున్న దృష్ట్యా ఈ నెల 11 నుంచి 21వరకు నగరంలో ఎనిమిది ప్యాసింజర్ రైళ్లను రద్దుచేస్తున్నట్టు గురువారం దక్షిణమధ్య రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్(77608), సికింద్రాబాద్ నుంచి బొల్లారం(77611), మనోహరాబాద్ నుంచి సికింద్రాబాద్(77610), సికింద్రాబాద్ నుంచి మనోహరాబాద్(77613), బొల్లారం నుంచి సికింద్రాబాద్(77612), సికింద్రాబాద్ నుంచి మేడ్చల్(77615), మేడ్చల్ నుంచి సికింద్రాబాద్(77616), సికింద్రాబాద్ నుంచి మేడ్చల్(77619) మధ్య నడిచే డెమో ప్యాసింజర్లను రద్దు చేసినట్టు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ కేఎస్ రావు

సంగీత దర్శకుడు మణిశర్మ ఆఫీస్‌లో నగదును దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: సంగీత దర్శకుడు మణిశర్మ కార్యాలయంలో నగదును దొంగిలించిన యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఏసీపీ కేఎస్ రావు వివరాలు వెల్లడించారు. ఫిలింనగర్ రోడ్ నంబర్-10లో ఉన్న సంగీత దర్శకుడు మణిశర్మ కార్యాలయంలో వనమాల వెంకటేశ్(25) అనే యువకుడు అక్కడే ఉంటూ పదేండ్లుగా ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కార్యాలయంలోని బీరువాలో రూ.4.5 లక్షలు పెట్టిన మణిశర్మ తాళాలను అక్కడే ఉంచారు. గత నెల 27న చెన్నై వెళ్లిన ఆయన ఈ నెల 2న నగరానికి తిరిగి వచ్చారు. మరుసటి రోజు ఆఫీసుకు వచ్చి చూడగా, బీరువాలోని నగదు మాయమైనట్టు గుర్తించారు. వెంకటేశ్‌ను అడుగగా, తనకేం తెలియదని సమాధానం ఇచ్చాడు. ఫిర్యాదు అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నేరం అంగీకరించారు. రూ.3.5 లక్షలు, బంగారు గొలుసు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

'నరబలి' కేసులో డీఎన్‌ఏ పరీక్షలు

బహదుర్‌పురాలో గత ఏడాది కిడ్నాపైన శిశువుగా అనుమానం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో ఇటీవల వెలుగుచూసిన 'నరబలి' కేసులో రాచకొండ పోలీసులు శిశువు తల నమూనాలను డీఎన్‌ఏ పరీక్షలకు పంపించారు. ఎనిమిది రోజులుగా దర్యాప్తు చేస్తున్నా పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో శాస్త్రీయంగా శిశువు లింగ నిర్ధారణపై దృష్టి సారించారు. రక్త నమూనాలు, వెంట్రుకలు, తల భాగం నుంచి ఒక ముక్కను డీఎన్‌ఏ పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ వైద్యులకు పంపారు. మూడు రోజుల్లో నివేదిక అందుతుందని తెలిపారు. మరోవైపు గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ బహదూర్‌పురాలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న షనాజ్, బబ్లూ దంపతుల కుమార్తెను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఆ కేసు మిస్టరీ ఇంత వరకు వీడలేదు. ఆ పాప వయసు 3-5 నెలల మధ్యే ఉండటంతో నరబలికి గురైన శిశువు ఆ పాపే అయి ఉంటుందనే కోణంలో రాచకొండ పోలీసులు విచారిస్తున్నారు. బబ్లూ, షనాజ్ నమూనాలను సేకరించి డీఎన్‌ఏ పరీక్షకు పంపారు. డీఎన్‌ఏ సరిపోతే కేసు ఓ కొలిక్కి వస్తుందని పోలీసులు చెప్తున్నారు. అనుమానితుల విచారణ కూడా కొనసాగుతున్నది. తల దొరికిన ఇంటి యజమానితో పాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఈ మిస్టరీ వీడేందుకు మరికొన్ని రోజులు పడుతుందని పోలీసులు చెప్తున్నారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



సంప్రదాయంగా.. స్టైలిష్‌గా!

పదహారణాల పరికిణీ ఓణీలను.. స్టైలిష్‌గా కనిపించే లెహంగా క్రాప్ టాప్‌లను.. ఈ తరం ఎప్పుడూ వార్డ్‌రోబ్ లో సరికొత్తగా చేర్చుతూనే ఉంటుంది.. పెండ్లిళ్ల లో సంప్రదాయంగా.. కాలేజ్ ఫంక్షన్లలో ఫంకీగా కనిపించాలనుకునే వారి కోసమే ఈ ఫ్యాషన్ వెరైటీస్.



బ్లాక్ కలర్ సెల్ఫ్ వీవింగ్ చెక్స్ వచ్చిన రాసిల్క్‌ని లెహంగాగా కుట్టాం. దీని మీద జర్కన్ వర్క్‌తో హైలైట్ చేశాం. గోల్డ్ కలర్ బ్లౌజ్ మీద జరీతో మెషీన్ వర్క్ చేయించడంతో సూపర్‌గా కనిపిస్తున్నది. ఓణీ కోసం బ్లాక్ కలర్ సాఫ్ట్ నెట్‌ని కాస్త హెవీగా ఉండాలని బార్డర్‌కి సీక్వెన్స్ ఎంచుకున్నాం. ఇక దీని మీద మొత్తం చమ్కీలతో అందంగా బుటీస్ ఇవ్వడంతో మరింత మెరిసిపోతున్నది.

పార్టీలో ప్రత్యేకంగా కనిపించాలంటే ఈ లెహంగా వేయాల్సిందే! గోల్డ్ కలర్ సాఫ్ట్ నెట్‌ని ఎక్కువ గేర్ వచ్చేలా డిజైన్ చేశాం. దీనిమీద ముత్యాలతో చిన్న చిన్న బుటీస్ ఇచ్చాం. బార్డర్ మీద కూడా ముత్యాలు, కుందన్స్‌తో బార్డర్‌ని జతచేయడంతో గ్రాండ్‌గా కనిపిస్తున్నది. బ్లౌజ్‌కి గోల్డ్ కలర్ నెట్ మీద జరీతో మెషీన్ వర్క్ చేశాం. గోల్డ్ కలర్ నెట్ దుపట్టాకి అక్కడక్కడ ముత్యాలను ఇచ్చాం. బార్డర్‌కి మాత్రం మొత్తం అందంగా అద్దాలను కుట్టాం.



ఐశ్వర్య పబ్బతి,
ఐశ్వర్య మదాస్
పరికిణీ
ద హౌస్ ఆఫ్ ఎథ్నిక్ వేర్
అబిడ్స్, హైదరాబాద్
వాట్సప్ నెం : 7288048518
Parikini01@gmail. com

స్టైలిష్‌గా మెరిసిపోయేందుకు ఈ లెహంగాని వేసుకోండి. పింక్ రాసిల్క్‌కి రాయల్ బ్లూ కలర్ బెనారస్ బార్డర్‌ని జత చేశాం. ఈ బెనారస్ మీద వార్లీ జరీ వర్క్ రావడంతో మరింత మెరిసిపోతున్నది. ఈ బార్డర్‌కి కూడా ఇరువైపులా గోల్డెన్ టిష్యూ బార్డర్‌ని ఇచ్చాం. పింక్ రాసిల్క్ బ్లౌజ్‌ని స్లీవ్‌లెస్, హైనెక్‌తో డిజైన్ చేశాం. దీని మీద ముత్యాలు, అద్దాలతో మగ్గం వర్క్ చేయించాం. గోల్డెన్ యెల్లో కలర్ సాఫ్ట్ నెట్‌ని దుపట్టాగా ఎంచుకున్నాం. దీనిమీద ముత్యాలతో బుటీస్ ఇచ్చాం. దీనికి పింక్ రాసిల్క్ మీద ముత్యాలు, సీక్వెన్స్ వర్క్‌తో హెవీగా డిజైన్ చేయించి బార్డర్ ఇచ్చాం.


మోడల్ : శ్వేతనాయుడు

పట్టు లెహంగాలు కాస్త హెవీ అవుతాయి. అందుకే దానికి కాస్త కాటన్ జోడిస్తే సింపుల్‌గా కనిపిస్తుంది. నల్లని కాటన్ లెహంగాకి పట్టు బార్డర్‌ని జత చేశాం. కింద భాగంలో పింక్ కలర్ రాసిల్క్ మీద వార్లీ పెయింటింగ్‌తో హైలైట్ చేశాం. మధ్యలో ఒక చిన్న లేస్‌తో సూపర్ లుక్ వచ్చింది. ఇక బ్లౌజ్‌కి నల్లని కాటన్ వాడాం. దీనికి బార్డర్‌లో వచ్చిన పట్టు మెటీరియల్‌ని చేతులకు వేశాం. సీ బ్లూ కలర్ సాఫ్ట్ నెట్‌ని ఓణీగా ఎంచుకున్నాం. దానికి గోల్డ్ కలర్ లేస్ మీద కుందన్స్, ముత్యాలతో బార్డర్ చేసి వేశాం.

మెదడు కోసం ద్రాక్ష!

ఆహారంలో ద్రాక్ష ఉంటే మానసిక ఆరోగ్యానికి మేలు జరుగుతుందని న్యూయార్క్‌లోని ఇకాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు చెప్తున్నారు. 'సీజనల్ ఫ్రూట్స్-మెదడు చర్యలు' అనే అంశంపై తాజాగా పరిశోధన చేశారు వాళ్లు. బుద్ధిమాంద్యం వంటి సమస్యలకు ద్రాక్ష చెక్ పెడుతుందట. ముఖ్యంగా డిప్రెషన్ సమస్య నుంచి దూరం కావాలంటే ద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవాల్సిందేనట. రోగ నిరోధకతలో.. శోషరస నాళాలు.. ఇతర కణజాలాల ప్రక్రియలో కూడా ద్రాక్ష ఉత్పత్తులు క్రియాశీలకంగా పనిచేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. నిరాశ.. నిస్పృహలకు లోనయ్యేవాళ్లు.. చిరాకు పడేవాళ్లు.. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యేవాళ్లు ద్రాక్ష సంబంధిత ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందట. నేరుగా పండ్ల రూపంలోగానీ.. ద్రవరూపంలోగానీ వారానికి ఒకట్రెండు సార్లు ద్రాక్షాహారాన్ని తీసుకుంటే అంతకన్నా మంచి ఆరోగ్య అలవాటు వేరేది ఉండదట. ద్రాక్షను.. తినాలి కాబట్టి తినాలనుకునేవాళ్లు.. రుచి బాగుటుందని తినేవాళ్లు ఇకపై అంతే ఇంట్రెస్ట్‌తోఆరోగ్యం కోసం కూడా ద్రాక్ష ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని ఇకాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు సూచిస్తున్నారు. వీటిని నేరుగా తినే ఇష్టం లేనివాళ్లు మిక్సింగ్ కాంపౌండ్‌గా ఉన్న ద్రాక్ష ఉత్పత్తులను తీసుకోవాలని సూచిస్తున్నారు!

ద్రాక్ష తింటున్నారా? రుచిగా ఉందా? ఇంకా తినాలనిపిస్తున్నదా? అయితే ఆపకుండా తినేసేయండి. ద్రాక్ష మెదడుకు మంచిదట. మెదడులో ఉత్పన్నమయ్యే కాంపౌండ్స్‌ను సమన్వయ పరచడంలో ద్రాక్ష ఉత్పత్తులు ముఖ్యపాత్ర పోషిస్తాయట!



మనసున్న జంట!




ఎదుటివారికి ఏదైనా చేయాలంటే మంచి మనసుండాలని నిరూపించారు ఈ జంట. బెంగళూరులోని ఎంతోమంది పేద చిన్నారులకు వీరు చేసే సాయం కొత్త జీవితాలకు చిగురులు తొడిగింది.

బెంగళూరుకు చెందిన సరస్వతి పద్మనాభం, శ్యామల్ కుమార్ భార్యభర్తలు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల పిల్లల కోసం వీరు చేసిన ఆలోచన.. ఆ పిల్లల జీవితాలను కొత్త మలుపు తిప్పింది. ఇతర నగరాల్లోంచి, గ్రామీణ ప్రాంతాల్లోంచి ఎంతోమంది పొట్టకూటి కోసం బెంగళూరుకు తరలిపోతుంటారు. అలా వచ్చిన వారిలో చాలామంది పిల్లలను బడికి కాకుండా, ఏదో ఒక పనికి పంపిస్తుంటారు. అలాంటి వారి కోసం ఓ ఆలోచన చేశారు సరస్వతి, శ్యామల కుమార్. ఒకరోజు బెంగళూరు నగరమంతా తిరిగి, అక్కడి పరిస్థితులు గమనించారు. భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న వారి పిల్లలు బడికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉండడం, అల్లరిచిల్లరగా తిరుగడం గమనించారు. వారికోసం ఏదైనా చేయాలని ఆలోచించారు. కానీ ఎంతమందికి వారు మేలు చేయగలరు? ఎంతమంది క్రమం తప్పకుండా బడికి వెళ్లి చదువుకోగలరు? అనే ప్రశ్న వారి ఆలోచనకు బ్రేక్ వేసింది. కానీ ఆ బ్రేక్ వారిని ఆపలేదు. మరో కొత్త ఆలోచనకు పురుడు పోసింది. దియాఘర్ పేరుతో ఓ స్కూల్ ఓపెన్ చేశారు. వలస కార్మికుల పిల్లలందరికీ అందులో ఉచితంగా చదువు చెప్పిస్తున్నారు. రెండు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల వయసు పిల్లలకు ఇందులో ప్రవేశం ఉంటుంది. 2016లో ప్రారంభించిన ఈ దియాఘర్ దిగ్విజయంగా కొనసాగుతున్నది. మొక్క దశలోనే మంచి విషయాలు, సమాజానికి ఉపయోగపడే విషయాలు చెప్తే రేపటి సమాజానికి వారు ఉపయోగపడుతారన్న ఆలోచనతో వారికి పలు విషయాలు, సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగే అంశాలను బోధిస్తున్నారు. ముంబైలో ఉన్న వీధిబాలల కోసం పనిచేసే సంస్థలో మొదటి జాబ్ చేసిన సరస్వతి ఇప్పుడు ఎంతోమంది బాలల జీవితాలను వెలుగుబాట పట్టేలా చేస్తున్నది. ఇప్పుడు ఆ స్కూల్లో 30 మంది ఉన్నారు. ప్రతిరోజూ ఉదయాన్నే ఎనిమిదిన్నరకు ఇంటికి వచ్చి పిల్లల్ని పికప్ చేసుకుని స్కూల్‌కి తీసుకెళ్తారు. ఫ్రెషప్ చేయించి బ్రేక్‌ఫాస్ట్ చేయిస్తారు. ఈ ఏడాది దియాఘర్‌లో పిల్లల సంఖ్య 30 నుంచి 60కి పెరిగింది. అందుకే ఒక పెద్ద గదిని కూడా అద్దెకు తీసుకున్నారు. నలుగురు టీచర్లను కూడా నియమించుకున్నారు.

నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 9 ఫిబ్రవరి 2018

మహేశాత్ నా పరోదేవః మహేశ్వరుడిని మించిన దేవుడు లేడు.
శివ పంచాక్షరీ మంత్రంలోని 'న-మ-శి-వ-య' అనే పంచ బీజాక్షరాల నుండి పంచ భూతాలు, వాటి నుండి సమస్త జగత్తు పుట్టిందని శాస్త్రవచనం. ఓం నమశ్శివాయ' పంచాక్షరీ మంత్రాన్ని పఠించినంత మాత్రానే సర్వ పాపహరణ జరుగుతుంది. 'శివ' అనే శబ్దానికి శుభం, క్షేమం, శ్రేయం, మంగళం అని అర్థాలు. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే అవస్థలకు అతీతమైన ధ్యానావస్థలో గోచరించే తురీయ తత్త్వమే శివుడు. సమస్తాన్ని ప్రకాశవంతం చేసే మూల చైతన్యమే శివతత్త్వం. ఈ జగత్తంతా శివమయమే అయినప్పుడు అంతా శివోహమే. ఈ నెల 13న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక కథనం...

శివోహం..!



బుద్ధ మార్గం

పట్నవాసమా? పల్లె జీవనమా?



పల్లెల కంటే పట్టణాల్లో సౌకర్యాలు ఎక్కువ అనుకుంటారు పల్లెవాసులు. పట్టణాల కంటే పల్లెల్లో సుఖం ఎక్కువ అనుకుంటారు పట్టణవాసులు. పట్టణాల్లో అవకాశాలు ఎలా ఎక్కువో, అవసరాలూ అలాగే ఎక్కువ. రాబడికి మించిన ఖర్చులు పట్టణాల్లో తప్పనిసరి. అలాగే పల్లెల్లో అవకాశాలూ తక్కువే, అవసరాలూ తక్కువే.

అనాదిగా మనుషులు ఈ రెండు రకాల జీవనగతుల మధ్య ఎంపిక విషయంలో తర్జన భర్జనలు పడుతూనే ఉంటారు. కొట్టుమిట్టాడుతూనే గడుపుతున్నారు.

మనిషి దైహిక అవసరాలు పట్టణాలూ, నగరాలూ తీర్చగలవు. కానీ మానసిక ప్రశాంతతని గ్రామాలే అందివ్వగలవు. ముఖ్యంగా ప్రకృతికి, ప్రశాంతతకి మనల్ని గ్రామాలు ముడిపెట్టగలవు.

ఎక్కడ జీవనం బాగుంటుంది? అనేది ఇప్పటి సమస్య కాదు.. ఎప్పటి నుండో వస్తున్న సమస్యే.

వైశాలి నగరం వజ్జి గణతంత్ర రాజధాని. ఆ నగరానికి దూరంగా ఒక బౌద్ధ సంఘ ఆరామం ఉంది. ఆ ఆరామంలో ఒక యువ భిక్షువు ఉన్నాడు. ఆరోజు కార్తీక పున్నమి. కృత్తికా నక్షత్ర ఉత్సవం వైశాలి నగరంలో జరుగుతోంది. నగరాన్నంతా అలంకరించారు. రాత్రివేళ ఆ నగరం దీపాలతో మిలమిలలాడుతోంది. ఆకాశానికి తారాజువ్వలు లేచి వెలుగులు విరజిమ్ముతున్నాయి. సంగీత ధ్వనులు, అరుపులు, కేరింతలు..

ఈ సందడి అంతా దూరంగా ఆరామంలో ఒక కొండ అంచున కూర్చొని తిలకిస్తున్నాడు ఆ యువ భిక్షువు. ఆ సంరంభానికి అతని మనస్సు చలించింది. 'ఈ మారుమూల ప్రాంతంలో ఈ కఠోర భిక్షు జీవనాన్ని సాగిస్తున్నాను. నియమ నిబంధనతో బ్రతకాల్సి వస్తుంది' అని దిగులుపడ్డాడు. అతని నిర్వేదాన్ని అర్థం చేసుకున్న తోటి భిక్షువు.

'మిత్రమా! ఆ జీవనం ఉత్తమమైందని ఎందుకు భావిస్తున్నావు? విందులూ, వినోదాలూ తృష్ణని పెంచుతాయి. పంచశీలను భగ్నం చేస్తాయి. చివరికి దుఃఖానికి కారణమవుతాయి. మనుషుల్లో ఇలాంటి ఊగిసలాట సహజం. మనకంటే అధోగతిలో బ్రతికే వారుంటారు. వారి జీవనం నరకం అనుకుంటాం. మనకంటే విలాసాలు సాగించేవారుంటారు. వారిది స్వర్గం అనీ భ్రమపడతాం. ఇలా ప్రతివారూ ఆలోచిస్తూనే ఉంటారు. వీటన్నింటి కంటే తృష్ణల్ని వదిలించుకున్న జీవనమే శ్రేయోదాయకం. శరీరాన్ని అతిగా కష్టపెట్టడం, అతిగా సుఖపెట్టడం రెండూ సరైన మార్గాలు కావు. మనం భిక్షువులం. మన ఏకాగ్రతకి ఈ ప్రశాంత వాతావరణమే మేలు' అని చెప్పాడు.

ఆ యువ భిక్షువు తన ఆలోచనల్ని మానాడు. ఆ మరుసటి రోజు వారు బుద్ధుని దగ్గరకు వెళ్లి విషయం చెప్పారు. అప్పుడాయన –

'సద్ధోశీల్యే సంపన్నో – యసో భోగ సమప్పితో
యం యం పదేసం భజతి – తత్థ తత్థేవ పూజితో'

'శ్రద్ధ, శీల సంపన్నత, యశస్సు గలవారు భోగాల్ని వదిలినవారు ఎక్కడున్నా ఒక్కటే. వారికి ఎక్కడైనా గౌరవం దక్కుతుంది' అని చెప్పాడు.

ఒకచోట నివసించడం గొప్ప. ఒకచోట జీవించడం అధమం కాదు. ఎక్కడైనా శీల సంపన్నతతో జీవించడమే గొప్ప అని చెప్పిన బుద్ధ ప్రబోధం ఆ ఇద్దరికీ జ్ఞానోదయం కలిగించింది.

... బొర్రా గోవర్ధన్

ఖురాన్ మాట

దయాగుణంతో దేవుని మన్నింపు

దయ, జాలి, కరుణ, సానుభూతి అన్నవి మనుషులకు తప్పనిసరిగా ఉండవలసిన సుగుణాలు. ఇవి లేనివారిని మనం సాధారణంగా శిలా హృదయులు అంటూ ఉంటాం. మానవ హృదయంలో ఏ మేరకు ఈ గుణాల ప్రభావం ఉంటుందో ఆ మేరకైనా వారు శుభకరులే. ఎవరిలోనైతే ఈ సుగుణాలు ఉండవో వారు దైవకారుణ్యానికి దూరంగా ఉంటారు. ఎవరి హృదయంలోనైనా సాటి మనుషుల పట్ల జాలి, కరుణ, సానుభూతి ఉండదో అలాంటివారిని అల్లాహ్ తన ప్రత్యేక కారుణ్యానికి దూరంగా ఉంచుతాడు. అందుకే కారుణ్య హృదయులు, దయాగుణం కలవారిపై కరుణామయుడైన అల్లాహ్ కరుణ చూపుతాడు. కనుక భూలోక జీవజాలంపై మీరు దయజూపండి. పైవాడు మిమ్మల్ని కరుణిస్తాడు అన్నారు ముహమ్మద్ ప్రవక్త (స).



ఒక వ్యక్తి కాలినడకన ఎటో వెళ్తున్నాడు. మార్గమధ్యలో అతనికి బాగా దాహం వేసింది. అలా కొంతదూరం వెళ్లిన తరువాత అతనికో బావి కనిపించింది. బావిని చూడగానే అతనికి ప్రాణం లేచొచ్చింది. తీరా చూస్తే నీళ్లు తోడుకోవడానికి అక్కడ ఎలాంటి సాధనమూ లేదు. బాగా అలసిపోయి ఉన్నాడు. దాహంతో నాలుక పిడచకట్టుకుపోతోంది. ఏం చేయాలో అర్థం కావడంలేదు. మరికాసేపాగితే ఊపిరిపోయేలా ఉంది. శక్తినంతా కూడాదీసుకుని ఎలాగోలా బావిలోకి దిగాడు. కడుపారా నీళ్లు తాగి పైకొచ్చేశాడు.

పైకి రాగానే, తీవ్రమైన దాహంతో నాలుక బయటకు చాచి, భయంకరంగా ఒగురుస్తూ కనిపించిందో కుక్క. దాహానికి తాళలేక కాస్తంత తడితడిగా ఉన్న బురద నాకుతోంది. దాన్ని ఆ స్థితిలో చూడగానే కొన్ని క్షణాల ముందు తన పరిస్థితి గుర్తుకొచ్చిందతనికి. అది కూడా తనకులాగే తీవ్రమైన దప్పికతో బాధపడుతోందని మనసులో అనుకున్నాడు. అతనికి కుక్కపై జాలి కలిగింది.చేతకాకున్నప్పటికీ శ్రమకోర్చి మళ్లీ బావిలోకి దిగాడు. తన మేజోళ్లలో నీళ్లు నింపుకొని వాటిని నోటకరచిపట్టుకొని పైకెక్కాడు. ఆ నీటిని దాహంతో తల్లడిల్లుతున్న ఆ కుక్కకు తాగించాడు.

ఈ ఆచరణ దైవానికి అమితంగా నచ్చింది. అతని జీవకారుణ్యాన్ని, అతని శ్రమను దేవుడు గుర్తించి, ఆ సదాచరణకు బదులుగా అతణ్ణి క్షమించివేస్తున్నట్టు ప్రకటించాడు.

అల్లాహ్ మానవుల బాహ్య ఆచరణల కన్నా అంతరంగాన్ని తరచి చూస్తాడు. కేవలం కుక్కకు నీళ్లు తాగించినంత మాత్రాన అతడు దేవుని మన్నింపునకు పాత్రుడయ్యాడని అనుకోకూడదు. ఒక మూగజీవిపై అతని మనసులో పెల్లుబికిన దయ, కరుణ, సానుభూతి, సంకల్ప శుద్ధి.. ఇవి దైవానికి నచ్చాయి. అతని తపనను దేవుడు మెచ్చుకొని అతణ్ణి క్షమించివేశాడు. తన కారుణ్యానికి పాత్రునిగా చేశాడు.

... మదీహా అర్జుమంద్

సృష్టి సమస్తాన్నీ తన వశంలో ఉంచుకొన్న సదాశివుడు, సర్వేశ్వరుడు. అతడే ఇచ్ఛా శక్తి, జ్ఞాన శక్తి, క్రియాశక్తులతో కూడిన ఈశ్వరుడు. దుఃఖాన్ని, దుఃఖ కారణాన్ని దూరం చేసేవాడు శివుడు. ఈ కలికాలంలో మానవులు త్రివిధములైన ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, అధి దైవిక అనే దుఃఖాలకు లోనైపోతున్నారు. ఇట్టి ఈతి బాధలను తీర్చేవాడు ఈశ్వరుడొక్కడే. పార్వతీ మాత స్వామిని గురించి వర్ణిస్తూ 'ఈశ్వరుడొక్కడే సత్యం, మిగతావన్నీ మిథ్య' అంటుంది. లోకంలో ప్రతి ఒక్కరు కీడును పోగొట్టుకోవడానికి, సంపదలు పొందడానికి మంగళపదార్థాలైన చందనం మొదలైనవి ధరిస్తారు. కానీ వీటికన్నా ఈశ్వర విభూతి అనంతమైన శక్తి గలదని గ్రహించాలి.

భక్త వరదుడు...

శివుడు భక్త సులభుడు. స్వామిని కలవడం చాలా సులభం. సంపూర్ణ భక్తితో కొలిచిన ప్రతి భక్తుని తనంతట తానుగా వెళ్లి అనుగ్రహించే పెద్ద మనసు స్వామిది. దేవతలకు మానవులకే కాకుండా రాక్షసులకు కూడా తన అనుగ్రహాన్ని పంచిన మనసు ఆయనది. లోకక్షేమం కోసం తాను దేన్నయినా స్వీకరించే తత్వం శివునిది. అందుకే క్షీరసాగర మథనం జరిగినప్పుడు పుట్టిన హాలాహలాన్ని లోక క్షేమం కోసం తన గళంలో బంధించాడు. దేవ మానవ రాక్షసుల క్షేమం కోరి, సృష్టిని దహించే శక్తి కలిగిన విషాన్ని తాను త్రాగాడు. అంతటి ఓపిక, భరించే శక్తి తండ్రికి గాక ఎవరికి ఉంటుంది? అది ఈశ్వర తత్వం అంటే అది 'పితర' భావన. అందుకే ఎంతోమంది భక్తులను అనుగ్రహించి అక్కున చేర్చుకున్నాడు.

రావణాసురుడు స్వామి కోసం తపస్సు చేసి ఆత్మలింగాన్ని పొందగలిగాడు. మూషికాసురునికి తాను కడుపులో జన్మిస్తానని వరమిచ్చాడు స్వామి. భస్మాసురుడికి వరమిచ్చి తన ప్రాణం మీదికి తెచ్చుకున్నాడు. 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరి మంత్రాన్ని జపించిన వారికి అడిగిన వరాలు ఇచ్చాడు. అదేవిధంగా తనని నమ్మిన భక్తులకు మోక్షాన్ని ప్రసాదించాడు. అక్క మహాదేవి, బెజ్జ మహాదేవి తదితర భక్తురాళ్ళు స్వామిని కొలిచి ఆనంద పరవశంతో తమ జీవితకాలం స్వామిని సేవించి లింగైక్యం పొందారు.

'శంకరోతి ఇది శంకరః' అంటే శాంతిని కలిగించేవాడు శంకరుడు అని అర్థం. రుద్రుడు అనే శబ్దంలో రౌద్ర అని భావన కనిపిస్తున్నా రౌద్రమంతా ఆధ్యాత్మిక పరిభాషలో అహంకారాన్ని చంపేది అని అర్థం. అహంకారాన్ని చంపి, చిదానందాన్ని కలిగివుండేవాడు శంకరుడు. తన దగ్గరున్న చిదానందాన్ని కోరుకున్నవారికి ఇవ్వడమే స్వామి ఆరాధన ఆంతర్యం. అందుకే అద్వైత సిద్ధిని కోరే మోక్షసాధకులు, భిక్షువులు శివుని ఆరాధిస్తారు. జీవాత్మ పరమాత్మలో కలిసే ప్రక్రియలో సహాయం చేసేవాడు త్రిమూర్తులలో ఈశ్వరుడు ఒక్కడే.

బుద్ధినిచ్చే విభూతి

ఒంటికి చితాభస్మాన్ని రాసుకుని కోరినవారికి సకల సంపదలను అనుగ్రహిస్తాడు. అందుకే 'విభూతి భూతిరైశ్వర్యం' అంటారు. విభూతిధారణ చేసి ఎవరైతే శివలింగ దర్శనం చేస్తారో వారి సర్వ పాపాలు నశిస్తాయి. ఒక బిల్వ దళాన్ని చేత పట్టుకుని 'శివ' నామాన్ని తలిస్తే ఆ శివలింగ దర్శన భాగ్య ఫలం దక్కుతుందని శివపురాణోక్తి. అభిషేక ప్రియుడైన శివుడి తలపైన కాసిన్ని నీళ్లు పోసి, మారేడు దళంతో అలంకరించి ఇంత విభూతి రుద్దితే అలాంటి భక్తుని ఇంట కల్పవృక్షాన్ని, ఇంటిముందు కామ ధేనువును ప్రసాదించే చల్లటి మనసున్న దేవుడు. ఆయన ధరించే విభూది అంతరార్థం ప్రతి జీవి మరణానంతరం పొందేది బూడిద అన్న సత్యం తెలుపుతుంది. తెల్లని విభూతి జ్ఞానానికి చిహ్నం పరమ శివుడు. జీవుల సంసారిక దుఃఖాలను పోగొట్టేవాడు, రోగ, దరిద్రాలను పోగొట్టే వాడు శివుడు. గ్రహదోషాలు, ఈతి బాధలు శివారాధన తోనే తీరుతాయనేది నిస్సందేహం. పంచ భూతాలకు అధిపతియైన శివుడిని ఆరాధించడం ద్వారా పంచ భూతాత్మకమైన దేహచాపల్యం వదిలి, జన్మ సాఫల్యం కలిగే అవకాశం ఆ దేవదేవుడు కల్పించాడు.



నిరాడంబర తత్వం

ప్రతి జీవి పరమేశ్వరాంశమే. 'శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు' అన్నదే దీనికి ఆధారం. ఈ సమస్త చరాచర జగత్తు ఆయన అధీనంలోనే ఉంటుంది. సమస్త దేవతల్లో అత్యంత శక్తిమంతుడు, భక్త వల్లభుడు, సులభ ప్రసన్నుడు అయిన శివుడు సృష్టికి ఆధారభూతమైనవాడు. అలాంటి శివుడిని ఏ రూపంలో కొలిస్తే ఆ రూపంలో ప్రసన్నుడవుతాడు. లింగాకారంలో, వేటగానిగా, జంగమయ్యగా, భక్తులు కోరుకున్న రూపాల్లో వారి కోర్కెలు తీరుస్తాడు. అంగుష్ట ప్రమాణమగు తేజోరూపం (జ్యోతిర్లింగం) మానవుని హృదయం, సహస్రారం మొదలగు స్థానాల్లో వెలుగుతుందని భారతీయ వేదాంత గ్రంథాలు చెబుతున్నాయి. అలాంటి శివుడు శ్మశానంలో ఉంటూ, అందరికీ మోక్షాన్ని ప్రసాదిస్తాడు స్వామి. మెడలో పాములు ధరించి అందరికి సర్వాభరణాలు ప్రసాదిస్తాడు.

తనను తాను జయించి ప్రపంచానికి మార్గదర్శకుడైనవాడు స్వామి. ఎలాంటి కోరికలు లేనివాడు కనుక స్వామి దిక్కులే అంబరాలుగా కలిగినవాడయ్యాడు. దిగంబరుడు అంటే సకల చరాచర ప్రకృతికి తాను పురుషుడై విరాజిల్లినవాడు. ఆయన సర్వాంతర్యామి. ఒక రూపం గాని, స్థానం గాని లేకుండా ప్రతి జీవిలో తానే ఉన్న స్వామికి ఏ వస్త్రాన్ని కట్టగలం. దిక్కులు తప్ప ఆయనకు ఏ వస్త్రాలూ సరిపోవు. పాములను ధరించి నాగాభరణుడై, చంద్రుడిని తలపై ధరించి చంద్రశేఖరుడైనాడు.

అందుకే ఎలాంటి కోరికలు లేనివారు. కోరికలను జయించినవారు స్వామి సన్నిధికి త్వరగా చేరుకోగలుగుతారు. నిరాడంబరతే శివతత్వం అన్న విషయాన్ని మనం గ్రహిస్తే ఆ పరమ శివుని చేరినట్లే.

ఈ శివరాత్రి పర్వదినాన శివనామస్మరణ చేసుకొంటూ జన్మరాహిత్యాన్ని ప్రసాదించమని ఆ సదాశివుణ్ణి సర్వదా ప్రార్థిద్దాం.

... తపోబుషి రాజశేఖర శర్మ

శివరాత్రి మహత్యం

శివరాత్రి ప్రతియేటా మాఘమాసంలో కృష్ణ చతుర్దశి నాడు వస్తుంది. ఆరోజున భక్తులు పగలంతా ఉపవాసముండి, రాత్రి జాగారము చేస్తారు. ఆరోజున శివకథలు వినడంతోనూ, కీర్తనలు, భజనలతోనూ, రుద్రాభిషేకంతోనూ జాగరణ చేస్తే శివసాన్నిధ్యాన్ని చేరుకోవచ్చు. పరమేశ్వరుడు ఐశ్వర్య ప్రదాత. మృత్యుంజయుడు. అపమృత్యు నివారణకు శివాభిషేకంలో ఈ శ్లోకం పఠించాలి.

శ్లో : త్ర్యంబకం యజామహే సుగన్ధిం పుష్టివర్ధనమ్
ఉర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్!

మాఘ బహుళ చతుర్దశి నాడు జ్వాలా స్తంభంలో తేజోలింగంగా మహాశివుడు ఆవిర్భవిస్తాడు. అందువల్ల ఈరోజున మహాశివరాత్రిగా లోకంలో ప్రసిద్ధి పొందింది.

శ్లో : శివరాత్రి మహారాత్రం నిరాహారో జితేంద్రియః
అర్చయే ద్వా యథాన్యాయం యథా బలమవంచకః
యత్ఫలం లభతే సద్యః శివరాత్రౌ మదర్శనాత్.

శివరాత్రి పర్వదినాన దివారాత్రాలు ఉపవాసముండి, ఇంద్రియ నిగ్రహంతో విధి విధానంగా శివుని అర్చించేవారు ఒక సంవత్సర కాలం శివుని పూజిస్తే వచ్చే ఉత్తమ ఫలాన్ని శివరాత్రినాడు ఒక్కరోజే పొందగలరు. శివసాన్నిధ్యం చేరుకోగలరు.



ఓం నమశ్శివాయ!

శ్రీరాముడు త్రేతాయుగంలో, శ్రీకృష్ణుడు ద్వాపరయుగంలో శివుని పూజించి, తమ కోరికలను నెరవేర్చుకున్నారు. ఓం నమశ్శివాయః అనే పంచాక్షరీ మంత్రంలో శివునికి పంచభూతాత్మకమైన సర్వవ్యాపకత్వం కలదని తెలియుచున్నది. అక్షరాల్లో ఓం పరమశివుడు, న – నభము (ఆకాశం), మ – మరుత్తు (గాలి), శి– శిఖ (అగ్ని), వ – నీరు, య – పృథ్వి అనే అర్థాలు కలవు.

లింగ పురాణంలో ఈ పర్వదినాన్ని గూర్చి శివుడు ఇలా చెప్పాడు, 'ఈ పర్వదినం రోజున ఎవ్వడైనను తెలిగాని, తెలియక గాని పరమేశ్వరుని ఆరాధించినచో వాడెంత పాపాత్ముడైనను సరే సర్వ పాపాల నుండి విముక్తుడై మోక్షాన్ని పొందగలడు'. వ్యాస మహర్షి రచించిన 18 పురాణాల్లో శివపురాణం ఒకటి. అందులో –

శ్లో : పఠనాచ్ఛ శ్రవణా దస్య భక్తి మాన్నద సత్తమః
సద్య శివప్రద ప్రాప్తిం లభ్యతే సర్వసాధనాత్

అంటే, శివపురాణాన్ని భక్తి శ్రద్ధలతో పఠించేవారు, ఆలకించేవారు, శివుని ఆరాధించేవారు మానవుల్లో ఉత్తములై ఈ లోకంలో అన్ని సుఖాలు పొంది, మరణానంతరం శివ పదాన్ని చేరుకుంటారు.

శ్లో : శ్రుతి స్మృతి పురాణా నామాలయం కరుణాలయం
నమామి భగవత్పాదం శంకరం లోకశంకరం.

అంటే, వేదాల్లో, స్మృతుల్లో, పురాణాల్లో మూల స్వరూపుడిగా కీర్తింపబడి, శుభాలను ఇచ్చే శంకర భగవానుని పాదారవిందాలకు మ్రొక్కుచున్నాను.

... డా. రాపాక ఏకాంబరాచార్యులు



జాగరణ అంటే?

శివలింగం ఓంకార స్వరూపం. ఓంకారమున ఉండే శివలింగమందే శివార్చన జరుపబడుతుంది. ఈ సంసార సాగరాన్ని తరింపజేసే ఓంకార స్వరూపుడైన రుద్రునికి నమస్కారమంటుంది యజుర్వేదం.

దుఃఖభూయిష్టమైన మానవ జీవితానికి తరుణోపాయానికై లింగంపై నీళ్లు పోస్తే చాలు మన కష్టాలు కడతేరుస్తాడట. శివుణ్ణి నిత్యం ఆరాధిస్తే భోగభాగ్యాలు సిద్ధిస్తాయని, దీర్ఘరోగాలు అనుభవించేవారు రుద్రపాఠయుక్తంగా అభిషేకం చేసినట్లయితే దీర్ఘవ్యాధి నుండి విముక్తులవుతారు. శివరాత్రి లింగార్చన, జాగరణ, ఉపవాసం ఎంతో ఉత్కృష్టమైనవి. మానవులు అల్ప విషయ సుఖాల కొరకై జీవితాన్ని ధారపోయక శాశ్వతమైన, పరిపూర్ణమైనట్టి ఆత్మానందాన్ని పొందడానికి సాంసారిక క్లేశాలను అధిగమించడానికి కలియుగంలో శివారాధన ఒక్కటే శ్రేష్ఠమైన మార్గం. ఈ ప్రపంచం అశాశ్వతమనీ, బ్రహ్మమొక్కటే శాశ్వతమనీ గ్రహించి, మన బుద్ధిని మేల్కొల్పడమే జాగరణం.

మృత్యుదేవత విప్పిన మరణ రహస్యం

ఉపనిషత్సుధ - 8



ఎక్కువ కాలం జీవించాలన్న ఆశ, మృత్యువు ముంచుకొస్తుందేమో అన్న భయం మనిషిని యాతన పెడుతుంటయ్. కానీ మరణం అనివార్యం!

మృత్యువును సైతం దేవతగా భావిస్తుంది మన దేశం!

మరణాన్ని జయించటం అంటూ లేదు. మృత్యు భావనను జయించడం అసాధ్యం కాదు. ఈ జయం సిద్ధించిన తరువాత శరీరాన్ని వదిలిపెట్టే వేళలు, నిశ్చలానంద స్థితిని అనుగ్రహిస్తయ్. అదే అనాయాస మరణం. ఈ భావనతో జీవించటమే దైన్యం లేని జీవితం.

సనాతన ధర్మం అగ్నిని, వాయువును దైవంగా భావించమని బోధిస్తుంది. అట్లాగే మరణాన్ని కూడా.

ఇంతకీ మృత్యుదేవత ఎవరు? యముడే! ఆయనే యమధర్మరాజు. యమధర్మంలో సంక్లిష్టత లేదు. అంతా సరళమే! సూటిదనమే!

ఎవరియందూ అపేక్ష, ఉపేక్షలు లేని సమవర్తి యముడు.

మరణ రహస్యాన్ని తెలుసుకోవాలన్న నచికేతసుడికి యముడు బోధించినదంతా ఆత్మపరమే! మృత్యు రహస్యాన్ని తార్కికంగా, స్పష్టంగా, గంభీరంగా విప్పి, విశదపరిచిన వైనమే ఉపనిషత్తుగా మనకు లభించింది.

పోయిన ప్రాణాన్ని వెనక్కి తీసుకురావటమనే భ్రమ నుండి, జీవించి ఉండగానే మరణ భయం నుండి బయటపడి, జీవన్ముక్తుడి వలె జీవించగలగటం, సాధన ద్వారా సాధ్యమేనని అభయవరదానం చేసే ఈ ఉపనిషత్, కఠోపనిషత్‌గా లోక ప్రసిద్ధం.

మృత్యువు బోధించిన ఉపనిషత్తు

గడ్డివాములో సూదిని పట్టుకోవటానికి ఎంత శ్రమపడాలో, మృత్యుంజయత్వం సిద్ధించుకోవటం వెనుక అంతకుమించిన శ్రమ ఉన్నది. మరణ దేవతే స్వయంగా చేసిన బోధగా కఠోపనిషత్‌ను అజరామరం చేసింది.

భగవాన్ శ్రీ రమణ మహర్షి యింతటి మహా స్థితిని అనుభవించి, జీవన్ముక్తులుగా, ఆ అనుభవం పొందిన నాటి నుండీ, అదే దేహంలో, మనముంటున్న ఇదే ప్రపంచంలో 54 సంవత్సరాలు నిలకడ చెందటం, ఒక నిరుపమాన సందర్భం. దేహాన్ని వదిలినా, అనుగ్రహచైతన్యంగా ఇప్పటికీ లోకానికి రమణులు ఒక ఆధ్యాత్మిక అనుభవమే. ఈ పరంపర అవిచ్ఛిన్నమైనది.

అరుణాచల స్మరణమే పరముక్తిని వరదానం చేస్తుందని భగవాన్ సాధనా మార్గాన్ని సరళ గంభీరంగా సూచించారు. అందుకై వారు ఆత్మ విచార మార్గాన్ని నిర్దేశించి 'నేనెవరు?' అన్న ప్రశ్నను సంధించుకోమన్నారు. తమస్సును వీడి తపస్సును, వేద ప్రచోదితమైన కర్మ మార్గాన్ని సమన్వయం చేసుకుని, జీవితాన్ని మరణ భయం లేకుండా జీవించమని బోధించారు. తమ జీవన విధానంతో దాన్ని సోదాహరణం చేశారు.

కర్మపాశం నుండి తప్పించేది..

నచికేతసుడు మృత్యుదేవతతో సాగించిన సంవాదము, అభినవవేదమై నచికేతాగ్నిగా వెలుగుతూనే ఉన్నది. తండ్రి ఆజ్ఞను అనుసరించి, యజ్ఞఫలం తండ్రికి సంపూర్ణంగా లభించాలని నచికేతసుడు యమలోకానికి వెళ్లటం, ఆ సమయంలో అక్కడ యముడు లేని కారణంగా మూడు రాత్రులు నిద్రాహారాలు మాని నిరీక్షించటం, ఆపై యముడు రావటం, నచికేతసుడిని మూడు వరాలు కోరుకొమ్మని అనటంతో సంభాషణ ప్రారంభమవుతుంది.

ఆ కారణంగా నచికేతసుడు తన లోకానికి తాను తిరిగి వెళ్లినప్పుడు తన తండ్రి తనను గుర్తించాలని, తన గురించి తన తండ్రికి ఎట్టి విచారం కలుగకూడదని, అగ్ని విద్యను ఉపదేశం చేయమని కోరుకుంటాడు.

మరణానంతరం జీవుడు ఉండడా? ఉంటాడా? అన్న విషయాన్ని బోధించమన్నపుపడు దయామయుడైన యముడు బోధించిన ఆత్మతత్వమే కఠోపనిషత్.

కర్మాచరణ, తత్వ విచారణ, యోగాభ్యసనం, ఈశ్వరార్పణ బుద్ధి, సమర్పణ, ఆత్మ విచారం, మోహక్షయాన్ని అనుగ్రహించి కర్మకాల పాశం నుండి విముక్తి కలిగించే సాధనా మార్గాలను స్పష్టంగా వివరించే కఠోపనిషత్ గంభీరమైనది.

పోయిన ప్రాణాన్ని వెనక్కి తీసుకురావటమనే భ్రమ నుండి, జీవించి ఉండగానే మరణ భయం నుండి బయటపడి, జీవన్ముక్తుడి వలె జీవించగలగటం, సాధన ద్వారా సాధ్యమేనని అభయవరదానం చేసే ఈ ఉపనిషత్, కఠోపనిషత్‌గా లోక ప్రసిద్ధం.

కేవలం వాచ్యార్థంగా కాక, యదార్థమైన, నిత్య సత్య శాశ్వతమైన ఆత్మను ఎలా పెరగాలో ఈ ఉపనిషత్ పాఠకుడికి బోధిస్తూ నెమ్మదిగా మరణ రహస్యం గుట్టు విప్పి చెబుతుంది.

... వి. ఎస్. ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

9.

నమస్తే తెలంగాణ

విహారం

[హైదరాబాద్]

శుక్రవారం 9 ఫిబ్రవరి 2018

శివుడు కేశవుడిలా..

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా నాగులాపురం మండలం సురుటుపల్లిలో వెలిసిన మహాశివుడు కేశవుడిలా దర్శనమిస్తాడు. శేషతల్పంపై నిద్రిస్తున్న మహావిష్ణువులా అరుదైన రూపంలో కనిపిస్తాడు. కాకపోతే ఇక్కడ ఆదిశేషువు శయనతల్పంగా ఉండదు. పల్లి కొండేశ్వరస్వామిగా పూజలందుకుంటున్న స్వామివారు.. పార్వతీదేవి ఒడిలో తలపెట్టి శయనతల్పంపై నిద్రిస్తున్నట్టుగా ఉంటాడు. ఆయన చుట్టూ ఇతర దేవతలూ కనిపిస్తారు. లోకమంతా లింగాకారంలో దర్శనమిచ్చే స్వామివారు.. ఇక్కడమాత్రం ఇలా ఎందుకు దర్శనమిస్తున్నాడనే దానికి ఒక కారణం ఉన్నదట. సురాసురులు సాగరమథనం చేసినప్పుడు సముద్రం నుంచి ఉద్భవించిన హాలాహలాన్ని లోక రక్షణార్థం స్వీకరిస్తాడు మహాశివుడు. దాని ప్రభావంతో ఆయనకు కాసేపు స్పృహ తప్పినట్టవుతుంది. అప్పుడు అమ్మవారి ఒడిలో సేదతీరుతాడు. కంగారుపడిన దేవతలు విశ్వనాథుడి చుట్టూ చేరి స్తుతిస్తారు. వారి మొరను ఆలకించిన పరమేశ్వరుడు గరళంతో నిండి నీలంగా మారిపోయిన తన కంఠాన్ని చూపి.. మరేం భయంలేదని అభయమిచ్చాడని స్థలపురాణం చెబుతున్నది. అలా సురులందరూ వచ్చి స్వామిని పూజించినందుకే.. ఈ క్షేత్రానికి సురులపల్లి అనే పేరొచ్చిందట. అదే కాలక్రమంలో సురుటుపల్లిగా మారిందట. మహాశివరాత్రికి ఇక్కడ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

ఏ శివాలయంలోనైనా లింగాకారమే మూల విరాట్టుగా ఉంటుంది. అది పరమేశ్వరుడికి ఉన్న శాపంగా చెబుతాయి పురాణాలు. శివుడు విగ్రహరూపంలో దర్శనమివ్వడం, అందులోనూ కేశవుడిలా కనిపించడం ఎక్కడైనా చూశారా? అలాంటి అరుదైన క్షేత్రమే ఇది.



పురాణ స్థలి

సుమధురం కృష్ణ నిలయం



మన దేశంలోని అతి పురాతన పుణ్యక్షేత్రాలలో ఒకటి మధుర. ఇక్కడి భూగృహ చెరసాలే శ్రీకృష్ణ జన్మస్థానమని తెలిశాక హృదయం ఉప్పొంగని భారతీయ భక్తులుండరు. యమునా నది తీరాన అటు మధుర, ఇటు బృందావనం కొలువైన తీరు నిజంగానే ముగ్ధ మనోహర దృశ్యం. ఎంతటి వారి జీవితానికైనా ఈ కృష్ణ నిలయ సందర్శనం ఒక మహద్భాగ్యం.

అటు రామాయణంలోని రామునికి, ఇటు మహాభారతంలోని కృష్ణునికి జన్మనిచ్చిన ఉత్కృష్ట రాష్ట్రం ఉత్తరప్రదేశ్. ఇక్కడి యుమునా నదీ తీరాన వెలసిన ఈ జంట ఆలయ నగరాల మధ్య దూరం కేవలం 9 కి.మీ. మాత్రమే. ఇక్కడ యాత్రికులు సందర్శించవలసిన ముఖ్యమైన ప్రదేశం కృష్ణుని జన్మస్థలి (జన్మస్థాన్).

మహావిష్ణువు అవతారంగా భావించే శ్రీకృష్ణుడు పుట్టిన అసలైన చెరసాల ఇక్కడి భూగృహంలోనే ఉండినట్టు చరిత్ర చెబుతుండడమే కాక భక్తులు పరిపూర్ణంగా విశ్వసిస్తున్నారు. చిన్నారి కృష్ణయ్య పసిపాపగా ఉన్నప్పటి విగ్రహాన్ని ఈ ఆలయంలో మనం దర్శించగలం. దీని ఎత్తు సుమారు నాలుగడుగులు. విష్ణుభక్తులు జీవితంలో ఒక్కసారైనా విధిగా సందర్శించవలసిన పుణ్యక్షేత్రాలలో మధుర ఒకటి.



జన్మస్థలి ఆలయ ప్రహరీగోడకు ఆవల ఇప్పుడున్న ఒక మసీదు స్థానంలోనే ఆనాటి చెరసాల ఉండేదని చెప్తారు. ఈ గదికి ఆనుకునే ఇవతలి వైపు ప్రధాన ఆలయం ఉంది. ఇక్కడి శ్రీకృష్ణ భగవానుని విగ్రహం అత్యంత ఆకర్షణీయం. జన్మస్థలి తర్వాత మధురలో విధిగా చూడతగ్గదే కాక, ఆలయాలన్నింటిలోకెల్లా అతిపెద్ద దేవాలయంగా 'ద్వారకాధీషుని' గుడిని చెప్తారు. ఇక్కడి శిల్పకళ అత్యద్భుతం. రాధతోపాటు అనేకమంది గోపికలతో కృష్ణుడు విహరించిన బృందావనంలో రెండు వేల ఆలయాలు ఉన్నాయంటారు. కానీ, లెక్కపెట్టుకొని అన్నింటినీ దర్శించే వారు ఎందరో చెప్పలేం. అయితే, ప్రధానంగా చూడవలసిన పురాతనమైన గుడులు మాత్రం సుమారు 10 వరకు ఉండవచ్చు. తర్వాతి కాలాలలో నిర్మితమైనవి మరో పన్నెండు దాకా ఉంటాయి. మిగిలినవన్నీ ఆయా గృహాలలో నెలకొల్పినవేనని అంటారు.



విశ్రామ్‌ఘాట్ అత్యంత పవిత్రం

యమునా నదీ తీరాన ఉన్న స్నానఘట్టాలలో 'విశ్రామ్‌ఘాట్'ను అత్యంత పవిత్రమైందిగా చెప్తారు. కారణం, కంసుని సంహరించిన తర్వాత శ్రీకృష్ణుడు నదిలో స్నానం చేసి ఆ ఘాట్ వద్దే విశ్రాంతి తీసుకున్నట్టు కథనం. యమున ఎవరో కాదు, యమధర్మరాజు సోదరి. కాబట్టే, యమద్వితీయ (కార్తీక శుద్ధ విదియ) నాడు ఇక్కడ స్నానం చేస్తే ముక్తి తథ్యమని భక్తులు నమ్ముతారు. కారణం, ఆ రోజు యముడు ఇక్కడికి వచ్చి చెల్లెలు ఆతిథ్యాన్ని స్వీకరించాడని ప్రతీతి. కాగా, కృష్ణుడు కంసుని దునుమాడిన చోటును 'కంసా కా తిల' అంటారు. ఈ ప్రదేశం మధుర నగరం చుట్టూ పరిక్రమ (ప్రదక్షిణం) జరిపే మార్గంలో ఉంటుంది. భక్తులు ముందు ప్రదక్షిణ చేసి తర్వాతే ఆలయంలో స్వామిని దర్శించుకుంటారు.

ఇంకా ఇక్కడ సందర్శనీయ ఆలయాలలో రంగాజీ, గోవింద దేవ్‌జీ, రాధావల్లభ, గోపీనాథ్, జుగల్ కిషోర్, మదన మోహన్ వంటివి ఉన్నాయి. గ్వాలియర్ మహారాజు నిర్మించిన లాల్‌బాబు ఆలయం, రాధాగోపాల్, గోవర్ధన్, బర్సానా, గోపీశ్వర మహాదేవ వంటి దేవాలయాలు చూడతగ్గవే. రంగాజీ ఆలయాన్ని అన్నింటిలోకెల్లా అతి పురాతనమైందిగా చెప్తారు. ఇది రామానుజాచార్య వారు ప్రబోధించిన విశిష్టాద్వైత శాఖకు చెందింది.



నాటి వాసుదేవ క్షేత్రమే నేటి మధుర

గౌతమ బుద్ధుని కాలం కంటే ముందే, క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దం నాటికే ఈ ప్రదేశం 'వాసుదేవ క్షేత్రం'గా ప్రసిద్ధిలో ఉన్నట్టు తెలుస్తున్నది. క్రీ.శ.1017లో గజనీ మహమ్మద్ మన దేశంపై జరిపిన దండయాత్రలో భాగంగా వినాశనమైన ఆలయ నగరాలలో మధుర కూడా ఉన్నది. ఇప్పటి జన్మస్థల్ ఆలయాన్ని అప్పట్లో 'కేశవదేవ్ ఆలయం'గా పిలిచే వారని, అది గజనీ బారిన ధ్వంసమవడమేకాక గుడితోపాటు నగరాన్ని కూడా ఆయన తగులబెట్టించినట్లు చరిత్ర చెబుతున్నది. ఐతే, ఆ వెంటనే ఆలయ పునర్నిర్మానం జరిగినా, క్రీ.శ.16వ శతాబ్దంలో సికిందర్ లోడీ మరోమారు ధ్వంసం చేస్తే, మళ్లీ పునర్నిర్మించినా, చివరకు క్రీ.శ.17వ శతాబ్దంలో ఔరంగజేబు సంపూర్ణంగా నాశనం చేసి, ఆలయ స్థానంలో ఒక మసీదును నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఈ మసీదును ఆనుకుని కట్టిన ఆలయమే ఇప్పటికీ ఉనికిలో ఉంది.

ఆగ్రాకు దగ్గరే!

రవాణా సౌకర్యాలు పుష్కలంగా ఉన్న మధుర ఆగ్రాకు కేవలం 50 కి.మీ.దూరంలోనే ఉంది. ఇక్కడికి రోడ్డు, రైల్వే మార్గాలకు లోటు లేనప్పటికినీ విమానం సౌకర్యం మాత్రం ఇప్పటికి ఏర్పడలేదు. 2012లోనే ప్రతిపాదనకు వచ్చిన ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఇది పూర్తయితే అంతర్జాతీయ యాత్రికులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

...✍ దోర్బల

ట్రావెలాగ్ - 6

ఆస్తి అంతా ప్రభుత్వానిదే!

ప్రపంచంలోని డెబ్బై ఐదు దేశాల్లో కుడివైపే డ్రైవ్ చేస్తారు. అమెరికా మొదటగా కుడివైపు డ్రైవింగ్‌ని ప్రవేశపెట్టింది. తర్వాత చాలా దేశాలు దాన్ని అనుసరించాయి. కార్ల పయొనీర్ హెన్రీ ఫోర్డ్ వల లకార్లని రోడ్డుకి కుడివైపు పోనివ్వడం ఏర్పడింది. అతను డిజైన్ చేసిన ఫోర్డ్ కారుకి స్టీరింగ్ వీల్‌ని కారుకి ఎడమవైపు అమర్చాడు. అందువల్ల కారు రోడ్డుకి కుడివైపు నడవాలి. ఎందుకంటే ముందు సీట్లో డ్రైవర్ పక్కన కూర్చున్న ప్రయాణికుడు తలుపు తెరుచుకుని రోడ్డుకి కుడివైపు దిగాలి. ఫ్రాన్స్‌ది కుడివైపు డ్రైవింగ్ కాబట్టి ఫ్రాన్స్ పాలిత దేశాలన్నీ కుడివైపు డ్రైవింగ్ చేస్తాయి. ఇంగ్లండ్‌ని మినహాయిస్తే యూరప్ దేశాలన్నీ కూడా కీప్ రైట్. ఇంగ్లండ్, దాని పాలిత దేశాలైన ఇండియా లాంటి దేశాలు కీప్ లెఫ్ట్‌ని అనుసరిస్తున్నాయి.

1920లలో కెనడా, ఇటలీ, స్పెయిన్ దేశాలు, 1930లలో తూర్పు యూరప్‌లోని చాలా దేశాలు, 1960లలో స్కాండినేవియన్ దేశాలు కుడివైపు డ్రైవింగ్‌కి మారాయి. ఒకప్పటి బ్రిటిష్ పాలనలో ఉన్న కొన్ని ఆఫ్రికన్ దేశాలు కూడా ఇరుగు, పొరుగు దేశాలకి అనుగుణంగా కుడివైపు డ్రైవింగ్‌కి మారాల్సి వచ్చింది. లేదా డ్రైవర్‌కి కుడి నించి ఎడమకి అకస్మాత్తుగా మారి డ్రైవ్ చేయడం ఇబ్బంది అయి ప రమాదాలు అధికంగా జరుగుతాయి. బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు హాంకాంగ్‌లో కీప్ లెఫ్ట్. తర్వాత హాంకాంగ్ చైనా పాలనలోకి వెళ్లింది. చైనాలో కుడివైపు డ్రైవింగైనా, హాంకాంగ్‌లో మాత్రం కీప్ లెఫ్టే కొనసాగుతోంది. కుడివైపు డ్రైవ్ చేయడానికి నిర్మించబడ్డ వాహనాలు హాంకాంగ్‌లో నిషిద్ధం. ఐతే ప్రభుత్వ వాహనాలకి ఈ నిషేధం వర్తించదు. ఇలా ఒకే దేశంలో కీప్ రైట్, కీప్ లెఫ్ట్ పద్ధతులు రెండూ ఉన్నది ఒక్క చైనాలోనే.



సొంత ఇల్లనేదే ఉండదు!

హేరిస్ అసలు పేరు టిన్ పింగ్ అట. విదేశస్థులకి చైనా పేర్ల కన్నా క్రిస్టియన్ పేర్లు గుర్తుంచుకోవడం తేలిక కాబట్టి క్రిస్టియన్ పేర్లని పెట్టుకుంటారట. ఇది భారతీయ పర్యాటక శాఖ పాటించదగ్గ సౌకర్యవంతమైన ఆచారం అనిపించింది. మా బస్ హోటల్‌కి చేరుకునేదాకా చైనా గురించి హేరిస్ సూక్ష్మంగా వివరించాడు.

'చైనా చరిత్ర మూడు వేల సంవత్సరాలకి పూర్వంది. ప్రధాన ప్రాచీన నాగరికతల్లో చైనా ఒకటి. 1949కి మునుపు మా దేశం పేరు చైనా. 1949 తర్వాత అంటే తిరుగుబాటు అనంతరం మావ్ (మనం మావో అంటాం) చైనా అధినేత అయ్యాక, 1949 మునుపు చైనాని ఓల్డ్ చైనాగా, నేటి చైనాని న్యూ చైనాగా పిలుస్తున్నాం. చైనాలో ప్రధాన భాష చైనీస్ లేదా మాండరిన్. అందువల్ల స్కూల్లో మాండరిన్ తప్పనిసరిగా నేర్చుకోవాలి. అక్కడ కూడా ప్రదేశాన్ని బట్టి మాండరిన్ మాండలికాలు మారుతూ ఉంటాయి. ఉదాహరణకి బీజింగ్‌లోని స్థానిక మాండలికం హంగ్ చో. షాంఘైలో మాండలికం వేరు. చైనీస్ భాషలో వందల కొద్దీ మాండలికాలు ఉన్నాయి. వెయ్యి భాషలున్నాయి. భారత దేశానికి, చైనాకి సత్సంబంధాలున్నాయి. హుయాన్‌త్సాంగ్ మా దేశం నించి ఐదు వందల ఏళ్ల క్రితం క్రీ.శ. 1644లో ఇండియాకి వచ్చాడు. (క్రీ.శ. 644లో హ్యుయాన్‌సాంగ్ కుంభమేళా గురించి రాశాడని ఓ ఆధ్యాత్మిక పుస్తకంలో చదివాను). బీజింగ్ నాలుగు ఋతువులున్నాయి. వసంతం, వేసవి, చలికాలం, వర్షాకాలం. వేసవిలో నలభై డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే చలికాలంలో మైనస్ ఇరవై డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. అంటే మంచు కురుస్తుంది.

చైనాలో విద్య ఉచితం. ప్రైమరీ స్కూల్లో ఆరేళ్లు చదవాలి. పదో ఏట మీడియం స్కూల్లో చేరాలి. హైస్కూల్‌లో మూడేళ్లు. యూనివర్సిటీ చదువు మాత్రం ఉచితం కాదు. అందుకు ఏభై వేల ఆర్ఎంబిల దాకా ఖర్చవుతుంది. ఐతే స్కాలర్‌షిప్ అవకాశం ఉంటుంది. సంవత్సరానికి సగటున చైనీస్‌కి వచ్చే జీతం 5 నుంచి 6 వేల అమెరికన్ డాలర్లకి సమానం. బీజింగ్‌లో ఓ సాధారణ ఇంటి ఖరీదు నలభై లక్షల ఆర్‌యంబిలు (సుమారు మూడు కోట్ల డెబ్బై లక్షల రూపాయలు). ఒక్క చైనీస్‌కి కూడా సెంటు భూమి లేదు. చైనాలోని మొత్తం భూమి ప్రభుత్వానికి చెందిందే. నివేశన స్థలం, పొలం, ఆఫీస్, ఫేక్టరీల స్థలాలు మొదలైనవన్నీ కమ్యూనిస్ట్ ప్రభుత్వ ఆస్తులే. ప్రభుత్వం ప్రజలకి ఇల్లు కట్టుకునేందుకు కేవలం డెబ్బై సంవత్సరాలకి స్థలం లీజ్‌కి ఇస్తుంది. ఆ తర్వాత ఇల్లు వదిలిపెట్టి వెళ్లిపోవాలి. పొలం కూడా అద్దెకే ఇస్తుంది. మా ప్రభుత్వం ప్రపంచంలోనే చాలా ఐశ్వర్యవంతమైన ప్రభుత్వం' అని చెప్పాడు.

ఒక జంట.. ఒక బిడ్డ..

'చైనా జనాభా 130 కోట్లు. మీ పక్కనించి చైనీస్ అంతా ఓ వరుసలో నడుస్తూంటే, ఆ వరుస పూర్తవకుండా అనంతంగా సాగుతుంది. కారణం చైనాలోని జననాలు. అందుకే మా దేశంలో 'ఓ జంట, ఓ బిడ్డ' అనే ఆదర్శం పాటిస్తున్నాం' అని కూడా చెప్పాడు హేరిస్.

చైనాలోని అధిక జనాభాకి కారణం భర్తల్లోని మగతనం గాని, భార్యల్లోని ఫర్టిలిటీ గాని కాదు – వారి కండోమ్స్‌లోని లోపం.

చైనాలోని ఒక బిడ్డ పాలసీ వల్ల ఏటా పది లక్షల ఆడ శిశువులకి అబార్షన్స్ జరుగుతున్నాయి. లక్షల మంది చైనీస్ తల్లిదండ్రులు తమకి పుట్టిన ఆడ శిశువులని ఎక్కడైనా వదిలేస్తున్నారు. ఇండియాలో లాగా చైనీస్ కూడా మగ పిల్లల్ని కోరుకుంటారు. ముఖ్యంగా గ్రామీణ రైతులు మగ సంతానాన్నే కోరుకుంటారు. దాంతో చైనాలో డెలివరీ సమయంలో మంచం కింద నీళ్ల బేసిన్‌ని ఉంచి, ఆడపిల్ల పుడితే ఆ బేసిన్‌లో ముంచి చంపేస్తారు అని నేను చదివాను. చైనాలో సగటున ప్రతీ అర నిమిషానికి ఓ అంగ వికల బిడ్డ పుడుతోంది.

(ఇంకా ఉంది)

...✍ మల్లాది వెంకట కృష్ణమూర్తి

నా ప్రయాణం

అపురూప ప్రయాణం



2002 సంవత్సరం... డిసెంబరు మాసం..

ఓరోజు నేను తొమ్మిదో తరగతి పిల్లలకి క్లాసులో పాఠం చెబుతున్నాను. అయిదు నిమిషాలైతే లంచ్ బెల్ మోగుతుంది. ఇంతలో ఆయమ్మ వచ్చి, నాకు ఫోన్ వచ్చిందనీ, చాలా అర్జెంట్ అనీ చెప్పింది. ఏమిటో అని పరుగుపరుగున వెళ్లాను. అవతలి నుంచి కమ్మని కంఠం. సుపరిచితంగా ఉంది. కానీ ఎవరో నాకు తెలియదు. 'అక్కా..!' అని పిల్చింది. ఎవరా అని ఆలోచిస్తున్నంతలోనే 'నేను.. ప్రీతిని' అంది అవతలి కంఠం. ఇక నేను నేనే కాను.. నా ఆనందం పట్ట వశం కాలేదు. కాళ్లు గాలిలో తేలుతూ, మనసు మైమరిచిపోతూ విన్నాను. 18 ఏళ్ల తర్వాత నా చిన్న చెల్లి నాతో మాట్లాడింది. మా అమ్మానాన్న మధ్య విభేదాల వల్ల చెల్లి నాన్నతోనే ఉండిపోయింది. నాన్న మాతో తెగదెంపులు చేసుకోవడంతో తనని చూడలేకపోయాం. అనుక్షణం తన గురించే ఆలోచిస్తూ అమ్మ ఆరోగ్యం పాడయింది. ఇప్పుడు పద్దెనిమిదేళ్ల తర్వాత చెల్లి నాతో మాట్లాడుతోంది.

వెంటనే నేను, పెద్ద చెల్లి తనని కలిసేందుకు వెంటనే వెళ్లాలని నిర్ణయించుకున్నాం. కానీ రెండ్రోజుల్లో ప్రీతి పుట్టినరోజు. అందుకే పుట్టిన రోజు నాడే వెళ్దామని నిర్ణయించుకున్నాం. చేతిలో డబ్బు లేకపోతే స్కూల్‌లోని తోటి టీచర్ దగ్గర 500 రూపాయలు అప్పు తీసుకున్నాను. (అప్పటికి అక్క ఉద్యోగం చేయడం లేదు. లా చదువుతున్నది). ప్రీతి పుట్టినరోజు కదా.. అందుకే వీలైనంతలో ఒక డ్రెస్ కొన్నాం.

తెల్లవారే కరీంనగర్ జిల్లాలోని అగ్రహారానికి ప్రయాణం. అక్కడే చెల్లి డిగ్రీ చదువుతున్నది. నాన్నకు తెలియకుండా తన కాలేజిలో ప్రీతిని కలవాలని ప్లాన్ చేసుకున్నాం.

ఉదయాన్నే లేచి, రెడీ అయ్యాం. లేచినప్పటి నుంచే హడావిడి. ఎక్కడ లేని సంతోషంతో పనులు తెమలడం లేదు. దీనికి తోడు స్నానం చేయడానికి హీటర్ పెట్టుకుందామంటే కరెంటు లేదు. దాంతో చన్నీళ్లతోనే గబగబా స్నానం చేసేశాం. ప్రీతి కోసం రకరకాల పదార్థాలు చేసింది అమ్మ. అప్పాలు చేసి మూటగట్టి ఇచ్చింది. పులిహోర ఒక డబ్బాలో సర్దింది. ఎంత తొందరగా బయల్దేరుదాం అనుకున్నప్పటికీ 6 కానే అయింది. సిటీబస్సు పట్టుకుని జూబ్లీ బస్ స్టేషన్ (సికింద్రాబాద్) వెళ్లాలి. సికింద్రాబాద్ వెళ్లే బస్సులు చాలానే ఉంటాయి. కాని మాకు పరీక్ష అన్నట్టుగా విచిత్రంగా ఎంతకీ ఒక్క బస్సూ రాదు. అక్కడికి ఎంత తొందరగా చేరితే అంత ఎక్కువ సేపు తనతో గడిపేందుకు అవకాశం ఉంటుంది. లేకుంటే సమయం సరిపోదు. అదే టెన్షన్‌గా ఉంది. మొత్తానికి సికిందరాబాద్ చేరుకున్నాం.

అసలు ప్రయాణం మొదలైంది

అది ఆర్డినరీనో, ఎక్స్‌ప్రెస్సో.. ఇంకేదో తెలియదు. కానీ మా మనసు ఎంత వేగంగా వెళ్తున్నదో ఆ బస్సు అంత నెమ్మదిగా నడుస్తోంది. ఓ గంటలో అగ్రహారం చేరుకుంటామనగా ఏదో ఊళ్లో ఆగింది బస్సు. ఊరి పేరు గుర్తు లేదు. ఏదో రాజకీయ ధర్నా జరుగుతోంది. అది దాటుకుని బస్‌స్టాండులో ఆగిందో లేదో డ్రైవర్ దిగిపోయాడు. ఎంత టైం గడిచినా రాడు. ఏమైందని ఆరా తీస్తే తెలిసింది. అతని డ్యూటీ అయిపోయిందట. కొత్త డ్రైవర్ మారుతాడట. అతడు వచ్చేవరకు టెన్షన్‌గా ఎదురు చూశాం.

డ్రైవర్ వచ్చి, బస్టాండు నుంచి బస్సు బయటికి వచ్చి, ఊరి పొలిమేరల్లోకి వచ్చిందో లేదో బస్సు కీచుమంటూ ఆగిపోయింది. బస్సు పాడయిపోయిందంటూ దిగేయమన్నారు. మళ్లీ ఇంకో బస్సు కోసం వెయిటింగ్. మొత్తానికి ఓ బస్సును ఆపి, అందర్నీ ఎక్కించారు. మాకిది పెద్ద పరీక్ష లాగా అనిపించింది.

మొత్తానికి అగ్రహారంలో బస్సు ఆగింది. బస్సు లోంచి ఒక్క దూకులో దిగేశాం. హమ్మయ్య! ఇప్పుడు డిగ్రీ కాలేజీ అడ్రసు పట్టుకోవాలి. అక్కడున్న ఒక టెలిఫోన్ బూత్‌లో అడ్రస్ అడిగి వెళ్లాం. ఒక కిలోమీటర్ నడిస్తే డిగ్రీ కాలేజి వచ్చింది. దారిలో కనిపించిన ఇద్దరమ్మాయిలను ప్రీతి గురించి అడిగితే తన తరగతి గది చూపించారు. అక్కడికి వెళ్తే కంప్యూటర్ ల్యాబ్‌లో ఉందన్నారు.

ప్రీతిని చూడడానికి మా గుండె వేగంగా కొట్టుకుంటోంది. మా ముద్దుల చెల్లి ఇప్పుడెలా ఉందో! రూపురేఖలేవీ మాకు తెలియవు. తనని ఎలా గుర్తుపట్టాలో.. అనుకుంటూ అదురుతున్న గుండెలతో ల్యాబ్ బయట వెయిట్ చేశాం.

ఇంతలో...

కళ్లకి కళ్లద్దాలు, మెళ్లో సన్నని గొలుసు.., చేతులకి గాజులు.., నీలిరంగు కుర్తీ, పైజమా వేసుకుని ఓ అమ్మాయి వచ్చింది. తన కళ్లద్దాల వెనుక నీటి తడి, బుగ్గలపై జారుతోంది. అప్రయత్నంగానే మా కళ్లు వర్షించాయి. ఇన్నేళ్లుగా గూడు కట్టుకున్న ప్రేమ అంతా ద్రవీభవనం చెంది, కళ్లలోంచి ధారాపాతంగా కారుతున్నది.

హ్యాపీ బర్త్ డే రా.. అంటూ దగ్గరికి తీసుకున్నాం. క్లాస్‌లో పర్మిషన్ తీసుకుని మాతో పాటు బయటికి వచ్చేసింది ప్రీతి.

అగ్రహారంలో ఆంజనేయ స్వామి ఆలయం చాలా పేరున్నది. ఆ ఆలయ అర్చకుని కూతురు ప్రీతికి స్నేహితురాలే. వాళ్లింట్లో మేము తెచ్చిన డ్రెస్ వేసుకుంది. అదే ఆలయంలో ప్రీతి బర్త్‌డే సెలబ్రేట్ చేశాం. మేము జాగ్రత్తగా పట్టుకువచ్చిని కేక్ కట్ చేయించాం. అమ్మ చేసిన వంటకాలు తినిపించాం. మా కళ్లలో ఒక తృప్తి.. కానీ మళ్లీ తనని వదిలిపోవాలన్న బాధ.

అప్పుడే సాయంత్రం అయిపోయింది. ప్రీతి ఇంటికి వెళ్లాలి. ఆలస్యం అయితే నాన్నతో తిట్లు తప్పవు. అనవసర అనుమానాలూ వస్తాయి. అందుకే భారమైన గుండెలతో తిరుగు ప్రయాణానికి కదిలాం.

...✍ సుధ, న్యూ ఢిల్లీ

మీరు తరచుగా ప్రయాణాలు చేస్తుంటారా? దేశవ్యాప్తంగా ఊళ్లు చుట్టి వస్తుంటారా? పుణ్యక్షేత్రాలైనా, విహార యాత్రలైనా... వినోదం కోసమైనా, విజ్ఞానం కోసమైనా... మీరు చేసిన ప్రయాణం మాకెంతో ప్రియమైనది. మీ ప్రయాణానుభవాలు మరెందరికో ఉపయోగపడవచ్చు.

సరదాగా నిరంతర ప్రయాణాలు చేస్తున్నా, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ టూర్లు వెళ్తున్నా... మీరు వెళ్లిన ప్రదేశం, దాని విశిష్టత, అక్కడి మీ అనుభవాలు, వెళ్లడానికి కారణాలు... వివరంగా మాకు రాసి పంపండి. మీ భావాలూ, భావోద్వేగాలు, అనుభవాల సమాహారాన్ని పేపర్‌పై పెట్టండి. అక్షరబద్ధం చేయండి. అంతేకాదు.. మీ ఊళ్లో, మీ చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏమైనా ప్రత్యేకతలున్నా, పుణ్యక్షేత్రాలూ, జాతరలూ, ప్రత్యేక సంప్రదాయాలున్నా మాకు తెలుపండి. మీ పేరుతో ప్రచురిస్తాం.

మరింకేం.. రాయడం మొదలుపెట్టండి.

మా చిరునామా

విహారం (నా ప్రయాణం), నమస్తే తెలంగాణ,
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్,
రోడ్ నెం. 10, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 34.
viharam@ntnews.com

సుడోకు

డైలీ సుడోకు 121 సమాధానం


1	9	3	7	6	5	8	4	2
2	5	8	4	1	9	6	7	3
7	4	6	8	2	3	1	9	5
4	8	7	9	3	1	5	2	6
9	2	5	6	8	7	4	3	1
6	3	1	2	5	4	7	8	9
5	1	9	3	7	8	2	6	4
3	7	2	1	4	6	9	5	8
8	6	4	5	9	2	3	1	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -122

3	5							
8	2			4	6	9		
					2	5		
		8	4					
4	1		2		7		9	5
					1	2		
		3	9					
		2	6	7			1	3
							8	9


CK సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్
a V.V.Vinayak film
నేడే విడుదల
THAMAN.S MUSICAL
ఇంటెలిజెంట్
INTTELLIGENT
వి.వి.వినాయక్ సి.కళ్యాణ్
సి.వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా యస్.యస్.తమన్
శివ ఆకుల గౌతంరాజు ఎస్.వి.విశ్వేశ్వర్ బ్రహ్మ కడలి వెంకట్ బి.ఏ.రాజు
design dhani AELAY
TO PARTICIPATE IN INTELLEGENT MOVIE CONTEST
SCAN QR CODE IN Paytm APP
AND WIN UPTO 1 LAKH PAYTM CASH
ప్రేక్షక అభిమానులు 'ఇంటెలిజెంట్' పైరసీ లింక్ తెలిసినచో ఈ క్రింది ఫోన్ నంబర్ లేదా
ఈ-మెయిల్ కు తెలియచేసి, మా హీరో చేతుల మీదుగా బహుమతి అందుకోండి.
ఫోన్: 040-23547823, వాట్సప్ నెం: 99665 04504 (మహేందర్)
ఈ-మెయిల్: cybercell@apfilmchamber.com
U/A
ADITYA MUSIC

50 శాతం నిధులు అదనంగా ప్రతిపాదించండి

- వైద్య, ఆరోగ్యశాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై అధికారులకు మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశం



వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై గురువారం సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో అమలుచేస్తున్న వివిధ పథకాలు, వాటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌ను ప్రతిపాదించాలని ఆ శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని వచ్చేఏడాదికి కనీసం 50 శాతం నిధులు అదనంగా కావాల్సి ఉందని చెప్పారు. విజయవంతంగా అమలవుతున్న కేసీఆర్ కిట్ల పథకం కింద మరిన్ని మాతాశిశు ఆరోగ్య వైద్యశాలల నిర్మాణానికి అనుగుణంగా నిధులను ప్రతిపాదించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్ ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలపై గురువారం సచివాలయంలో మంత్రి లక్ష్మారెడ్డి అధికారులతో సమీక్షించారు. వైద్య, ఆరోగ్యశాఖపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని, అవసరాన్ని బట్టి అధికమొత్తంలో నిధులిచ్చేందుకు సుముఖంగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కొత్తగా చేపట్టనున్న నియామకాలు, ప్రభుత్వ దవాఖానలకు పెరుగుతున్న రోగుల తాకిడి.. ఇందుకు అనుగుణంగా కల్పించాల్సిన సదుపాయాలకు అవసరమైన నిధులపై దృష్టి పెట్టాలన్నారు. కంటి, మధుమేహం, బీపీ, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి అన్ని రోగనిర్ధారణ పరీక్షలు, ఆధునిక పరికరాలు, మందులు, కొత్త భవనాల నిర్మాణాలకు అనుగుణంగా ప్రతిపాదనలు ఉండాలన్నారు. సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీహెచ్ లలితాకుమారి, హెల్త్‌యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి, ఐపీఎం డైరెక్టర్ శంకర్, నిమ్స్ డైరెక్టర్, ఆరోగ్యశ్రీ సీఈవో మనోహర్, ఈజేహెచ్‌ఎస్ సీఈవో పద్మ, ఆయుష్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎంఎన్‌జే దవాఖాన డైరెక్టర్ జయలత, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చీఫ్ ఇంజినీర్ లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి చిరుజల్లులు

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న ద్రోణి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో శనివారం నుంచి రెండురోజులపాటు రాష్ట్రంలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉన్నట్టు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) తెలిపింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రం వైపు తేమతో కూడిన గాలులు వీస్తున్నాయని.. వీటికితోడు ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో గాలిలో తేమశాతం పెరిగి, గత రెండురోజులుగా రాష్ట్రంలో వాతావరణం చల్లబడిందని పేర్కొన్నది. కాగా గురువారం సైతం ఆకాశం మేఘావృతంగానే ఉన్నది. మబ్బుల కారణంగా భూతాపం త్వరగా చల్లారకపోవడంతో రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నట్టు టీఎస్‌డీపీఎస్ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాటి కనిష్ఠ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే నిర్మల్‌లో అతితక్కువగా 11.7 డిగ్రీలు, అత్యధికంగా సూర్యాపేటలో 19.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 నుంచి 36 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. హైదరాబాద్‌లో గరిష్ఠంగా 35.6 డిగ్రీలు, కనిష్ఠంగా 18.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్ తెలిపింది.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

- 14వరకు అవకాశం.. మార్చి 24న ఓటర్ల జాబితా విడుదల
- రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉన్న 18 ఏండ్లు నిండిన భారత వయోజనులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదుచేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ కోరారు. ఈ ఏడాది పంచాయతీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ లిస్టు పూర్తిచేస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల నమోదుకు సంబంధించిన అభ్యంతరాలు, సూచనలను ఈ నెల 14 వరకు మార్చుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 83 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్ల తుదిజాబితా మార్చి 24న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో మెజారిటీ గ్రామ పంచాయతీల పదవీకాలం ఆగస్టు ఒకటితో ముగుస్తుందన్నారు.

దశలవారీగా ఓటర్ల జాబితా సవరణ	షెడ్యూల్	
అభ్యంతరాలు, సూచనలు	23.01.2018 నుంచి	14.02.2018
ప్రత్యేక శిబిరాలు	04.02.2018	11.02.2018
అభ్యంతరాలపై పరిశీలన	05.03.2018	
డాటా అప్‌డేషన్	15.03.2018	
ఫైనల్ జాబితా ప్రింటింగ్	22.03.2018	
ఓటర్ల తుదిజాబితా	24.03.2018	



మద్యం డిపోల సమస్యలపై గురువారం నాంపల్లిలోని ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న టీఎస్‌బీసీఎల్ చైర్మన్ దేవీప్రసాదరావు

మద్యం డిపోల్లో అక్రమాలకు తెర

- ఆడిట్ విభాగం ఏర్పాటుతో సత్ఫలితాలు: దేవీప్రసాదరావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విజిలెన్స్ ఆడిట్ విభాగం ఏర్పాటుతో మద్యండిపోల్లో అక్రమాలకు తెరపడిందని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు చెప్పారు. గురువారం నాంపల్లిలోని ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమావేశమై మద్యండిపోల సమస్యలపై చర్చించారు. డిపోలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తెచ్చి అవి పరిష్కారం అయ్యేట్లు చూడాలని అధికారులకు దేవీప్రసాదరావు సూచించారు. ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సోమేశ్‌కుమార్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ మాట్లాడుతూ డిపోల్లో ఉన్న సమస్యలను అధిగమించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. సమావేశంలో ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ రాజశేఖర్‌రావు, మద్యం డిపోల మేనేజర్లు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



మేధోమథన సమావేశంలో వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ ప్రవీణ్‌రావు

రైతుల కోసం గ్యాన్ కిసాన్ యాప్

అభివృద్ధిపై వ్యవసాయ వర్సిటీలో మేధోమథనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రైతులకు మెరుగైన విస్తరణ సేవలు అందించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం, ముంబైకి చెందిన రివర్‌బ్రిడ్జ్ వెంచర్స్‌తో కలిసి గ్యాన్ కిసాన్ యాప్‌ను రూపొందిస్తున్నది. గురువారం జరిగిన మేధోమథన సమావేశంలో ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో ఐదు ప్రధాన పంటలు పండించే రైతులకు ఈ యాప్ ఎంతో ప్రయోజనకరంగా ఉండాలని తెలిపారు. యాప్ రూపొందించడానికి అవసరమైన సాంకేతిక అంశాలను రివర్‌బ్రిడ్జ్ సంస్థ సేకరిస్తుందని అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డాక్టర్ కేఎస్ డాంగే, డాక్టర్ డీ రాజిరెడ్డి, టీ ప్రదీప్, డాక్టర్ కేవీఎస్ మీనాకుమారి, డాక్టర్ సదాశివరావు, డాక్టర్ జీవన్‌రావు, రివర్‌బ్రిడ్జ్ వెంచర్స్ ప్రతినిధి ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.



గురువారం ఏపీ బంద్‌తో బోసిపోయిన విజయవాడ బస్టాండ్

ఏపీలో బంద్ ప్రశాంతం

వామపక్షాలతోపాటు నిరసనలో పాల్గొన్న టీడీపీ నేతలు

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో వివక్షను నిరసిస్తూ వామపక్షాలు గురువారం చేపట్టిన ఆంధ్రప్రదేశ్ బంద్ ప్రశాంతంగా జరిగింది. ప్రధాన ప్రతిపక్షం వైసీపీతోపాటు, కాంగ్రెస్, □జనసేన పార్టీలు బంద్‌కు మద్దతు ప్రకటించాయి. పార్లమెంట్‌లో తమ పార్టీ ఎంపీలు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా టీడీపీ శ్రేణులు కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఏపీలో అధికార, ప్రతిపక్ష, వామపక్షాల అన్నీ బంద్‌లో పాల్గొనడంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. బంద్ కారణంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన పాదయాత్రకు గురువారం విరామం ప్రకటించారు. ఏపీలోని 13 జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల ముందు రాజకీయపార్టీల నేతలు బైఠాయించారు. దీంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కృష్ణాజిల్లా పెనమలూరు టీడీపీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గుండు గీయించుకొని నిరసన తెలిపారు. విజయవాడ లెనిన్‌సెంటర్‌లో వామపక్షాలు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టీఆర్‌ఎస్ కార్యకర్త కొణిజేటి ఆదినారాయణ పాల్గొని బంద్‌కు మద్దతు తెలిపారు.

విభజన హామీలు అమలుచేయాలి

- హామీల అమలుపై జేఏసీలతో భేటీ అవుతాం
- తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయం తీసుకుంటాం
- పవన్ ఆలోచనలకు జయప్రకాశ్ నారాయణ మద్దతు



లోక్‌సత్తా కార్యాలయంలో జయప్రకాశ్ నారాయణను కలిసిన పవన్ కల్యాణ్

హైదరాబాద్/ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాలు విడిపోయాక విభజన చట్టం ప్రకారం న్యాయం జరుగలేదని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. విభజన సమయంలో చేసిన వాగ్దానం కోసం రాజకీయ నాయకులు, మేధావులతో కలిసి చర్చించి, కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయన గురువారం హైదరాబాద్‌లో లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణతో సమావేశమయ్యారు. విభజన చట్టం హామీల అమలుపై అన్ని జేఏసీలను కలుస్తామని, తెలంగాణలోని జేఏసీ, తెలంగాణ ప్రభుత్వం అభిప్రాయం తీసుకుంటామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ అంశంపై సమగ్ర విశ్లేషణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమాజం పట్ల ప్రేమ, మంచి జరుగాలన్న తపనతో పవన్ ఏపీ కోసం పోరాడుతున్నారని జేపీ తెలిపారు. పవన్ ఆలోచనలను మద్దతు తెలుపుతున్నానని ప్రకటించారు. మరిన్ని మాటలు చట్టాల్లో పెట్టకపోవచ్చుకానీ అప్పటి ప్రధానమంత్రి, హోంమంత్రి పార్లమెంట్ సాక్షిగా ఏపీ ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

సర్కారు ముందుచూపు

రాష్ట్రవ్యాప్తంగా నేత్రవైద్య శిబిరాల నిర్వహణకు కసరత్తు

గ్రామీణుల ఆరోగ్యం కోసం సీఎం నిర్ణయం ■ ఉచిత పరీక్షలు, కంటి అద్దాల పంపిణీ

శస్త్రచికిత్సల కోసం ఆధునిక పరికరాలు ■ ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భవిష్యత్ తరానికి ప్రమాదకరంగా మారుతున్న కంటిచూపు సమస్యల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా నేత్ర వైద్యశిబిరాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. గ్రామీణులు వ్యక్తిగత ఆరోగ్యంపై అంతగా శ్రద్ధ చూపకపోవడంతో వివిధరకాల వ్యాధుల బారినపడుతున్నారు. కంటిచూపుపై అవగాహన లేక పరిస్థితి తీవ్రమయ్యేవరకు దవాఖానలకు వెళ్లడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్ని గ్రామాల్లో నేత్రవైద్యశిబిరాలను నిర్వహించాలని నిర్ణయించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వైద్యశిబిరాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రతి గ్రామంలో మెగా నేత్ర వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి, ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు, అవసరమైనవారికి కంటి అద్దాలను కూడా అందజేయనున్నారు. శాశ్వత ప్రాతిపదికన నేత్ర వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అంధత్వరహిత తెలంగాణే లక్ష్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సర్కారు దవాఖానాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వైద్యసేవలను మరింత విస్తృతం చేస్తున్నారు. అంధత్వరహిత తెలంగాణ (అవైడబుల్ బ్లైండ్‌నెస్ ఫ్రీ తెలంగాణ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది. రాష్ట్రంలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఈ విషయం లో మరింత విస్తృతంగా ఆలోచించి కార్నియా సమస్యతోనే కాకుండా.. రెటీనా, గ్లుకోమా, మధుమేహం, ఇతర సమస్యలతోనూ కంటిచూపు కోల్పోతున్న వారికి వైద్యసేవలు అందించాలని భావిస్తున్నది.

కంటి వైద్యసేవలు విస్తృతం..

గ్రామాల్లో మెగా నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్న వైద్య ఆరోగ్యశాఖ అవసరమైన వారికి అపరేషన్లు చేయించేందుకు అధునాతన పరికరాలను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లుచేస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో లేజర్ కంటి శస్త్రచికిత్సల పరికరాలను ఏర్పాటుచేయాలని భావిస్తున్నది. సూపర్ స్పెషాలిటీ కంటి వైద్యశాలలు, అన్ని జిల్లాల్లో స్పెషల్ విజన్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రాథమిక స్థాయి కంటి పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో ఉండే వైద్యకేంద్రాల్లో వారంలో ఒకరోజు పూర్తిగా కంటి వైద్యపరీక్షలు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు. పారామెడికల్ ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ లేదా నర్స్ మిడ్‌వైఫ్‌లకు ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. సబ్ సెంటర్ల పరిధిలో విజన్ గార్డియన్ల పేరిట సిబ్బందిని నియమించి కంటిచూపుపై అవగాహన కల్పించాలని వైద్య శాఖ ప్రతిపాదనలు చేసింది. ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలకు కంటిచూపుపై ప్రాథమికస్థాయి పరీక్షలు నిర్వహించేలా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

2019లోపు రాష్ట్రవ్యాప్తంగా..

కంటిచూపు సమస్య ఎదుర్కొంటున్న వారిసంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో ఆందోళన చెందిన ప్రభుత్వం అంధత్వ రహిత తెలంగాణను రూపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టింది. 2019లోపు రాష్ట్రంలో కంటిచూపు సమస్య ఉన్న ప్రతివ్యక్తి వివరాలను సేకరించి తగిన పరిష్కారం చూపాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రణాళికలు రూపొందించింది. ఇందుకుగాను అన్ని గ్రామాల్లో నేత్ర వైద్యశిబిరాలను నిర్వహించనున్నారు.

సర్కారు నిర్ణయంతో పేదలకు ప్రయోజనం

కంటి సమస్యతో బాధపడుతున్న వారిసంఖ్య ఏటా పెరుగుతున్నది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రవ్యాప్తంగా నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించడం హర్షణీయం. సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంతో పేదలకు ఎంతో ప్రయోజనం కలుగనుంది. రాష్ట్రవ్యాప్తంగా కంటి వైద్యానికి సంబంధించి వైద్యశిబిరాల నిర్వహణ, శస్త్ర చికిత్సల నిర్వహణకు సంబంధించి ప్రణాళికలు రూపొందించడంలో అంధత్వ నియంత్రణ సంస్థ సహకారంతో సరోజినీ నేత్ర దవాఖానా నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఉన్నతాశయంతో ప్రభుత్వం చేపట్టిన ఈ మంచి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్యశాఖ ప్రణాళికలు రూపొందిస్తున్నది. త్వరలోనే కార్యాచరణ మొదలుపెడుతాం.

-రవీందర్‌గౌడ్, సరోజినీ నేత్రదవాఖాన సూపరింటెండెంట్



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆరెకటికల శంఖారావంలో అభివాదం చేస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు వీ కృష్ణమోహన్ తదితరులు

ఆరెకటికలకు అండగా ఉంటాం

- ఫెడరేషన్ ఏర్పాటుకు ప్రయత్నిస్తాం
- మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న హామీ

ఆర్కేపురం, నమస్తే తెలంగాణ: ఆరెకటికల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న హామీ ఇచ్చారు. గురువారం రాత్రి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆరెకటిక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆరెకటికల శంఖారావం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి ఈటల రాజేందర్ ప్రసంగిస్తూ, తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నది కాబట్టే.. ప్రజలు సభలు పెట్టుకొని తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకొంటున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యమిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్నదని చెప్పారు. బీసీల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.5,070 కోట్లు ఖర్చు పెట్టిందని అన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి 1,000కోట్ల రూపాయల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందని చెప్పారు. సీమాంధ్ర నాయకులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కరంట్ ఉండదని అవహేళన చేశారని, కానీ సీఎం కేసీఆర్ కృషితో 24గంటల విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఆరెకటికల ఫెడరేషన్ ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి కృషిచేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న హామీ ఇచ్చారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ చెప్పిన మాటలు నేడు ముఖ్యమంత్రిగా అమలుచేస్తున్నారని చెప్పారు. ఆరెకటిక పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోగికార్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ, ఆరెకటిక పోరాట సమితి సభ్యులు మురారికార్ శ్రీనివాస్, మల్కెడికార్ గురుచరణ్, మిర్యాల్‌కార్ వినయ్, నందీశ్వర్, సూర్యపాల్, కార్పొరేటర్ రాధ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మార్పునకు భాష మూలం

- పర్యాటకశాఖ కార్యదర్శి వెంకటేశం
- సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ప్రారంభం
- పద్య, కథా సాహిత్యంపై తొలిరోజు చర్చ



రవీంద్రభారతిలో జరిగిన సాహితీ శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి. చిత్రంలో సాంస్కృతిక, పర్యాటకశాఖ కార్యదర్శి బీ వెంకటేశం తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భాష ద్వారానే ఒక సమాజం నిర్మాణాత్మకమైన మార్పును సాధిస్తుందని, ఆ మార్పును గడిచిన మూడేండ్లలో చూశామని తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో రెండురోజుల సాహితీ శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం ఔత్సాహిక రచయితలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భాషను పదునుగా, నేర్పరితనంతో ప్రయోగిస్తేనే సృజన రసవంతంగా ఉంటుందని, వాక్యం స్ఫూర్తిమంతమైనప్పుడే రచన రాణిస్తుందని తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి కళాశాల స్థాయి వరకు సృజనాత్మక రచనలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరమున్నదని తెలిపారు. ఈ మేరకు సాహితీ సదస్సులు నిర్వహించాలని అకాడమీని కోరారు. సాహిత్యాభిలాష వున్న కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం తెలంగాణ అదృష్టమని, నందిని సిధారెడ్డి సారథ్యంలో తెలంగాణ సాహిత్యరంగంలో వికసిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ రచన హృదయాన్ని చేరి కదలిస్తేనే అది బలమైన వ్యక్తీకరణ అన్నారు. నన్నయ, పోతన, శ్రీశ్రీ, సినారె సాహిత్యం కోసం తమ జీవితాన్నే ఇచ్చారని, అందుకే వాళ్లు తెలుగు సమాజంలో ఎప్పటికీ జీవించి ఉన్నారని గుర్తుచేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సాహితీసదస్సులో మొత్తం 65 మంది ఔత్సాహిక కవులు, రచయితలు పాల్గొన్నారని, వీరిలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ముగ్గురు ఉన్నారని సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు.



గురువారం సోమాజిగూడలోని విద్యుత్ ఇంజినీర్స్ భవన్‌లో విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై నిర్ణయాలను ప్రకటిస్తున్న టీఎస్ పవర్ జేఏసీ నాయకులు

15న విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

- హైకోర్టు తీర్పుపై అప్పీల్, రివ్యూ పిటిషన్లు
- టీఎస్ పవర్ ఉద్యోగుల జేఏసీ నిర్ణయం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 15న విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం సోమాజిగూడలోని విద్యుత్ ఇంజినీర్స్ భవన్‌లో టీఎస్ పవర్ ఇంజినీర్స్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన 10 తెలంగాణ ఉద్యోగ సంఘాల సమావేశంలో విభజన అంశంపై జేఏసీ నాయకులు పలు తీర్మానాలు చేశారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగులందరూ సమైక్యంగా తెలంగాణకు మద్దతుగా, ఆంధ్ర ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పుపై తెలంగాణ మేనేజ్‌మెంట్ సుప్రీంకోర్టులో అప్పీలు, హైకోర్టులో రివ్యూపిటిషన్ వేయాలని నిర్ణయించారు. ఉద్యోగుల విభజన అంశంపై ప్రస్తుత పరిణామాలను, తెలంగాణ ఉద్యోగులకు జరిగే అన్యాయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు యాజమాన్యం వివరించాలని సూచించారు. సమావేశంలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ రత్నాకర్‌రావు, ప్రధానకార్యదర్శి పీ సదానందం, నాయకులు కే కిరణ్‌కుమార్, బీ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకూ జీవించే హక్కు

- ఖైదీల హక్కుల సదస్సులో జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఖైదీలకు జీవించే హక్కు ఉన్నదని జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ పేర్కొన్నారు. సగటు మనిషికి ఎన్ని హక్కులు వర్తిస్తాయో.. జైలు గోడల మధ్య ఉన్న ఖైదీలకు కూడా అన్ని హక్కులు ఉంటాయని తెలిపారు. 'మానవ హక్కులు - ఖైదీలు' అనే అంశంపై హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైల్లో జరిగిన మూడురోజుల సదస్సు గురువారంతో ముగిసింది. ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్డీ) ఆధ్వర్యంలో తెలంగాణ జైళ్లశాఖ చేపట్టిన ఈ సదస్సులో జైళ్లలో చేపట్టిన సంస్కరణలు, ఫలితాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది రాష్ట్రాలకు చెందిన జైళ్లశాఖ, ఇతర ప్రభుత్వ సంస్థల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ మాట్లాడుతూ నేరాలు చేసి, జైలుకు వచ్చినంతమాత్రాన ఖైదీలకు హక్కులు ఉండవని భావించకూడదని చెప్పారు. వారికి జీవించేహక్కుతోపాటు మంచి భోజనం, వసతి, విద్య, ఆరోగ్యం, చికిత్స, కుటుంబసభ్యులతో మాట్లాడటం వంటి హక్కులు ఉంటాయని తెలిపారు. త్వరలోనే ఖైదీలకు సన్నబియ్యం భోజనం పెట్టనున్నట్టు చెప్పారు.

ప్రధాని మాటలు విడ్డూరం

- తెలంగాణపై ఇంత అసహనమా?
- 1969 ఉద్యమ జేఏసీ నేత గోపాల్‌రావు



కాచిగూడ: ప్రత్యేక రాష్ట్రం కోసం మహోన్నత నేత కేసీఆర్ స్ఫూర్తితో అహింసామార్గంలో 14 ఏండ్లు అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నామని 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమ జేఏసీ కన్వీనర్ ఎస్ గోపాల్‌రావు చెప్పారు. ప్రధానమంత్రి స్థానంలో ఉన్న నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ విడిపోవడం బాధాకరమని పార్లమెంట్‌లో ప్రసంగించడం విడ్డూరంగా ఉందని ఆయన గురువారం మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం 1949 నుంచి మొదలుకుని 1969 వరకు పోరాటం కొనసాగిందని గుర్తుచేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలుస్తున్నదన్న అక్కసుతోనే ప్రధాని మాట్లాడుతున్నారని గోపాల్‌రావు విమర్శించారు. సమావేశంలో సుర్‌దాస్‌రెడ్డి, బాలచారి, ఠాకూర్ హృదయనాథ్‌సింగ్, డాక్టర్ అంజిరెడ్డి, బొక్క వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నోటీసులిస్తే వస్తా: రాంగోపాల్ వర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముంబైలో సినిమా షూటింగ్‌లో ఉన్నందున విచారణకు హాజరు కాలేకపోతున్నానని జీఎస్టీ (గాడ్.. సెక్స్.. ట్రూత్) సినిమా దర్శకుడు రాంగోపాల్‌వర్మ గురువారం తన న్యాయవాది ద్వారా హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు సమాచారం పంపారు. పోర్న్‌స్టార్ మియా మాల్కోవాతో ఇటీవల ఆయన తెరకెక్కించిన జీఎస్టీ సినిమా తీవ్ర వివాదాస్పదమైంది. సినిమా విడుదల చేయొద్దని వ్యతిరేకించిన తమపై రాంగోపాల్‌వర్మ అనుచిత వ్యాఖ్యలు చేశారని కొందరు మహిళా సంఘాల నేతలు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు గురువారం విచారణకు హాజరు కావాలని వర్మకు పోలీసులు నోటీసులు పంపారు. తాను ముంబైలో సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నందున వచ్చేవారం మళ్లీ నోటీసులు ఇస్తే, విచారణకు హాజరవుతానని న్యాయవాది ద్వారా సమాచారం పంపారు.

పురుషోత్తంరెడ్డిపై ఏసీబీ ఆరా

- కుటుంబసభ్యులను ప్రశ్నించిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో పరారీలో ఉన్న హెచ్‌ఎండీఏ అధికారి పురుషోత్తంరెడ్డి ఆచూకీ కోసం ఏసీబీ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం పురుషోత్తంరెడ్డి అల్లుడు నిపుణ్‌రెడ్డి, రాధాచరణ్‌రెడ్డిలను మరోసారి విచారించారు. నిపుణ్‌రెడ్డి సోదరుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి యాదవరెడ్డిని కూడా విచారించి పురుషోత్తంరెడ్డికి సంబంధించిన వివరాలు రాబట్టినట్టు తెలుస్తున్నది. ఏసీబీ అధికారులు ఓవైపు పురుషోత్తంరెడ్డి కోసం గాలిస్తూనే.. మరోవైపు అతడికి బినామీగా ఉన్న కుటుంబసభ్యులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల చిట్టాను సేకరిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 20 మందిని ప్రశ్నించారని తెలిసింది. వారిచ్చిన సమాచారంతో మరికొన్ని ప్రాంతాల్లో నిందితుడికి ఉన్న ఆస్తులను గుర్తించారు.

యూత్ ఫెస్టివల్ పోటీలు ప్రారంభం

17న 1,500 మందితో గచ్చిబౌలి స్టేడియంలో ప్రదర్శన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సికింద్రాబాద్‌లోని యూత్ సర్వీసెస్ కమిషనరేట్ ప్రాంగణంలో 15 విభాగాల్లో రాష్ట్ర యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో యువతీయువకులకు నృత్య పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 10 వరకు పోటీలను నిర్వహిస్తామని యూత్ సర్వీసెస్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీం తెలిపారు. ఈ నెల 16,17 తేదీల్లో యాక్ట్ ప్లే, జానపద పాటలు, జానపద నృత్యాలు (బృందం) విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 17న సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే స్టేట్ యూత్ ఫెస్టివల్‌కు 1,500 మంది యువతీయువకులు పాల్గొనే అవకాశం ఉన్నదని చెప్పారు.

ఉద్యోగులతో వైద్యారోగ్యశాఖకు మంచిపేరు

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషిచేద్దాం
డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి లక్ష్మారెడ్డి



గురువారం వైద్యారోగ్యశాఖ గెజిటెడ్ అధికారుల డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి

హైదరాబాద్/సుల్తాన్‌బజార్, నమస్తే తెలంగాణ: ఉద్యోగులు సమర్థంగా పనిచేయడం వల్లే వైద్యారోగ్యశాఖకు మంచిపేరు వచ్చిందని ఆ శాఖ మంత్రి డాక్టర్ సీ లక్ష్మారెడ్డి చెప్పారు. వైద్య, ఆరోగ్యరంగంలో నూతన విధానాలను అమలుచేస్తూ దేశం దృష్టిని ఆకర్షించగలిగామని, ప్రజారోగ్యం కాపాడేందుకు ప్రభుత్వ లక్ష్యాలు సాధించేందుకు సమిష్టిగా కృషిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను కోఠిలోని డీఎంఈ కార్యాలయం ఆడిటోరియంలో గురువారం మంత్రి ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్కార్ దవాఖానలంటే ప్రజల్లో ఒక రకమైన భయం ఉండేదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అధునాతన సౌకర్యాలతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారని మంత్రి చెప్పారు. దీంతో ప్రభుత్వ వైద్యశాలలకు పెద్దసంఖ్యలో రోగులు వైద్యంకోసం వస్తున్నారని అన్నారు. టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ పర్యాదకృష్ణమూర్తి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో మంత్రి లక్ష్మారెడ్డి కృషి, ఉద్యోగుల నిరంతర శ్రమ వల్లే వైద్య, ఆరోగ్యశాఖ సేవలు రాష్ట్రంలో విస్తరించాయన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు అన్ని విషయాలపై అవగాహన, పట్టు ఉన్నదని, అందువల్లే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్, టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత, జూపల్లి రాజేందర్, ఎంబీ కృష్ణాయాదవ్, పలువురు ఉద్యోగసంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ 22న ధర్నా
సీఎస్‌కు నోటీసు ఇచ్చిన పీఆర్టీయూటీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దుపై శాసనసభలో తీర్మానం చేయాలని, సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు ఉత్తర్వులు విడుదలచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర నాయకుడు పీ సరోత్తంరెడ్డి కోరారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాడుతామని చెప్పారు. ఈ నెల 22న ధర్నా చేపడుతామని గురువారం సీఎస్ ఎస్కే జోషిని కలిసి నోటీసులు అందజేశారు. సీఎస్‌ను కలిసినవారిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూళ్ల సమస్యలను పరిష్కరించండి
విద్యాశాఖ డైరెక్టర్‌కు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ సొసైటీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్‌ను గురువారం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. మోడల్ స్కూళ్లు ఏర్పాటుచేసి ఐదేండ్లు పూర్తయినా మోడల్ స్కూల్ టీచర్లకు సర్వీస్ రూల్స్‌ను అమలు చేయడం లేదని తెలిపారు. వేసవిలో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలని, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ల మాదిరిగా పే స్కేళ్లు అందించాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసినవారిలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చావ రవి, మోడల్ స్కూల్ టీచర్ ఫెడరేషన్ అధ్యక్షుడు బీ కొండయ్య ఉన్నారు.

సెలవుల మంజూరు అధికారం డీఈవోలకు వద్దు: ఎస్టీయూటీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మోడల్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సెలవులను మంజూరు చేసే అధికారాన్ని ప్రిన్సిపాళ్ల నుంచి డీఈవోలకు ఇవ్వడాన్ని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర నాయకులు భుజంగరావు, సదానందంగౌడ్ తప్పుబట్టారు. సెలవులను మంజూరుచేసే అధికారాన్ని ప్రిన్సిపాళ్లకే ఇవ్వాలని ఆ సంఘం నాయకులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్‌ను కోరారు.

అప్పులతో మీకేం పని.. ఆస్తులకు ఎంతిస్తారో చెప్పండి?
అక్షయగోల్డ్ ఆస్తుల కొనుగోలుదారుకు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజల వద్ద నుంచి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన అక్షయగోల్డ్ సంస్థకు చెందిన ఆస్తులకు ఎంతమొత్తం చెల్లిస్తారో తెలియజేయాలని సంస్థను స్వాధీనం చేసుకోవడానికి ముందుకు వచ్చిన సంస్థకు ఉమ్మడి హైకోర్టు స్పష్టంచేసింది. కంపెనీ ఆస్తులు, అప్పులు పేరిట సమస్యను క్లిష్టతరంగా చేయకుండా ఆస్తులకు ఎంత చెల్లిస్తారో చెప్తే.. డిపాజిట్‌దారులకు డబ్బులు చెల్లించేపనిని తామే చూసుకుంటామని తేల్చిచెప్పింది. దివాళాతీసిన అక్షయగోల్డ్ సంస్థను స్వాధీనం చేసుకునేందుకు ఒక ప్రముఖ సంస్థ సిద్ధంగా ఉందని, అందుకు అనుమతించాలంటూ పీఏ క్రిస్టోఫర్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై గురువారం జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. స్వాధీనం చేసుకోవడానికి ముందుకు వచ్చిన సంస్థ పేరును, ఉనికిని వెల్లడించకుండా తమను ఆశ్రయిస్తే.. వారి సదుద్దేశం ఎలా తెలుస్తుందని న్యాయస్థానం ప్రశ్నించింది. అక్షయగోల్డ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ, అంచనా మార్కెట్ విలువను తమకు తెలియజేయాలని ఏపీ సీఐడీ అధికారులను ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 5వ తేదీకి వాయిదావేసింది.

అపర్ణ కన్‌స్ట్రక్షన్స్‌పై ఆక్రమణ కేసు
నల్లగండ్ల చెరువులో నిర్మాణాలు ఆపాలని జీహెచ్‌ఎంసీకి ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల గ్రామపరిధిలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలు, రహదారి, ఇతర నిర్మాణాలు జరుగుకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీకి ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అనే నిర్మాణ సంస్థ తన వెంచర్ అభివృద్ధి పేరిట చెరువుకు చెందిన భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టడమే కాకుండా, నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకోవాలని న్యాయస్థానం స్పష్టంచేసింది. పెద్దచెరువు భూమి ఆక్రమిస్తున్నారంటూ దాఖలైన వ్యాజ్యంపై జీహెచ్‌ఎంసీతోపాటు అపర్ణ కన్‌స్ట్రక్షన్స్, రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ పరిధి, నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతం తదితరాలపై పూర్తిస్థాయి వివరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సుమారు 10 ఎకరాల స్థలాన్ని ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించారంటూ జనంకోసం అనే స్వచ్ఛందసంస్థ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. భూమిని ఆక్రమించి ప్రహరీని, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారని పిటిషనర్ సంస్థ నివేదించారు. దీంతో పూర్తిస్థాయి వివరాలను సమర్పించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది.

సెన్సెక్స్	నిఫ్టీ
34,413	10,577
↗ 330	↗ 100

ముడి చమురు (బ్రెంట్) ↘ 64.50 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)	
24 క్యారెట్లు	30,950
22 క్యారెట్లు	30,800
వెండి (కిలో)	38,900

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.54	67.88
బహ్రెయిన్ దినార్	158.55	181.69
కువైట్ దినార్	177.39	220.83
సౌదీ రియాల్	15.56	18.45
యూఏఈ దిర్హామ్	15.93	18.63

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	66.00
రిటైల్ లైవ్	88.00
డ్రెస్డ్	128.00
స్కిన్‌లెస్	145.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	345-00
రంగారెడ్డి	345-00
మెదక్	345-00
కరీంనగర్	347-00
వరంగల్	347-00
రిటైల్ ప్రైస్	4-05

క్రిప్టో సంపన్నుల్లో లార్సన్ టాప్

న్యూయార్క్, ఫిబ్రవరి 8:



క్రిస్ లార్సన్ (రూ.50 వేల కోట్లు)

క్రిప్టోకరెన్సీలో అత్యంత సంపన్నులైన వ్యక్తుల జాబితాను ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ఫోర్బ్స్' తొలిసారి విడుదల చేసింది. రిపుల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు క్రిస్ లార్సన్ దాదాపు 800 కోట్ల డాలర్ల విలువైన నికర సంపదతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆధారిత సీక్రెట్ ఆల్గారిథమ్స్‌ను ఉపయోగించి రూపొందించే క్రిప్టోకరెన్సీల విలువ ఇటీవలి కాలంలో గణనీయంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. ప్రపంచంలో అత్యంత సాధారణ క్రిప్టోకరెన్సీలుగా పేరు తెచ్చుకున్న బిట్‌కాయిన్, ఎథేరియం, ఎక్స్‌ఆర్‌పీ లాంటి కరెన్సీల సగటు విలువ 2017లో గణనీయంగా 14,409 శాతం పెరిగిందని, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1,500 రకాల క్రిప్టోకరెన్సీలు చెలామణిలో ఉన్నాయని, 2017 ఆరంభం నుంచి వీటి మొత్తం విలువ 31 రెట్లు పెరిగి 55 వేల కోట్ల డాలర్ల (రూ.35,75,000 కోట్ల)కు చేరుకున్నదని 'ఫోర్బ్స్' పత్రిక వెల్లడించింది. క్రిప్టోకరెన్సీ పరంగా అత్యంత సంపన్నులైన వ్యక్తుల జాబితాలో జోసెఫ్ లుబిన్ (నికర సంపద 100 కోట్ల డాలర్ల నుంచి 500 కోట్ల డాలర్లు), చాంగ్‌పెంగ్ జావో (110 కోట్ల నుంచి 200 కోట్ల డాలర్లు), కామెరాన్ అండ్ టేలర్ వింక్‌లెవోస్ (90 కోట్ల నుంచి 110 కోట్ల డాలర్లు), మాథ్యూ మెల్లెన్ (90 కోట్ల నుంచి 110 కోట్ల డాలర్లు)తో పాటు బ్రియాన్ ఆర్మ్‌స్ట్రాంగ్, మాథ్యూ రాస్జెక్, ఆంథోనీ డీ ఇయోరియో, బ్రాక్ పియర్స్, మైఖేల్ నొవోగ్రట్జ్, బ్రెండన్ బల్మర్, డాన్ లారీమర్, వాలెరీ వవిలోవ్, చార్లెస్ హాస్కిన్సన్, బ్రాడ్ గార్లింగ్‌హౌస్, బ్యారీ సిల్బెర్ట్, విటాలిక్ బుటెరిన్, టిమ్ డార్పర్, సంగ్ చి-హ్యూంగ్ తదితరులు ఉన్నారని ఆ పత్రిక ప్రకటించింది. కనీసం 35 కోట్ల డాలర్ల సంపదను కలిగివున్న సంపన్నులతో ఈ జాబితాను రూపొందించామని, ఈ జాబితాలో చోటు దక్కించుకున్న వ్యక్తుల సగటు వయసు 42 ఏళ్లుగా ఉన్నదని 'ఫోర్బ్స్' వివరించింది.

నీటి బుడగ లాంటిదే..

■ త్వరలో క్రిప్టోకరెన్సీల విలువ జీరో: గోల్డ్‌మన్ సాచ్స్

బిట్‌కాయిన్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రిప్టోకరెన్సీలన్నీ 'నీటి బుడగ' లాంటివేనని, త్వరలోనే వీటి విలువ సున్నాకు పడిపోడం ఖాయమని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ 'గోల్డ్‌మన్ సాచ్స్' స్పష్టం చేసింది. క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను 1990వ దశకం చివర్లో తెరమీదికి వచ్చిన ఇంటర్నెట్ సంక్షోభంతో పోల్చింది. ప్రస్తుతమున్న క్రిప్టోకరెన్సీలు దీర్ఘకాలం పాటు మనుగడ సాగించలేవని, వీటికి ప్రత్యామ్నాయాలు వచ్చిన వెంటనే క్రిప్టోకరెన్సీలన్నీ కనుమరుగైపోతాయని 'గోల్డ్‌మన్ సాచ్స్' పరిశోధన విభాగం అధిపతి స్టీవ్ స్ట్రాంగిన్ పేర్కొన్నారు. క్రిప్టోకరెన్సీలు విలువ కోల్పోవడం వలన దాదాపు 50 వేల కోట్ల డాలర్ల (రూ.32.50 లక్షల కోట్ల) సంపద ఆవిరైపోతుందని ఆయన తెలిపారు. క్రిప్టోకరెన్సీలు ఎప్పటిలోగా కనుమరుగవుతాయో స్పష్టంగా చెప్పలేమని, ఎటువంటి కారణాలు లేకుండా విలువ పెరిగిన ఆ కరెన్సీలు గత కొంత కాలం నుంచి క్రమంగా పతనమవుతున్నాయని, అన్ని రకాల క్రిప్టోకరెన్సీలు ఒకేరకంగా విలువ కోల్పోతుండటం ఆందోళనకరమని ఆయన అన్నారు. లావాదేవీలు నెమ్మదిగా జరగడం, నిర్వహణా వ్యయం చాలా ఎక్కువగా ఉండటం, భద్రతాపరమైన సవాళ్లు గణనీయంగా పెరిగిపోవడం క్రిప్టోకరెన్సీలకు సమస్యగా మారిందన్నారు. ఒకవేళ క్రిప్టోకరెన్సీలు మళ్లీ పుంజుకుని వాటి విలువ పెరిగినప్పటికీ గత వైభవం మాత్రం దక్కబోదని స్ట్రాంగిన్ స్పష్టం చేశారు.

మార్కెట్లోకి సరికొత్త స్విఫ్ట్

■ ప్రారంభ ధర రూ.4.99 లక్షలు



గ్రేటర్ నోయిడా, ఫిబ్రవరి 8: మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్‌లో సరికొత్త వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ ప్రకటించింది. తొలిసారిగా ఆటో గేర్ షిఫ్ట్‌తో రూపొందించిన ఈ కారు ఢిల్లీ షోరూంలో రూ.4.99 లక్షల నుంచి రూ.8.29 లక్షల మధ్యలో లభించనున్నది. ఐదో జనరేషన్‌గా విడుదల చేసిన ఈ కారు కోసం గత నెల నుంచే సంస్థ ముందస్తు బుకింగ్‌లు ఆరంభించింది కూడా. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్, 1.3 లీటర్ల డీజిల్ ఇంజిన్‌తో ఈ కారును రూపొందించినట్లు మారుతి సుజుకీ ఎండీ, సీఈవో కెనిచి అయుకవా తెలిపారు.



భారత్‌లోకి క్లీవ్‌ల్యాండ్ సైకిల్‌వ్రెక్స్

అమెరికాకు చెందిన ప్రముఖ బైకుల తయారీ సంస్థ క్లీవ్‌ల్యాండ్ సైకిల్‌వ్రెక్స్..దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఆటో ఎక్స్‌పోలో రెండు మోడళ్లైన ఏస్, మిస్ఫిట్‌లను ఆవిష్కరించింది. వచ్చే ఏడాది చివరినాటికి భారత్‌లో 5 వేల యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. 229 సీసీ ఫోర్-స్ట్రోక్ ఇంజిన్ కలిగిన ఈ బైకులను పుణెలో ఏర్పాటు చేసిన అసెంబ్లింగ్ ప్లాంట్‌లో తయారు కానున్నాయి.



దేశీయ తొలి ఈ-బైక్

మార్కెట్లోకి విడుదల చేయనున్న ఎమ్‌ఫ్లక్స్ ప్రముఖ స్టార్టప్ సంస్థ ఎమ్‌ఫ్లక్స్..దేశీయంగా తయారైన తొలి ఎలక్ట్రిక్ బైకును వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకురాబోతున్నది. గ్రేటర్ నోయిడా వేదికగా జరుగుతున్న ఆటో ఎక్స్‌పోలో 'ఎమ్‌ఫ్లక్స్ వన్' బైకును ప్రదర్శించింది. 9.7 కిలోవాట్ల లిథియమ్-ఇయాన్ బ్యాటరీతో రూపొందించిన ఈ బైకు గంటకు 200 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నదని కంపెనీ సీఈవో వరుణ్ మిట్టల్ తెలిపారు. ఈ బైకు ధర రూ.6 లక్షల స్థాయిలో ఉండనున్నదని ఆయన చెప్పారు. రూ.11 లక్షల ధర కలిగిన మరో మోడల్‌ను సైతం విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.



ఆటో ఎక్స్‌పోలో సరికొత్త కారుతో బాలీవుడ్ నటీ సోనాక్షి సిన్హా

వాణిజ్యాభివృద్ధికి రాష్ట్రం ఊతం

■ ఎస్‌బీఐ జీఎం ప్రబోధ్ పారిఖ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని, దీంతో రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి వేగంగా జరుగుతున్నదని ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రబోధ్ పారిఖ్ అన్నారు. గురువారం ఇక్కడ రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌజ్‌లో ఎఫ్‌టాప్సీ, కేంద్ర ప్రభుత్వ ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, ఎగ్జిమ్ బ్యాంక్ లిమిటెడ్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'ఎగుమతుల వ్యాపారం-వాణిజ్య ప్రక్రియ డాక్యుమెంటేషన్' సర్టిఫికెట్ కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని ప్రబోధ్ ప్రారంభించారు.


గ్రాన్యూల్స్ లాభం 35 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 8: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.35 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన లాభంతో పోలిస్తే 8.5 శాతం వృద్ధి నమోదైందని కంపెనీ సీఎండీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆదాయం విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.411 కోట్లకు చేరుకున్నది. రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు 25 పైసలు మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించనున్నది.

హమ్మయ్య!

ఎట్టకేలకు కోలుకున్న స్టాక్ మార్కెట్లు

■ ఏడు రోజుల నష్టాలకు తెర ■ సెన్సెక్స్ 330, నిఫ్టీ 100 పాయింట్ల వృద్ధి



ముంబై, ఫిబ్రవరి 8: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాలను అందుకున్నాయి. నష్టాల ఊబిలో కూరుకుపోయి ఉక్కిరిబిక్కిరవుతున్న సూచీలు.. మళ్లీ ఊపిరి పీల్చుకున్నాయి. అమ్మకాల ఒత్తిడిలో ఉన్న మదుపరులు.. తిరిగి పెట్టుబడుల వైపు చూడటంతో గురువారం సెన్సెక్స్ 330 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్లకుపైగా కోలుకున్నాయి. దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను, అమెరికా స్టాక్ మార్కెట్ల పతనం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిరాశాజనక ద్రవ్యసమీక్షల కారణంగా ఏడు రోజులుగా భారతీయ సూచీలు నష్టాల్లోనే కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిందే. ఈ వారం రోజుల్లో సెన్సెక్స్ ఏకంగా 2,200.54 పాయింట్లు చేజార్చుకున్నది. అయితే కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు, ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలు ఈ వరుస నష్టాలకు చెక్ పెట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర ఆరు వారాల కనిష్ఠాన్ని తాకుతూ 65.16 డాలర్లకు పడిపోవడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. ఈ క్రమంలోనే హెల్త్‌కేర్, రియల్టీ, టెలికం, క్యాపిటల్ గూడ్స్, టెక్నాలజీ, ఐటీ, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆటో, బ్యాంకింగ్ షేర్ల కొనుగోళ్లకు మదుపరులు ఆసక్తి కనబరిచారు. దీంతో సెన్సెక్స్ 330.45 పాయింట్లు పుంజుకుని 34,413.16 వద్ద ముగియగా, నిఫ్టీ 100.15 పాయింట్లు పెరిగి 10,576.85 వద్ద నిలిచింది. సెన్సెక్స్ గరిష్ఠ స్థాయి 34,634.35 పాయింట్లు, కనిష్ఠ స్థాయి 34,108.76 పాయింట్లుగా ఉంటే, నిఫ్టీ గరిష్ఠం 10,637.80 పాయింట్లు, కనిష్ఠం 10,479.55 పాయింట్లుగా ఉంది. సిప్లా షేర్ విలువ అత్యధికంగా 7.83 శాతం పెరుగగా, సన్ ఫార్మా 6.32 శాతం, డాక్టర్ రెడ్డీస్ 3.18 శాతం మేరకు లాభపడ్డాయి. ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హెచ్‌యూఎల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, మారుతి సుజుకీ, ఎల్ అండ్‌టీ, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, బజాజ్ ఆటో, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, హీరో మోటోకార్ప్, ఏషియన్ పెయింట్స్, విప్రో షేర్లూ 2.97 శాతం వరకు పెరిగాయి. అయితే పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, ఓఎన్‌జీసీ, అదానీ పోర్ట్స్, ఐటీసీ లిమిటెడ్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి. స్మాల్-క్యాప్ సూచీ 2.25 శాతం, మిడ్-క్యాప్ సూచీ 1.82 శాతం పెరిగాయి. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను దేశ జీడీపీ 7.2 శాతంగా ఉంటుందని, జీఎస్టీ స్థిరీకరణ జరుగుతుందని, రుణ వితరణ మెరుగు పడుతుందని తాజా ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ అంచనా.. మార్కెట్‌లో పెట్టుబడులకు ఊతమిచ్చిందంటూ ట్రేడింగ్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన రూపాయి విలువ



డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గురువారం ఫారెక్స్ మార్కెట్‌లో స్వల్పంగా పెరిగింది. దీంతో వరుస ఐదు రోజుల నష్టాలకు బ్రేక్ పడినట్లైంది. స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిసిన నేపథ్యంలో రూపాయి విలువ 2 పైసలు కోలుకుని 64.26 వద్ద స్థిరపడింది. బుధవారం ముగింపు స్థాయి 64.28గా ఉన్నది. అంతకుముందు ఐదు రోజుల్లో రూపాయి విలువ 70 పైసలు పడిపోయిన సంగతి విదితమే.

రూ.600 తగ్గిన బంగారం ధర

బంగారం ధర తగ్గింది. గురువారం బులియన్ మార్కెట్‌లో 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి ధర రూ.600 పడిపోయి దాదాపు మూడు వారాల కనిష్ఠాన్ని తాకుతూ రూ.30,950 వద్ద స్థిరపడింది. 99.5 స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర సైతం రూ.600 పతనమై రూ.30,800లుగా నమోదైంది. బుధవారం ముగింపుతో పోల్చితే కిలో వెండి ధర కూడా రూ.450 క్షీణించి రూ.38,900 వద్ద నిలిచింది. స్థానికంగా నగల వర్తకులు, పరిశ్రమల నుంచి డిమాండ్ అంతగా లేకపోవడంతోనే ధరలు తగ్గుముఖం పట్టాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక అంతర్జాతీయంగా సింగపూర్ మార్కెట్‌లోనూ ఔన్సు బంగారం ధర 0.61 శాతం దిగజారి 1,310.10 డాలర్లు పలుకగా, వెండి ధర 0.37 శాతం కోల్పోయి 16.28 డాలర్లుగా ఉన్నది.

గూగుల్‌కు 136 కోట్ల ఫైన్

■ సెర్చ్ ఇంజన్ దిగ్గజానికి సీసీఐ షాక్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: అంతర్జాతీయ టెక్నాలజీ, ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గురువారం భారీ జరిమానా విధించింది. భారతీయ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను రూ.135.86 కోట్ల జరిమానాను వేసింది. 2013, 2014, 2015 ఆర్థిక సంవత్సరాల్లో దేశీయంగా వివిధ వ్యాపార విభాగాల కార్యకలాపాల నుంచి గూగుల్ అందుకున్న మొత్తం సగటు ఆదాయంలో ఇది 5 శాతంతో సమానం. దేశీయ చట్టాలను అతిక్రమించి మార్కెట్‌లో ఆధిపత్యం కోసం గూగుల్ అక్రమ వ్యాపార పద్ధతులను అవలంభించిందని, అందుకే భారీ జరిమానాను వేశామని ఇందుకు సంబంధించిన ఆదేశంలో సీసీఐ పేర్కొన్నది. కాగా, 2012లో గూగుల్ ఎల్‌ఎల్‌సీ, గూగుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గూగుల్ ఐర్లాండ్ లిమిటెడ్‌లకు వ్యతిరేకంగా మ్యాట్రిమొనిడాట్‌కామ్, కన్జ్యూమర్ యూనిటీ, ట్రస్ట్ సొసైటీ (కట్స్)లు ఇచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేసిన సీసీఐ.. ఈ జరిమానాను ప్రకటించింది. వివిధ దేశాల్లో గూగుల్‌పై ఈ తరహా విచారణలు జరుగుతున్నా.. భారీ జరిమానాతో అంతర్జాతీయంగా మాత్రం ఇది అరుదైన కేసుల్లో ఒకటిగా నిలిచింది. ఇదిలావుంటే గూగుల్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ సీసీఐ గుర్తించిన కొద్దిపాటి ఆందోళనలపై సమీక్షిస్తున్నామన్నారు. అయినప్పటికీ తాము ఎల్లప్పుడూ వినియోగదారులకు మెరుగైన, వేగవంతమైన సేవలను అందించడంపైనే దృష్టి పెడుతామన్నారు.

ఆంధ్రాబ్యాంక్ నష్టం 532 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 8: ప్రభుత్వరంగ సంస్థ ఆంధ్రాబ్యాంక్ లాభాలకు మొండి బకాయిల సెగ గట్టిగానే తగిలింది. డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్‌కు రూ.532.02 కోట్ల నష్టం సంభవించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు కేటాయించడం వల్లనే లాభాల్లో గండిపడిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ రూ.56.70 కోట్ల లాభాన్ని గడించింది. రెండో త్రైమాసికంలో నమోదైన రూ.385.11 కోట్ల నష్టంతో పోలిస్తే ఆ మరుసటి త్రైమాసికంలో భారీగా పెరిగాయి. సమీక్ష కాలంలో రూ.5,093.43 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 14.26 శాతానికి చేరుకోగా, నికర ఎన్‌పీఏ 7.72 శాతంగా నమోదైంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.1,744.99 కోట్ల నిధులు వెచ్చించడంతో లాభాలపై ప్రతికూల ప్రభావం చూపాయని వెల్లడించింది. బ్యాంక్ దివాలా చట్టానికి లోబడి ఎనిమిది ఖాతాలకు ఇచ్చిన రూ.659.06 కోట్ల రుణాలను వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు 1.83 శాతం తగ్గి రూ.47.20 వద్ద స్థిరపడింది.

మేధోసంపత్తిలో వెనుకబడిన భారత్

■ 50 దేశాల జాబితాలో 44వ స్థానం
■ తొలి, రెండు స్థానాల్లో అమెరికా, బ్రిటన్

వాషింగ్టన్: అంతర్జాతీయ మేధోసంపత్తిలో భారత్ వెనుకబడి ఉంది. అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ తాజాగా 50 దేశాల జాబితా విడుదల చేయగా... భారత్ అట్టడుగున 44వ స్థానంలో ఉంది. గతేడాది 45 దేశాల జాబితా రూపొందించగా భారత్ 43వ స్థానంలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే స్కోరు కొద్దిగా మెరుగైంది. 2017 లో భారత్ స్కోర్ 8.75 పాయింట్లు కాగా ఇప్పుడది 12.03 కు చేరింది. అంతర్జాతీయ మేధోసంపత్తి దేశాల జాబితాలో 37.98 పాయింట్లతో అమెరికా అగ్రస్థానంలో నిలవగా 37.97 పాయింట్లతో రెండో స్థానంలో బ్రిటన్, 37.03 పాయింట్లతో మూడోస్థానంలో స్వీడన్ ఉన్నాయి. ప్రస్తుత 6వ ఎడిషన్‌లో భారత్ 30శాతం వృద్ధి సాధించిందని అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ తన వార్షిక నివేదికలో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల ఆర్థిక వ్యవస్థలోని సృజనాత్మక అభివృద్ధి, ట్రేడ్ మార్క్, కాపీరైట్, వాణిజ్యరంగ భద్రత తదితర 40 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈజాబితాను రూపొందించారు. భవిష్యత్‌లో భారత్ మెరుగైన స్కోర్ సాధించగలదన్న ఆశాభావాన్ని యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యక్తం చేసింది. దేశీయ ఆవిష్కరణలు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ మరింత కష్టపడాల్సిన అవసరముందని యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ తెలిపింది.

ఉగ్రవాది పారిపోయేందుకు సహకరించిన నలుగురి అరెస్ట్

శ్రీనగర్: లష్కరే తాయిబా ఉగ్రవాది మహమ్మద్ నవీద్ ఝూట్ (22) అలియాస్ అబు హన్జల్లా మంగళవారం శ్రీనగర్‌లోని ఎస్‌ఎంహెచ్‌ఎస్ దవాఖాన నుంచి పారిపోయేందుకు సహకరించిన షకీల్ భట్, టికా ఖాన్, రహీల్ కచ్రూ, మహమ్మద్ షఫీ అనే నలుగురిని కశ్మీర్ పోలీసులు గురువారం అరెస్ట్‌చేశారు. ఝూట్‌కు సహకరించిన హిలాల్ అనే వ్యక్తి అతనితోనే పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిఘావర్గాల సమాచారంతో పుల్వామాలో పోలీసులు దాడిచేసి ఈ నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

తాజ్ పరిరక్షణకు తీసుకున్న చర్యలేమిటి? : సుప్రీం

న్యూఢిల్లీ: తాజ్‌మహల్ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై విజన్ డాక్యుమెంట్‌ను తమముందు ఉంచాలని సుప్రీం కోర్టు గురువారం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తాజ్ ట్రేపీజియం జోన్ (టీపీజెడ్)లో ఆకస్మికంగా కార్యకలాపాలు ఎందుకు ప్రారంభించారని, తోలు పరిశ్రమలు, హోటళ్లను ఎందుకు నెలకొల్పుతున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. నాలుగు వారాల్లోగా విజన్ డాక్యుమెంట్‌ను సమర్పించాలని కోర్టు యూపీ సర్కార్‌ను ఆదేశించింది.

Dwaraka



రూ.7.35 కోట్లకు చేరిన మేడారం హుండీ ఆదాయం

మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర హుండీ ఆదాయం మూడో రోజు వరకు రూ.7,35,86,341 వచ్చింది. ఈ హుండీలను వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని టీటీడీ కల్యాణమండపంలో లెక్కిస్తున్నారు. మొత్తం 452 హుండీలకు గానూ మూడో రోజు వరకు 342 హుండీలను లెక్కించినట్టు డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు తెలిపారు.

- రెడ్డికాలనీ(వరంగల్)

ప్రజలే కాంగ్రెస్ బట్టలూడదీస్తరు

- తాగి తన్నుకుని చస్తే బురద జల్లుతున్నరు
- హత్యారాజకీయాలు ఆ పార్టీ సంస్కృతే
- కాంగ్రెస్ నేతలపై మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్

నిడమనూరు: 'తాగి తన్నుకుని చస్తే అధికార పార్టీ నేతలపై బురద చల్లుతున్నరు.. హత్యారాజకీయాలు కాంగ్రెస్‌కు అలవాటే... ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నరు.. కాంగ్రెస్ బట్టలూడదీసి మోరీలో వేసే రోజులు దగ్గరపడ్డయి..' అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం నల్లగొండ జిల్లా నిడమనూరు, త్రిపురారం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం మంత్రి మాట్లాడారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ సంతాప సభలో టీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకుల సంస్కృతి, ఉత్తమ్, జానా, జైపాల్‌రెడ్డి నాయకత్వానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను ప్రజలు మోరీలో వేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, టీఆర్‌ఎస్‌లోకి వలసలను జీర్ణించుకోలేకనే ఆ పార్టీ నేతలు హత్యానేరాలను అంటగట్టే స్థాయికి దిగజారారన్నారు. అధికారం కోసం తప్ప ప్రజా సమస్యలు ఏనాడూ పట్టని కాంగ్రెస్‌కు రాష్ట్రంలో నూకలు చెల్లిపోయాయన్నారు. '2019 ఎన్నికల్లో ప్రజలే మీ బట్టలు విప్పి.. మీరు చెప్పిన మోరీల్లో వేయడానికి సిద్ధంగా ఉన్నారు' అని అన్నారు. రాష్ట్రంలోని 119 స్థానాల్లో టీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వ్యవసాయ పెట్టుబడి మద్దతుపైనా కాంగ్రెస్ విమర్శలు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం 100 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. సభలో నియోజకవర్గ ఇంచార్జి నోముల నర్సింహయ్య, రాష్ట్ర కార్యదర్శి బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా నాయకులు ఎంసీ కోటిరెడ్డి, కేవీ రామారావు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా ఎర్రబెల్లిలో ప్రసంగిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి నాయిని నర్సింహారెడ్డి

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని హోం, కార్మిక ఉపాధి కల్పన శాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల నమోదు, పథకాలపై సదస్సు నిర్వహించారు. మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి హాజరైన ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదన్నారు. సంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. వచ్చే మేడే నాటికి మరిన్ని సంక్షేమ పథకాలను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంత్రి ఈటల మాట్లాడుతూ పేదలు వైద్యం చేయించుకోవడానికి అప్పులు చేయకుండా త్వరలోనే ప్రభుత్వం మంచి పథకాన్ని తెస్తున్నదన్నారు.



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలాపూర్‌లో సీఎం కేసీఆర్ నాటిన మొక్క ఏపుగా పెరిగిన తీరును పరిశీలిస్తున్న మంత్రి జోగు రామన్న

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం

- అటవీ శాఖ మంత్రి జోగు రామన్న

జన్నారం: ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలాపూర్ అటవీ శాఖ నర్సరీని గురువారం ఆయన సందర్శించారు. ప్రస్తుతం రాజకీయ నిరుద్యోగులుగా మారిన వారు, ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. అప్పటి సీఎం వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఆంధ్రాప్రాంతం వారికే ఉద్యోగాలు ఇచ్చారని, ఆ సమయంలో మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేకపోయారని ప్రశ్నించారు.



నిజాంసాగర్ మండలంలోని చెరువుముందు తండా వద్ద రూ.78 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రూ.17.92 కోట్లతో అభివృద్ధి పనులు

నిజాంసాగర్, నమస్తే తెలంగాణ: కామారెడ్డి జిల్లాలో గురువారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పెద్ద ఎత్తున అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జుక్కల్, నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాల్లో రూ. 10.32కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, బిచ్కుంద మండలం పెద్ద తక్కడపల్లిలో రూ.7.60 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. అంతకుముందు నిజాంసాగర్ మండలం మాగి షుగర్ ఫ్యాక్టరీ విశ్రాంతి గృహంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. గడిచిన 70 ఏండ్లలో జరుగని అభివృద్ధి పనులు కేవలం మూడున్నరేండ్లలో చేసి చూపించామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 119 స్థానాల్లో 100 స్థానాలు టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. కార్యక్రమాల్లో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లిలో ఊరకుంట చెరువు వద్ద సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ గుత్తా, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

15 నెలల్లో శ్రీశైలం సొరంగ మార్గం పూర్తికి చర్యలు

- నల్లగొండ ఎంపీ గుత్తా

పెద్దఅడిశర్లపల్లి/చందంపేట: నల్లగొండ ప్రజల చిరకాల స్వప్నమైన శ్రీశైలం సొరంగమార్గాన్ని 15 నెలల్లో పూర్తి చేయనున్నట్టు ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో ఇటీవల జలకళ సంతరించుకున్న చెరువులను దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం పెద్దఅడిశర్లపల్లి మండలం కోదండాపురం మెట్రోవాటర్‌ప్లాంట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఏడు టీఎంసీల సామర్థ్యం కలిగిన నక్కలగండి, 0.20 సామర్థ్యం కలిగిన పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. త్వరలో పూర్తిస్థాయి భూసేకరణ చేపట్టి 14కి.మీటర్ల ఓపెన్ కెనాల్ పనులు కూడా చేపడుతామని తెలిపారు. టన్నెల్ తవ్వకం 31కి.మీటర్లు పూర్తయ్యిందని, మరో 12కి.మీ. తవ్వాల్సి ఉన్నదన్నారు. వచ్చే ఏడాది నుంచి డిండి సీపేజీతో పాటు మూడు టీఎంసీల నీటిని నక్కలగండి రిజర్వాయర్‌లో నిల్వ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

రాష్ట్రంలో వైద్యవిప్లవం

తెలంగాణ స్ఫూర్తితోనే హెల్త్ స్కీం యోచనలో కేంద్రం ■ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ఉద్యోగులు, జర్నలిస్టులకు వైద్యం ■ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచే ఎలక్ట్రానిక్ హెల్త్‌కార్డుల జారీ

భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ■ ఇంత చక్కటి వైద్య విధానం మరెక్కడా లేదు: మంత్రి లక్ష్మారెడ్డి

సంగారెడ్డి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: 'తెలంగాణలో వైద్య విప్లవం కొనసాగుతున్నది. ఇందుకు సర్కారు దవాఖానల్లో అందుతున్న సేవలు, రెట్టింపవుతున్న ప్రసవాలు, వైద్యం కోసం క్యూ కడుతున్న రోగుల సంఖ్యే నిదర్శనం. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నది. మన రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకునే కేంద్ర ప్రభుత్వం హెల్త్ స్కీం తెచ్చే యోచనలో ఉన్నది' అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సర్కారు దవాఖానలకు స్వర్ణయుగం వచ్చిందని, ఇతర రాష్ట్రాలు తెలంగాణను చూసి నేర్చుకుంటున్నాయన్నారు. మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి సంగారెడ్డిలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. వెల్‌నెస్ సెంటర్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టులు, విశ్రాంత ఉద్యోగులు ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండా వైద్య సేవలు పొందవచ్చని సూచించారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఇలాంటి వైద్య సేవలు ఎక్కడా అందడం లేదన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాల మెరుగు కోసం ప్రభుత్వం కోట్లాది నిధులు వెచ్చిస్తున్నదని, ఈ క్రమంలోనే వైద్యశాలలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. ప్రసవాల కోసం సర్కారు దవాఖానలకు క్యూ కడుతున్నారని, ప్రసవాల్లో సంగారెడ్డి దవాఖాన నంబర్-1 స్థానంలో నిలిచిందన్నారు. ఆరు నెలల్లోనే సర్కారు దవాఖానల్లో ప్రసవాలు పొందిన 1.50 లక్షల మంది కేసీఆర్ కిట్లు తీసుకున్నారని చెప్పారు. 30 ఏండ్ల వయసున్న మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలో 2.50 లక్షల మందికి ఈ పరీక్షలు పూర్తయినట్టు తెలిపారు. ప్రయోగాత్మకంగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచే ఎలక్ట్రానిక్ హెల్త్‌కార్డుల జారీకి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం సర్కారు వైద్యాన్ని గాలికి వదిలేసిందని హరీశ్‌రావు విమర్శించారు. జీతాలు పెంచాలని కోరిన వారిని గత ప్రభుత్వాలు గుర్రాలతో తొక్కించి చంపితే, సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌కు పిలిచి జీతాలు పెంచుతున్నారని మంత్రి గుర్తు చేశారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాం లో దవాఖానలకు వస్తే గోలీలు ఇచ్చి పంపేవారని, ఇప్పుడు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నామన్నారు. ఇక్కడి వైద్య విధానం దేశంలో మరెక్కడా లేదన్నారు. ఇక్కడి వైద్య సేవలపై కేంద్ర ప్రభుత్వం కూడా ఆరా తీసిందన్నారు. హెల్త్‌కార్డుల ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టులకు వైద్య సేవ లందిస్తున్నామన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి వైద్య సేవలు అందడం లేదన్నారు. కార్యక్రమంలో బేవరేజస్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, రాములు నాయక్, భూపాల్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో పద్మ, టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల స్వామి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, కలెక్టర్ మాణిక్కరాజు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, చిత్రంలో మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, బేవరేజెస్ చైర్మన్ దేవీప్రసాద్, ఎమ్మెల్సీలు పాతూరి, రాములునాయక్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి

రైతు మృతిపై విపక్షాల రాద్ధాంతం

- అన్నదాత కుటుంబానికి సర్కార్ అండ
- బాధితులను రెచ్చగొట్టేందుకు కాంగ్రెస్ విఫలయత్నం

వరంగల్ ప్రధాన ప్రతినిధి/కాశీబుగ్గ, నమస్తే తెలంగాణ: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ప్రమాదవశాత్తు బుధవారం తెల్లవారుజామున పత్తి రైతు బానోతు రవి(40) మృతి చెందగా, ఈ ఘటనపై కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ సహా కమ్యూనిస్టు పార్టీలు రాద్ధాంతం చేశాయి. దీన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు తెల్లారేసరికి మార్కెట్‌లో వాలిపోయాయి. ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా నిలువగా, విపక్షాలు తోకముడిచాయి. వివరాలు ఇలా.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాదాపురం పరిధి దేవునిగుట్ట తండాకు చెందిన రైతు రవి వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తిని ఆరబెట్టి, అక్కడే తాటిపత్రి కప్పుకొని నిద్రపోయాడు. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అతనిపైనుంచి డీసీఎం వెళ్లడం తో తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనే ఉన్న తండ్రితో పాటు అన్నదమ్ములు, ఇతర రైతులు అతడిని మొదట ప్రైవేట్ దవాఖానకు, అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించగా, సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనతో రాజకీయ లబ్ధిపొందాలని కాంగ్రెస్ సహా అన్ని పక్షాలు ఎంజీఎంకు చేరుకున్నాయి. పాలకుర్తి నియోజకర్గం నుంచి భారీ ఎత్తున కార్యకర్తల్ని తరలించేందుకు కాంగ్రెస్, బీజేపీ ఎవరికి వారు పోటీపడ్డాయి. బాధిత కుటుంబాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలుచేశాయి. ఈ తతంగం అంతా సాగుతున్నా, బాధిత కుటుంబానికి బాధ్యతాయుతంగా సహాయం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అప్పటికప్పుడు రూ.5లక్షల చెక్కు పంపగా, దాన్ని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎంజీఎం మార్చురీ వద్ద మృతుడి భార్యకు అందజేశారు. అంతేకాకుండా ఎమ్మెల్యే సొంతంగా రూ.లక్ష అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌తోనూ రూ.లక్షా వెయ్యి ఇప్పించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలబడతామని హామీ ఇవ్వడంతో పాటు ఆ కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విపక్షాలకు ఏం చేయాలో అర్థం కాక వెనుదిరగాల్సిన పరిస్థితి ఎదురైంది.



రూ. 5లక్షల పరిహారం చెక్కును మృతుడి భార్య ముత్యాలుకు అందజేస్తున్న ఎమ్మెల్యే దయాకర్‌రావు



గద్వాల మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ మునిమనుమడు కృష్ణరాంభూపాల్ గురువా రం గద్వాలలో పర్యటించారు. సంస్థానాధీశుల కాలం నాటి ఎన్నో అపురూప కట్టడాలు, ప్రదేశాలకు రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. - గద్వాలటౌన్

కృష్ణానదిలో ఆగిన మరబోటు

కొల్లాపూర్‌టౌన్: నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం నుంచి 22మందితో శ్రీశైలానికి వెళ్తున్న మరబోటు కృష్ణానది మధ్య భాగం, కర్నూల్ జిల్లా ప్రాంతం వద్ద ఆగిపోయింది. చేపల వలలు మరబోటుకు చుట్టుకోవడంతో నిలిచిపోయింది. సమాచారం అందుకున్న కొల్లాపూర్ సీఐ శ్రీరామ్ సైదాబాబు, ఎస్సై వెంకటసత్యనారాయణ సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రైవేట్ మరబోటు, పడవల సహాయంతో ప్రయాణికులను సురక్షితంగా ఒడ్డుకు తరలించారు.

పిల్లలను కడతేర్చాలనుకున్న తండ్రి

కాగజ్‌నగర్,నమస్తే తెలంగాణ: పురుగుల మందు కలిపిన అన్నం తినిపించి తన పిల్లలనే చంపాలనుకున్నాడో తండ్రి. సకాలంలో తల్లి గమనించడంతో ఆ పిల్లలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. కాగజ్‌నగర్‌కు చెందిన గజ్జెల్లి వెంకటేశ్, లక్ష్మి దంపతులకు మణికంఠ (6), మనీష్(3) అనే ఇద్దరు కుమారులు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తలు తరుచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన వెంకటేశ్ గురువారం ఉదయం 6 గంటల సమయంలో పత్తి పంట కోసం తెచ్చిన పురుగుల మందును అన్నంలో కలిపి పిల్లలకు తినిపించేందుకు యత్నించాడు. గమనించిన లక్ష్మి వెంటనే అన్నం పల్లెంతోపాటు పురుగుల మందు డబ్బాను తోసేసింది. దీంతో పిల్లలకు ప్రాణాపాయం తప్పింది.


ఆర్డీఎస్ నీటి కోసం ఇండెంట్

- నేడు కర్ణాటక ప్రభుత్వాన్ని కోరే అవకాశం

అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే తుంగభద్ర డ్యాం నుంచి ఆర్డీఎస్ నీటి వాటాలో 1.5టీఎంసీలను తీసుకున్న తెలంగాణ సర్కారు, మరో మారు 1.1టీఎంసీల నీటివిడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి విడుదల కోరుతూ ఈఎన్‌సీ మురళీధర్ టీబీ బోర్డుకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు ఈ ఏడాది 3.5టీఎంసీలను కృష్ణాబోర్డు కేటాయించింది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో దాదాపు ఆరువేల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. గతంలో వానకాలంలో తుంగభద్ర నదికి వరద నీరు రావడంతో రైతులు పంటలు సాగుచేశారు. ప్రస్తుతం పంటలు చివరి దశలో ఉండటంతో మరోమారు నీటిని విడుదల చేయాలని ఆర్డీఎస్ అధికారులను రైతులు కోరుతున్నారు. ఆర్డీఎస్ అధికారులు 1.5టీఎంసీలను విడుదల చేయాలని ఎస్ఈ, సీఈలకు ఇండెంట్ పంపారు. అన్ని రకాల పరిశీలించిన ఈఎన్‌సీ భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అనుమతితో 1.1టీఎంసీల నీటిని విడుదల చేయాలని టీబీ బోర్డుకు ఉత్తర్వులు జారీ చేసినట్టు సీఈ ఖగేందర్ 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా తెలంగాణ సర్కారు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని సీఈ పేర్కొన్నారు. శుక్రవారం టీబీ డ్యాం నుంచి నీటిని విడుదల చేయాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఏపీ ప్రభుత్వం ఆర్డీఎస్ నీటి వాటాతోపాటు కేసీ కెనాల్ ఇండెంట్ పెట్టేందుకు అంగీకారం తెలిపినట్లు తెలుస్తున్నది.

కటకటాల్లో కళాకారుడు

- పుస్తకాన్ని అచ్చేయించడానికి స్నాచింగ్
- ప్రజానాట్యమండలి కళాకారుడి అరెస్ట్



నిందితుడు వాకాటి నరసింహ

బంజారాహిల్స్: సొంతూరు చరిత్రకు ప్రాచుర్యం కల్పించేందుకు ఓ కళాకారుడు దొంగగా మారాడు. మహబూబ్‌నగర్ జిల్లా మాగనూరు మండలం కొల్పూరు గ్రామానికి చెందిన కే వాకాటి నరసింహ (25) ప్రజానాట్యమండలి సభ్యుడిగా ప్రదర్శనలు ఇచ్చేవాడు. ఇటీవల బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన నరసింహ బోడుప్పల్ సమీపంలోని హేమానగర్‌లో ఓ బిల్డింగ్‌లో వాచ్‌మన్‌గా చేరాడు. కళపై ఆసక్తి చంపుకోలేక రెండుపాటలను గత ఏడాది సీడీలుగా విడుదల చేశాడు. సొంతూరు చరిత్రను పుస్తకంగా వేద్దామని అంతా సిద్ధం చేసుకున్నాడు. అచ్చు వేద్దామంటే తన దగ్గర డబ్బు లేదు. అప్పు పుట్టలేదు. దాంతో మంగళవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్ నం.12 చౌరస్తావద్ద ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన బంజారాహిల్స్ క్రైం పోలీసులు సీసీ ఫుటేజీలను, సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా ఎరుపు రంగు యాక్టివా బైక్‌పై బ్యాగును లాక్కొని పారిపోయింది నరసింహ అని గుర్తించారు. దాంతో అతడిని అరెస్ట్ చేసి రూ.30 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌లో ఉన్న డబ్బుతో పుస్తకాన్ని అచ్చేయించాలని అనుకున్నానని నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు.






మహబూబ్‌నగర్ జిల్లా మల్లేపల్లివాసులకు కండువాలు కప్పుతున్న మంత్రి లక్ష్మారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన సర్పంచ్, కార్యకర్తలు

టీఆర్‌ఎస్‌లోకి వలసల జోరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లో వలసల జోరుగు సాగుతున్నది. గురువారం పెద్ద సంఖ్యలో పలువురు గులాబీ పార్టీలో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం మల్లేపల్లికి చెందిన 50 మంది మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో గులాబీ కండువాలు కప్పుకున్నారు. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం దుప్‌చెర్లకు చెందిన కాంగ్రెస్ సర్పంచ్ ఎరుకలి నర్సమ్మతోపాటు నలుగురు వార్డు సభ్యులు, వందమంది కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. జగిత్యాల జిల్లా చల్గల్‌లో 50 మంది టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి సంజయ్ కుమార్ సమక్షంలో, వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో పరకాలకు చెందిన టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు 150 మంది, కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, వివిధ వార్డుల బాధ్యులతోపాటు 35మంది సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సుగుణమ్మ ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండాలో కాంగ్రెస్‌కు చెందిన 50 మంది యువకులు టీఆర్‌ఎస్‌లో చేరారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
శుక్రవారం 9 ఫిబ్రవరి 2018

నేటి నుంచి సిద్దిపేటలో తెలంగాణ టీ20లీగ్ పోటీలు


మెదక్ జట్టు ఓనర్ జగన్‌మోహన్

సిద్దిపేట: సిద్దిపేటలోని మినీ స్టేడియం మరో మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీ వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టీ20 లీగ్ రెండవ దశ పోటీలకు మైదానం సిద్ధమైంది. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీలలో ఉమ్మడి 10 జిల్లాల జట్లు పోటీపడనున్నాయి.




మంచుపైనా దంచారు..

- గడ్డకట్టిన మంచు సరస్సుపై టీ20 మ్యాచ్
- సెహ్వాగ్ జట్టు (డైమండ్స్) పై అఫ్రిదీ టీమ్ (రాయల్స్) గెలుపు



సెయింట్ మారిట్జ్ (స్విట్జర్లాండ్): క్రికెట్ చరిత్రలోనే తొలి సారిగా గడ్డ కట్టిన సరస్సుపై టీ20 మ్యాచ్ జరిగింది. –3డిగ్రీల ఉష్ణోగ్రత..బంతి చేతికి తగిలితే ఝువ్వుమనాల్సిందే..ఇటువంటి పరిస్థితుల్లో చేతులకు గ్లౌజులు తొడుక్కుని, ఒంటి నిండా స్వెట్టర్, చలిని దరికి చేరనివ్వని దుస్తులతో మంచుపై టీ20 క్రికెట్ ఆడారు. సెయింట్ మారిట్జ్‌లో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో సెహ్వాగ్ నాయకత్వంలోని ప్యాలెస్ డైమండ్ జట్టుపై షాహిద్ అఫ్రిదీ కెప్టెన్సీలోని రాయల్స్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన డైమండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. డ్యాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ (62) మంచు వేదికలోనూ దంచికొట్టాడు. ఆండ్రూ సైమండ్స్ (40), కైఫ్ (19) జోగీందర్ (18) ఫరవాలేదనిపించారు. ఈ టోర్నీలో తొలి బంతికే బౌండరీ, అర్ధసెంచరీని సిక్సర్‌తో సాధించి సెహ్వాగ్ ఎక్కడైనా సెహ్వాగే అని నిరూపించాడు. 165 పరుగుల విజయ లక్ష్యాన్ని రాయల్స్ జట్టు 15.2 ఓవర్లలో ఛేదించింది. ఓవైస్ షా (34 బంతుల్లో 74 నాటౌట్), కల్లిస్ (36), ఎలియట్ (21 నాటౌట్) రాణించారు. ఇరుజట్ల మధ్య రెండో టీ20 శుక్రవారం జరుగనుంది.

క్వార్టర్స్‌లో భారత్


సింధు

అలోర్ సీటర్: ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 1–4తో జపాన్ చేతిలో ఓడినా... గ్రూప్–డబ్ల్యూలో ఒక విజయం, ఒక పరాజయంతో రెండోస్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. తొలి సింగిల్స్ ఆడిన పీవీ సింధు 21–19, 21–15తో యమగుచిపై నెగ్గింది. 36 నిమిషాల పోరులో తెలుగమ్మాయి ఆధిపత్యం చూపెట్టింది. తాజా విజయంతో సింధు ముఖాముఖి రికార్డును 5–3కు పెంచుకుంది. రెండో సింగిల్స్‌లో శ్రీకృష్ణ ప్రియా 12–21, 10–21తో సయాకా సాటో చేతిలో, మూడో సింగిల్స్‌లో అశ్విని పొన్నప్ప 14–21, 12–21తో ఆయా ఒహోరి చేతిలో ఓడారు. దీంతో జపాన్ 2–1 ఆధిక్యంలోకి వెళ్లింది. డబుల్స్‌లో సనోగిత–ప్రజక్తా సావంత్ 17–21, 17–21తో సాహిహో టనకా–కొహరు యోనెమోటో చేతిలో, అశ్విని–సిక్కీ రెడ్డి 18–21, 18–21తో మిసాకి ముస్తామో–ఆయకా తకహసి చేతిలో పరాజయం చవిచూడటంతో జపాన్ 4–1తో నెగ్గింది.

ఖేలో ఇండియా విజేతకు కేంద్రక్రీడల మంత్రి అభినందన



కరీంనగర్ స్పోర్ట్స్: ఖేలో ఇండియా ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆన్‌లైన్ స్పోర్ట్స్ క్విజ్‌లో జాతీయస్థాయిలో 2వ స్థానం సాధించిన కరీంనగర్ జిల్లాకు చెందిన మహ్మద్ కరీంను కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు. గురువారం రాత్రి న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కరీంను మంత్రి అభినందించారు.

స్పిన్నర్ల ప్రదర్శన అద్భుతం

- చాహల్, కుల్దీప్‌పై విరాట్ ప్రశంసలు



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో మణికట్టు స్పిన్ మాంత్రికులు యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ ప్రదర్శన అత్యద్భుతంగా ఉందని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసలు కురిపించాడు. ఈ ఇద్దరి ఆటతీరు నమ్మశక్యంగా లేదన్నాడు. అయితే వీళ్లను టెస్టు జట్టులోకి తీసుకునే అంశంపై పెద్దగా స్పందించలేదు. 'స్వదేశంలో ఫ్లాట్ బ్యాటింగ్ పిచ్‌లపై చాహల్, కుల్దీప్ వికెట్లు తీశారు. కాబట్టి ఇక్కడ కూడా సత్తా చూపెడుతారని తెలుసు. కఠిన పరిస్థితుల్లో కూడా టీ20ల్లో వికెట్లు పడగొట్టారు. అదే ఫామ్‌ను ఇక్కడా చూపెడుతున్నారు. ప్రత్యర్థిని దెబ్బతీయడంలో వీళ్ల పాత్ర అమోఘం' అని విరాట్ పేర్కొన్నాడు. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా.. వికెట్ల కోసం వీళ్లు చేస్తున్న ప్రయత్నాలు అద్భుతమన్నాడు. అసలు స్పిన్నర్ల ప్రదర్శనను వర్ణించడానికి మాటలు లేవన్నాడు.

పది నిమిషాల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్

అత్యాధునిక టెక్నాలజీతో వాహన సామర్థ్య తనిఖీ కేంద్రం

నల్లగొండ జిల్లా మల్కాపురంలో రూ.14.40 కోట్లతో నిర్మాణం

రోజుకు 250 నుంచి 300 వాహనాలను తనిఖీ చేసే సామర్థ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేవలం పది నిమిషాల్లో వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేసే అత్యాధునిక టెక్నాలజీని రాష్ట్ర రవాణాశాఖ అందిపుచ్చుకుంటున్నది. వాహన సామర్థ్య తనిఖీ కేంద్రాన్ని అత్యంత ఆధునిక టెక్నాలజీతో నల్లగొండ జిల్లా మల్కాపురంలో నెలకొల్పుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం పదెకరాల భూమిని కేటాయించగా, రూ.14.40 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో వాహన తనిఖీ కేంద్రాన్ని నిర్మిస్తున్నది. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో మల్కాపురం వాహన సామర్థ్య తనిఖీ కేంద్రానికి పెండింగ్‌లో ఉన్న మొత్తం రూ.3.50 కోట్లు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఈ నిధులతో అత్యధునిక వాహన తనిఖీ యంత్రాల కొనుగోలుకు రవాణాశాఖ సిద్ధమవుతున్నది. ఈ కేంద్రంలో రోజుకు 250 నుంచి 300 వాహనాలకు పరీక్షలు నిర్వహిస్తారు. నూతన టెక్నాలజీతో వాహానానికి ఉన్న హెడ్‌లైట్ల నుంచి చిన్నచిన్న మైనర్ డ్యామేజీలను సైతం గుర్తిస్తుంది.

మాన్యువల్ తనిఖీలకు చెక్

ఇప్పటివరకు అమలులో ఉన్న మాన్యువల్ వాహన ఫిట్‌నెస్ తనిఖీల వల్ల అవకతకలు జరిగేవి. వాహనం ఫిట్‌నెస్ లేకున్నా ఫిట్‌నెస్ ఉన్నట్టు సర్టిఫికెట్లు జారీచేసే అవకాశాలుండేవి. ఇలాంటి వాటికి చెక్‌పెట్టేందుకు సాంకేతిక వాహన తనిఖీ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తున్నది. ఒక వాహనం తనిఖీ కేంద్రంలోకి వెళ్లగానే వాహనానికి సంబంధించి ఏయే విభాగం రిపేర్‌లో ఉందనే అంశాలు సంబంధిత కంప్యూటర్‌లో నిక్షిప్తమవుతాయి. ఇలా పది ప్రధాన విభాగాలుగా విడదీసి కంప్యూటర్ ప్రింటౌట్ వస్తుంది. ఈ కేంద్రంలో నాలుగు చక్రాల వాహనాలతోపాటు త్రీవీలర్లకు కూడా సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు పది లక్షల ప్రైవేట్ టాక్సీ వాహనాలు, మరో 70 లక్షల సొంత నంబర్‌ప్లేట్ వాహనాలున్నాయి. వీటన్నిటికీ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలంటే చాలా ఇబ్బందులుపడాల్సి వస్తున్నది. ఈ కేంద్రం పనులు వేగవంతంగా పూర్తిచేయడానికి రవాణాశాఖ అధికారులు కృషిచేస్తున్నారు. ఇప్పటికే పరిపాలన భవనం పూర్తయింది. పరికరాల కోసం స్పెయిన్, స్వీడన్ దేశాలకు ఆర్డర్లిచ్చారు. కేంద్రం అందించనున్న నిధులతో మిషనరీల కొనుగోలు వేగవంతం కానుంది.



నల్లగొండ జిల్లా మల్కాపురంలో నిర్మాణంలో ఉన్న అత్యాధునిక టెక్నాలజీ వాహన సామర్థ్య తనిఖీ కేంద్రం

ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

వాహన సామర్థ్య తనిఖీ కేంద్రం పనితీరుపై రవాణాశాఖ అధికారులు గతంలో పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేశారు. ఢిల్లీ, బెంగళూరు, ముంబై నగరాల్లో ఈ కేంద్రాలు పనిచేస్తున్న తీరుతెన్నులకంటే అత్యంత అధునాతన టెక్నాలజీతో మల్కాపురంలో ఏర్పాటుచేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది మే నాటికి తనిఖీకేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రవాణాశాఖ సంయుక్త కమిషనర్ రమేశ్ తెలిపారు. మల్కాపురంలో నిర్మిస్తున్న తనిఖీ కేంద్రం దక్షణాది రాష్ట్రాల్లో మొదటిదిగా చెప్పవచ్చు. రోజుకు 250 నుంచి 300 వాహనాలను తనిఖీ చేసే సామర్థ్యంతో ప్రారంభిస్తున్నప్పటికీ, సామర్థ్యాన్ని మరింత పెంచుకొనే అవకాశాలున్నట్టు అధికారులు తెలిపారు.

అద్భుతంగా బ్రాహ్మణసదన్

- రూ.11 కోట్లతో నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం
- మూడు బ్లాకులతో జీ+2 భవనాలు
- డిసెంబర్ కల్లా పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ సదన్ భవనాన్ని అద్భుతంగా నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఇటీవల రోడ్లు భవనాలశాఖ టెండర్లను పిలిచింది. బ్రాహ్మణ భవన్‌ను మూడు బ్లాకులుగా నిర్మిస్తారు. ఇందులో రెండు బ్లాకులు జీ+2 భవనాలుగా, మరో బ్లాకు ఒక అంతస్తు మేరకు నిర్మిస్తారు. గోపన్‌పల్లిలో సుమారు 6.10 ఎకరాల్లో ఈ భవనాన్ని సుందరంగా నిర్మించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు కార్యాచరణ రూపొందించారు.

విశాలమైన గదులు

మొదటి రెండు బ్లాకుల్లో విశాలమైన గదులను నిర్మిస్తారు. మొదటి బ్లాకును రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు సంబంధించిన సమాచార కేంద్రం కోసం కేటాయించారు. మూడు అంతస్తుల్లో బ్రాహ్మణ సంక్షేమపరిషత్‌కు సంబంధించిన పూర్తిస్థాయి సమాచార వ్యవస్థను నూతన టెక్నాలజీతో ఏర్పాటుచేస్తారు. మూడంతస్తుల్లో 33,600 చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మాణాలు చేపడుతారు. పెద్ద ఆడిటోరియంతోపాటు ఫంక్షన్‌హాల్‌ను నిర్మిస్తారు. రెండో బ్లాక్‌లో మతగురువులకు వసతి సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు. ఈ బ్లాక్‌ను 8,820 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. మూడు అంతస్తుల్లో వివిధ మతగురువులు బస చేసేందుకు సౌకర్యాలుంటాయి. మూడోది టాయిలెట్ బ్లాక్‌ను 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తారు. ఈ మూడు బ్లాక్‌ల నిర్మాణానికి రూ.8.30 కోట్లను అంచనా వ్యయంగా నిర్ధారించారు.



బ్రాహ్మణసదన్ నమూనా

రూ.2.70 కోట్లతో ప్రహరీ

ఇప్పటికే బ్రాహ్మణసదన్ ప్రహరీ గోడ (కాంపౌండ్‌వాల్) ను నిర్మించేందుకు రూ. 2.70 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రహరీ నిర్మాణ పనులు వేగంగా నడుస్తున్నాయని ఆర్ అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి తెలిపారు. బ్రాహ్మణ సదన్ నిర్మాణం ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

ఢిల్లీ మెట్రోరైల్‌లో 1896 పోస్టులు

న్యూఢిల్లీలోని ఢిల్లీ మెట్రోరైల్ ప్రాజెక్టులోని ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఇంజినీర్, మెయింటెనర్ తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో ఖాళీలు**
- **డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్ పూర్తయినవారికి అవకాశం**
- **మెట్రో రైల్వేలో ఉద్యోగం**



వివరాలు:

ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనేది భారత ప్రభుత్వం, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీ జాయింట్ వెంచర్ కంపెనీ.

- ఎగ్జిక్యూటివ్ కేటగిరీ (రెగ్యులర్)-49. వీటిలో అసిస్టెంట్ మేనేజర్ (ఎలక్ట్రికల్-21, ఎస్ అండ్ టీ-12, ఆపరేషన్స్-8, ఫైర్-2, స్టోర్-2, ఎన్విరాన్‌మెంట్-1, ఐటీ-3)
- **ఎగ్జిక్యూటివ్ కేటగిరీ పోస్టులు (4 ఏండ్ల వ్యవధికి)- 92 ఖాళీలు.** వీటిలో అసిస్టెంట్ మేనేజర్ (ఎలక్ట్రికల్-25, ఎస్ అండ్ టీ-22, సివిల్-44, అలైన్‌మెంట్ డిజైన్-1)
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రికల్, ఎస్ అండ్ టీ, ఆపరేషన్స్, ఫైర్, స్టోర్, ఎన్విరాన్‌మెంట్, ఐటీ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. గేట్-2017 స్కోర్ కార్డ్‌లో అర్హత సాధించాలి.
- **పే స్కేల్:** రూ. 20,600-46,500/-
- **నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీ (రెగ్యులర్)-1513**

విభాగాలవారీగా ఖాళీలు:

- జూనియర్ ఇంజినీర్-440 ఖాళీలు (ఎలక్ట్రికల్-192, ఎలక్ట్రానిక్స్-135, మెకానికల్-87, సివిల్-24, ఎన్విరాన్‌మెంట్-2)
- **అర్హతలు:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత.
- మెయింటెనర్-1058 ఖాళీలు (ఎలక్ట్రీషియన్-317, ఎలక్ట్రానిక్ మెకానిక్-530, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్-33, ఫిట్టర్-178)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన సంస్థ/బోర్డు నుంచి సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 10,170-18,500/-
- అసిస్టెంట్ ప్రోగ్రామర్-9, లీగల్ అసిస్టెంట్-4, ఫైర్ ఇన్‌స్పెక్టర్-10, లైబ్రేరియన్-2
- **అర్హత:** కంప్యూటర్ సైన్స్‌లో డిప్లొమా/ బీఎస్సీ, బీసీఏ, బీఎస్సీ ఐటీ, ఎల్‌ఎల్‌బీ, బీఎస్సీ (ఫైర్), బీఎస్సీ (లైబ్రేరీ) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత
- **పే స్కేల్:** రూ. 14,000-26,950/-
- **నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీ (4 ఏండ్ల వ్యవధికి)-232**

విభాగాలవారీగా ఖాళీలు:

- జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్-7, ఎలక్ట్రానిక్స్-102, సివిల్-96), ఆఫీస్ అసిస్టెంట్-14, స్టోర్ అసిస్టెంట్-13)
- **పే స్కేల్:** రూ. 14,000-26,950/-
- **వయస్సు:** 2018 జనవరి 1 నాటికి 18 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ప్రొబేషనరీ పీరియడ్:** రెండేండ్లు
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ. 250/- బ్యాంక్ చలానా రూపంలో చెల్లించాలి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా.
- ఎగ్జిక్యూటివ్ పోస్టులకు మూడు దశల్లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రెండు దశల్లో నిర్వహించే పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారు. రాతపరీక్షకు రెండు పేపర్లు, ఆ తర్వాత ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టులు నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష సిలబస్:** జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (జనరల్ ఇంగ్లిష్ మెయింటెనర్-ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్ ఐటీఐఅభ్యర్థులకు మాత్రమే) లేదా సంబంధిత ట్రేడ్ విభాగాల్లో అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- పేపర్ 1&2లో ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కులను తగ్గిస్తారు.
- సీబీటీ పరీక్ష (పేపర్ 1&2) ఒకే రోజున నిర్వహిస్తారు. పేపర్-1ను 120 ప్రశ్నలకు 150 నిమిషాల్లో పూర్తిచేయాలి. పేపర్-2ను 60 ప్రశ్నలకుగాను 45 నిమిషాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** www.delhimetrorail.com

సిండికేట్ బ్యాంక్‌లో

మణిపాల్‌లోని సిండికేట్ బ్యాంక్‌లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- అసిస్టెంట్ జనరల్ మేనేజర్ - (రిస్క్ మేనేజ్‌మెంట్) - 1
- కంపెనీ సెక్రటరీ -1
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 21
- **హార్డ్‌కాపీలకు చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.syndicatebank.in

సిల్చార్ నిట్‌లో

అసోం సిల్చార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టులు:** లైబ్రేరియన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 2
- **వెబ్‌సైట్:** www.nits.ac.in

హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లో ఆపరేటర్లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ఆపరేటర్ (కాంట్రాక్ట్ ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- పదోతరగతి + ఐటీఐ ఉత్తీర్ణులకు అవకాశం
- నెలకు రూ. 40వేల జీతం
- రాతపరీక్ష ద్వారా ఎంపిక

వివరాలు:

హాల్ ఒక పబ్లిక్ సెక్టార్ కంపెనీ. ఇది నవతర్న హోదా కలిగి ఉంది. ప్రస్తుత ఖాళీలు లక్నో డివిజన్‌లో ఉన్నాయి.

- **పోస్టు:** ఆపరేటర్
- మొత్తం ఖాళీలు- 131 (జనరల్ -68, ఎస్సీ-26, ఎస్టీ -2, ఓబీసీ - 35)
- **విభాగాల వారీగా ఖాళీలు:** మెషినిస్ట్- 22, టర్నర్- 21, గ్రైండర్- 5, ఫిట్టర్- 59, ఎలక్ట్రానిక్స్ మెకానిక్- 15, ఎలక్ట్రీషియన్- 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్- 4 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు రెగ్యులర్/ ఫుల్‌టైం విధానంలో సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ+ ఎన్‌ఏసీ లేదా ఐటీఐ + ఎన్‌సీటీవీటీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018, జనవరి 1 నాటికి 28 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష

నోట్: లక్నోలోని హాల్ యాక్ససరీ డివిజన్‌లో ఈ ఖాళీలు ఉన్నాయి.

- **జీతభత్యాలు:** రూ. 40,000/- (కన్సాలిడేటెడ్)
- వీటికి అదనంగా రెగ్యులర్ ఉద్యోగులకు అందిచే క్యాంటీన్ సబ్సిడీ/అలవెన్సులు, నెల, వార్షిక ఇన్సెంటివ్స్ ఇస్తారు. గ్రూప్ ఇన్సూరెన్స్, రాత్రి షిఫ్ట్ అలవెన్సులు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 14
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 200/- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఎటువంటి ఫీజు లేదు.
- **వెబ్‌సైట్:** http://www.hal-india.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌బీసీసీలో 145 పోస్టులు

ఎన్‌బీసీసీ (ఇండియా) లిమిటెడ్‌లో వివిధ విభాగాల్లో మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్, ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

మొత్తం ఖాళీలు- 145. విభాగాల వారీగా...

- జనరల్ మేనేజర్ (ఇంజినీరింగ్) సివిల్ - 2, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఇంజినీరింగ్) సివిల్ - 5, డిప్యూటీ జీఎం (ఫైనాన్స్) -6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) - 16, మేనేజర్ (సివిల్) - 4, మేనేజర్ (ఫైనాన్స్)- 4, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్)- 19, డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్)- 5, సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ (సివిల్)- 20, సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రికల్)- 4, సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ (ఐటీ) - 2, అసిస్టెంట్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ) - 2, అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్)- 4, అసిస్టెంట్ మేనేజర్ (హెచ్‌ఆర్‌ఎం)- 4, మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఫైనాన్స్)- 4, జూనియర్ ఇంజినీర్ (సివిల్) - 20, జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)-3, జూనియర్ ఇంజినీర్ (ఐటీ) -2, జూనియర్ ఇంజినీర్ (మెకానికల్) -1 (ఓహెచ్), సీనియర్ స్టెనోగ్రాఫర్ - 1, గ్రేడ్ - III ఆఫీస్ అసిస్టెంట్ - 3 తదితర పోస్టుల ఖాళీలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- చివరితేదీ, అర్హతలు, వయస్సు తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** http://www.nbccindia.com

రైట్స్ లిమిటెడ్‌లో ఇంజినీర్లు

మినిస్ట్రీ ఆఫ్ రైల్వే పరిధిలో పనిచేస్తున్న రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్)లో మెకానిక్, ఎలక్ట్రికల్ విభాగంలో ఖాళీగా ఉన్న ఇంజినీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇది ఒక ప్రముఖ ఇంజినీరింగ్, కన్సల్టెన్సీ కంపెనీ. దీన్ని 1974లో ఏర్పాటుచేశారు. ఈ సంస్థ 2002లో మినీరత్న హోదా పొందింది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 32
- అడిషనల్ జనరల్ మేనేజర్ (ఎలక్ట్రికల్)-3
- టెక్నికల్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్)-9 పోస్టులు
- టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్)- 10 పోస్టులు
- అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్)-10 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచిలో బీఈ/బీటెక్ లేదా డిప్లొమాలో ఉత్తీర్ణత.
- **ప్రొబేషనరీ పీరియడ్:** రెండేండ్లు
- **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 21
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.rites.com

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్‌ఈఆర్)లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐఐఎస్‌ఈఆర్ కేంద్ర మానవ వనరుల శాఖ పరిధిలోని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ.

- **కోర్సులు:** ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీ
- ఈ ప్రవేశాలు ఆగస్టు 2018 కోసం.



- **వెబ్‌సైట్:** www.iiserpune.ac.in